తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక


నవంబరు 2019. వెల రూ.5/-






## తిరుమల తిరుపతి దేవస్థానముల
# ధర్మకర్తల మండలి


**తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన ధర్మకర్తల మండలిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అధ్యక్షుడు, సభ్యులు, ఎక్స్-అఫిషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులను నియమించింది. వీరిచే తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి, అదనపు కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారి, ఉన్నతాధికారులు ప్రమాణ స్వీకారం చేయించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.**




శ్రీ వై.వి. సుబ్బారెడ్డి
పాలకమండలి అధ్యక్షులు



శ్రీ యు.వి. రమణమూర్తి రాజు
సభ్యులు




శ్రీ యం. వెంకటమల్లికార్జున రెడ్డి
సభ్యులు



శ్రీ కె. పార్థసారథి
సభ్యులు




శ్రీ పెరిగెల మురళి కృష్ణ
సభ్యులు



శ్రీ కృష్ణమూర్తి వైద్యనాథన్
సభ్యులు



శ్రీ నారాయణస్వామి శ్రీనివాసన్
సభ్యులు



శ్రీ జె. రామేశ్వర రావ్
సభ్యులు




శ్రీమతి వి. ప్రశాంతి
సభ్యులు



డా॥ బి. పార్థసారథి రెడ్డి
సభ్యులు




డా॥ నిచిత ముప్పవరపు
సభ్యులు




శ్రీ నాదెళ్ల సుబ్బారావ్
సభ్యులు




శ్రీ డి.పి. అనంత
సభ్యులు



శ్రీ రాజేష్ శర్మ
సభ్యులు




శ్రీ రమేష్ శెట్టి
సభ్యులు



శ్రీ గుండవరం వెంకట భాస్కరరావ్
సభ్యులు



శ్రీ మూరం సెట్టి రాములు
సభ్యులు



శ్రీ డి. దామోదర్ రావ్
సభ్యులు

మరి కొంత మంది మండలి సభ్యుల వివరాలు 55వ పుట లో...



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-04వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** శూరాః= శూరులు; మహేష్వాసాః= గొప్పవిలుకాండ్రు; యుధి= యుద్ధమునందు; భీమార్జునసమాః= భీమార్జునులతో సమానమైన; అత్ర= ఈ పాండవసేనయందు; యుయుధానః= సాత్యకి; విరాటః= విరాటుడు; చ= మరియు; మహారథః=మహారథుడైన; ద్రుపదః చ= ద్రుపదుడును.

**భావం:** ఈ సేనావాహినిలో భీమార్జునులతో సరితూగువారును, శూరులైన సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు మొదలగువారు కలరు.

## పద్మావతీశ్రీనివాసుల పెండ్లికి కదలిరండి...

పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసలఁ బేరంటాండ్లు దేవుని పెండ్లికిని


శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁ బెండ్లి ముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె
దేవతలు రారో దేవుని పెండ్లికిని

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలఁ దలఁ బ్రాలు నేఁడు
గంధమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరిపెండ్లికిని

అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలితిరుణాళ్లకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరములివె
కదలి రారో పరుష ఘనులపెండ్లికిని

(అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-03, సంకీర్తనం-194)





"శ్రీపద్మావతీశ్రీనివాసుల కమనీయమైన పెండ్లి ముహూర్తం ఈనాడే, భేరులు మ్రోగుతున్నాయి. అదిగో! గరుడ ధ్వజం ఎగురుతూ ఉంది. ఓ దేవతలారా! దేవ దేవుని పెండ్లికి రారండి. కమలాదేవి కాముని తండ్రియగు విష్ణుదేవుల పెండ్లిపందిట్లో తలంబ్రాల వేడుక ఈనాడే! పెండ్లిపందిట్లో కలువపూలదండలు వ్రేలాడ దీశారు. చందనతాంబూలాలు ఇస్తారు. ఓ మునులారా! వాటిని అందుకోవడానికి రావలసింది. అదో! అలమేలుమంగకు వేంకటాచలపతికి తొలి తిరునాళ్లలో నేడే మొక్కెదము. శ్రీవిభుడు భక్తుల ముందు ఊరేగుతూ వరములిస్తున్నాడు. ఓ యాత్రికులారా! ఘనమైన శ్రీపద్మావతీశ్రీనివాసుల పెండ్లి వేడుకలకు అందరూ కదలిరండి" అంటూ నంద కాంశ సంభూతుడైన అన్నమయ్య శ్రీపద్మావతీశ్రీనివాసుల పెండ్లి వేడుకలను వేనోళ్ల కీర్తించారు.

# 'శ్రీ వారి సేవ' - వాలంటీర్లకు మార్గదర్శకాలు

01) శ్రీవారి సేవలో ఒకవారంపాటు సేవలందించేందుకు పదిమంది సభ్యులకు తక్కువ కాకుండా ఉన్న బృందానికి అర్హత లభిస్తుంది.

02) నిస్వార్థసేవలు అందించేందుకు ఈ సభ్యులకు ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉండాలి. స్త్రీ, పురుష భేదం లేదు. హిందువులకు మాత్రమే ప్రవేశం.

03) ఆసక్తిగల సమూహంలోని సభ్యులు వారిపేరు, చిరునామా, వయస్సు, స్త్రీలు/పురుషులు, వృత్తి, స్టాంప్‌సైజ్ ఫోటో, టెలిఫోన్ నంబరు మొదలైన వివరాలతో ముందస్తుగా "ప్రజాసంబంధాధికారి, తి.తి.దే. పరిపాలనాభవనం, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి- 517 501" అను చిరునామాకు పంపాలి. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు- 0877-2263544, 2263293.

04) శ్రీవారిసేవకులందరూ సేవకు వచ్చునప్పుడు ఒరిజినల్ ఆధార్‌కార్డు మరియు జిరాక్స్‌కాపిని తప్పనిసరిగా తీసుకురావలెను. ఆధార్‌కార్డు / ఓటర్ కార్డు లేకుండా సేవలు కేటాయించబడవు.

05) శ్రీవారిసేవకు వచ్చే గ్రూపు లీడరు లేదా కో-ఆర్డినేటర్ వాలంటీర్ల పూర్తి వివరాలను తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లో అందజేయాల్సి ఉంటుంది.

06) శ్రీవారి సేవకులు తమవెంట చిన్నపిల్లలను, వృద్ధులను, వ్యాధిగ్రస్తులను తీసుకురాకూడదు. ఒకవేళ తీసుకువస్తే వారిని ఎట్టి పరిస్థితుల్లోను సేవకు అనుమతించరు.

07) సభ్యులు చేయు ఎటువంటి పొరపాట్లకైనా టీమ్‌లీడర్లే బాధ్యత వహించవలెను.

08) సేవకులను తిరుమలకు తీసుకువచ్చినప్పటి నుండి తిరిగి సొంత ప్రాంతానికి చేర్చు వరకు టీమ్‌లీడర్లు పూర్తి బాధ్యత వహించవలెను.

09) సేవకులు తమకు కేటాయించిన తేదీల్లో ఉ.10-00 గంటల నుండి సా.5-00 గంటల లోపు తిరుమలలోని శ్రీవారి సేవాసదన్‌లోని ఏ.ఇ.ఓ. / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ వారికి రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

10) సేవకులకు సేవాసదన్‌లో ఉచిత బస కల్పించబడుతుంది. పురుష, స్త్రీ సేవకులకు తిరుమల సేవాసదన్ నందు వేరు వేరుగా వసతి కేటాయించబడును.

11) శ్రీవారి సేవాసదన్‌లో సేవకులకు గుర్తింపు కార్డులందించి డ్యూటీలు కేటాయిస్తారు. సేవకులు ప్రతిరోజూ కనీసం ఆరు గంటలపాటు సేవ చేయాల్సి ఉంటుంది.

12) ప్రతిరోజూ ఉ.9 నుండి 10 గం॥ల వరకు, సా.6 నుండి 7 గం॥ల వరకు భజన, సత్సంగం మరియు శిక్షణ తరగతులకు హాజరు కావాలి. ఉదయం సేవ ఉన్నవారు సాయంత్రం, సాయంత్రం సేవ ఉన్నవారు ఉదయం శిక్షణ తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

13) సేవవిధుల్లో ఉన్నప్పుడు మాత్రమే శ్రీవారిసేవ స్కార్ఫ్‌లు ధరించాలి.

14) ఎల్లప్పుడు "గోవింద" నామాన్ని స్మరిస్తూ భక్తులను "గోవింద" అని సంబోధించాలి.

15) శ్రీవారిసేవ పూర్తిగా యాత్రికులకు సహాయం చేసేందుకు ఉద్దేశించిన స్వచ్ఛంద సేవ మాత్రమే. సేవకోసం టీమ్‌లీడర్లకుగాని, సిబ్బందికి గాని ధనరూపంగా, వస్తురూపంగా ఎలాంటి చెల్లింపులు చేయ నవసరం లేదు.

16) ప్రతి శ్రీవారి సేవకుడిని హిందువుగా గుర్తించేందుకు తిరునామం/తిలకం లేదా కుంకుమ/చందనం బొట్టు ధరించాలి.

17) శ్రీవారి సేవకులు భక్తులలో స్వామివారిని దర్శిస్తూ అంకితభావంతో సేవ చేయాల్సి ఉంటుంది.

18) శ్రీవారి సేవకులు తమకు కేటాయించిన ప్రదేశంలో మాత్రమే సేవ చేయాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా శ్రీవారి అలయంలో సేవ కేటాయించబడును.

19) శ్రీవారి సేవాసదన్‌లలో టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోండి. వసతినందు నీరు, విద్యుత్‌లను వృథా చేయరాదు.

20) రాత్రివేళల్లో తమ వసతిసముదాయాల్లో పురుషసేవకులు షార్ట్‌లు, మహిళాసేవకులు నైటీలు ధరించరాదు.

21) శ్రీవారిసేవలో నిర్దేశించిన నియమనిబంధనలను ఏదేని పరిస్థితుల్లో శ్రీవారిసేవకులు అతిక్రమిస్తే వారిని రెండేళ్లవరకు సేవకు అనుమతించరు.

22) సేవాసదన్‌లో శ్రీవారిసేవకుల కార్యకలాపాలను ఇద్దరు లేదా ముగ్గురు శ్రీవారిసేవ కో-ఆర్డినేటర్‌లు పర్యవేక్షిస్తారు. దయచేసి వారికి సహకరించండి.

## ఆన్‌లైన్‌లో శ్రీవారిసేవ

01) శ్రీవారిసేవకు వచ్చుటకు ఆసక్తిగలవారు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనవచ్చు. www.tirumala.org వెబ్‌సైట్‌లో శ్రీవారిసేవ అనే లింకు ద్వారా సేవకు నమోదు చేసుకోవాలి.

02) ప్రస్తుతం ఆన్‌లైన్‌నందు 25-40 సం॥ వారికి 3 రోజులు, 18-60 సం॥ వారికి 4 రోజులు (లేదా) 7 రోజులు శ్రీవారిసేవ అందుబాటులో ఉన్నాయి.

03) హుండీ కానుకలు లెక్కించేందుకు పరకామణి సేవ, లడ్డూకౌంటర్లలో ప్రసాదాలు అందించేందుకు లడ్డూ ప్రసాద సేవ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు సేవలందించేందుకు యాత్రికుల సంక్షేమ సౌకర్యాల సేవ(పిడబ్ల్యుఎఫ్ఎస్), ఆలయ శుభ్రత సేవ(టిసిడి)లను కూడా ఆన్‌లైన్‌లో మాత్రమే బుక్ చేసుకోవచ్చు.

**డ్రెస్‌కోడ్ - పురుషులు :** తెలుపు షర్ట్ లేదా కుర్తా, ప్యాంటు లేదా పంచ లేదా పైజామా;

**స్త్రీలు :** మెరూన్ బార్డర్‌తో కూడిన ఆరంజ్ కలర్ చీర, మెరూన్ బార్డర్ రవికె (లేదా) ఆరంజ్ కలరు కుర్తా, మెరూన్ కలరు పైజామా, మెరూన్ కలరు చున్నీ



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50    నవంబరు, 2019    సంచిక : 06


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| వచ్చెను... అలమేలుమంగ!! | డా॥ ఆకెళ్ల విభీషణశర్మ | 07 |
| సందేహాలు - సమాధానాలు | డా॥ శివపురం మురళీధరరావ్ | 12 |
| మనోనిగ్రహానికి మార్గం | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 13 |
| శ్రీకృష్ణభగవద్విజయము | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 15 |
| పెత్తనమంతా... పద్మావతీదేవిదే!! | ఆచార్య కె.జె.కృష్ణమూర్తి | 18 |
| హరిగాన మహిమ చాటే... కైశికద్వాదశి | డా॥ సూరపరాజు వసంతకుమారి | 20 |
| పేయాళ్వార్ పాశురాలలో 'పెన్నిధి' | ఆచార్య కె.సర్వోత్తమరావు | 23 |
| శ్రీమహాలక్ష్మీ చతుర్వింశతి నామావళి | శ్రీ యం.జి.రామచంద్రన్ | 26 |
| దివ్యక్షేత్రం తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| శ్రీధన్వంతరి ముపాస్మహే | డా॥ ఎస్.లక్ష్మి | 33 |
| శ్రీవేదాంతదేశికులవారి "రఘువీరగద్యం" | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 34 |
| ప్రియవ్రత మహారాజు | డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్ | 36 |
| చరిత్రలో 'తిరుచానూరు' క్షేత్రం | శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు | 38 |
| కొండలరాయుడే... కొండంత అండ..! | శ్రీమతి ఉమాదేవి దార్వేముల | 40 |
| యక్షప్రశ్నలు | మాస్టర్ కె.బలరామశ్రీకృష్ణగణేష్ | 41 |
| రక్షాప్రభావం | శ్రీ కె.వీరాస్వామి | 43 |
| పూదత్తాళ్వార్ల సూక్తులలో 'పద్మావతి' | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 45 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 46 |
| ఆహారం ఆరోగ్యదాయకం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 52 |


ముఖచిత్రం : శ్రీపద్మావతీఅమ్మవారు, తిరుచానూరు
వెనుక చిత్రం : పంచమీతీర్థం, తిరుచానూరు


గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకుడు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

శ్రీ పి.శివప్రసాద్,
విశ్రాంత చిత్రకారుడు, తి.తి.దే., తిరుపతి

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333



వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

## సంపాదకీయం

# అలమేలుమంగమ్మ అవతరించిన ఆనందమయవేళలో..!!

అందాల భూలోకంలో **అలమేలుమంగమ్మ** అవతరించిన గాథ అద్భుతం! సహస్రదళాల బంగారుపద్మంలో ఆ అమ్మ **"పద్మావతీదేవి"**గా ఆవిర్భవించిన ఘట్టం ఆశ్చర్యకరం! అంతటి ఆనందమయవేళను గూర్చి తెలుసుకోవాలంటే, ముందుగా శ్రీవేంకటేశ్వరస్వామి **"శ్రీనివాసుడు"**గా ఎలా అయ్యాడో తెలుసుకుంటే చాలు! అమ్మ **అలమేలుమంగ,** అయ్య ఆనందనిలయుడు లోకకల్యాణం కోసం భూలోకానికి తరలి వచ్చిన దివ్యవృత్తాంతమూ తెలియవస్తుంది.

**'కలౌ వేంకటనాయకః!'** అన్న ప్రశస్తితో, భూలోకవైకుంఠం తిరుమలకు వచ్చిన వేంకటేశ్వరుడు, **"శ్రీ మహాలక్ష్మి"** లేకుండా, తానొక్కడే భక్తులకోరికలను సంపూర్ణంగా తీర్చలేనేమోనని భావించాడు. కొల్హాపురక్షేత్రంలోఉన్న మహాలక్ష్మి దగ్గరికి వెళ్లాడు. అక్కడ పదేండ్లపాటు ఆ తల్లి దర్శనంకోసం తిరుమలేశుడు పరితపించాడు. ఇంతలో అశరీరవాణి ఆదేశంతో సువర్ణముఖరీ నదీతీరానికి వచ్చి, పద్మసరోవరాన్ని ప్రతిష్ఠించాడు. అక్కడ పండ్రెండేండ్లపాటు మహాలక్ష్మి దయకోసం తపస్సు చేశాడు.

ఒకానొక కార్తికమాసాన (సౌరమానం ప్రకారం) శుద్ధపంచమీ శుక్రవారంనాటి అభిజిత్ లగ్నంలో, శ్రీమహాలక్ష్మి పద్మసరోవర దివ్యజలాల్లో ఎన్నెన్నో అందాలు విరజిమ్ముతున్న వేయిదళాల బంగారుపద్మంలో అవతరించింది. వింత వింత తేజస్సులతో అంతులేని ఆనందాలతో అలంకరణలతో బంగారుపద్మంలో ఆవిర్భవించిన శ్రీమహాలక్ష్మిని బ్రహ్మాదిదేవతలు **"పద్మావతీదేవి"** అన్నారు. పద్మంపైన ప్రకాశిస్తున్న ఆ దివ్యకాంతను మరికొందరు **"అలర్ మేల్ మంగ"** అని స్తుతించారు. వెంటనే జగత్కల్యాణంకోసం పరితపిస్తున్న తిరుమలేశుని చెంతకు వచ్చింది అలమేలుమంగ! తన మెడలోని కలువపూల దండను శ్రీవేంకటేశుడు ఆ తల్లి కంఠంలో అలంకరించి, ఆమెను ఆలింగనం చేసుకొన్నాడు. తన హృదయంలో **"వ్యూహలక్ష్మి"**గా పదిలంగా ప్రతిష్ఠించుకొని తిరుమలకు పయనమయ్యాడు. కాని బ్రహ్మాదిదేవతల ప్రార్థనమేరకు, ఆనాటి నుంచి తాను అవతరించిన పద్మసరోవరతీరాన కూడా **"అలమేలుమంగ", "పద్మావతి"** అనే పేర్లతో శ్రీస్వామివారు లేకుండానే స్వతంత్రంగా **"వీరలక్ష్మి"**గా అర్చామూర్తిగా పూజలందుకొంటూ వరాలను గుప్పిస్తున్నది. ఆనాడు బ్రహ్మాదిదేవతలు **'శ్రీపద్మావతీఅమ్మవారికి'** నిర్వహించిన బ్రహ్మోత్సవాలు నేటికీ ఘనంగా నిరాఘాటంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ ఉత్సవాల చివరిరోజున **"పంచమితీర్థం"**నాడు తిరుమలశ్రీవారు కానుకగా **"చీర రవిక, పసుపు కుంకుమ, నగలు, పిండివంటల సారె"**ను ఏనుగు అంబారీపైన అమ్మవారికి పంపించడం నేటికీ ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం!

**అమ్మ అలమేలుమంగ సాక్షాత్తు ఆనందనిలయుని దయాస్వరూపం! ఆ తల్లి సర్వవేళలా, సర్వప్రదేశాల్లో, సర్వావస్థల్లో భక్తులచేత ఆశ్రయింపబడుతుంది. భక్తులకోసమే తానూ శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆశ్రయిస్తుంది. ముందుగా తాను భక్తుల కోరికలను ప్రార్థనలను చక్కగా వింటుంది. తాను వినడమేగాక, తన విభుడు శ్రీవేంకటేశునికి వినిపించి, ఒత్తిడి చేసి వరాలిప్పిస్తుంది. వాత్సల్యంతో భక్తుల దోషాలను పోగొడుతుంది. ఒక్కొక్కసారి కొన్ని దోషాలను విశిష్టగుణాలుగా చూపిస్తూ కొండలరాయని కోపాన్ని తగ్గిస్తుంది. తిరుమల ఆనందనిలయుని వక్షఃస్థలంలో "వ్యూహలక్ష్మి"గా, తిరుచానూరులో 'పద్మావతీదేవి', 'అలమేలు మంగ' అనే పేర్లతో అర్చామూర్తిగా తాను ప్రకాశిస్తూ, సర్వలోకాలను ప్రకాశింపజేస్తున్నది పరమదయామయి శ్రీపద్మావతీ అమ్మవారు.**

ఇన్ని విశిష్టగుణాలతో ప్రకాశిస్తున్న అమ్మ అలమేలుమంగమ్మ ఆవిర్భవించిన **'పంచమితీర్థం'** వేడుకల్లోను, అంతకంటె పదినాళ్ల ముందుగా ప్రారంభమై, ప్రతిపూటా, మహారాజ్ఞిగా, శేషవాహనంలో **"అనంతలక్ష్మి"**గా, హంసపై **"సరస్వతి"**గా, కల్ప వృక్షంలో **"కామితార్థ ప్రదాయిని"**గా, గజవాహనంపై **"గజలక్ష్మి"**గా, గరుడవాహనంపై **"శ్రీవేంకటాద్రిలక్ష్మి"**గా, హనుమంతునిపై **"సీతాలక్ష్మి"**గా... ఇలా ఎన్నెన్నో వాహనాలమీద దర్శనమిచ్చే అనంతవిభవాలరాణి, శ్రీఆనందనిలయుని పట్టపురాణి అలమేలుమంగమ్మ కార్తికబ్రహ్మోత్సవ వేళల్లో భక్తులందరూ పాల్గొని, కన్నులారా వీక్షిస్తూ, చేతులెత్తి జోతలుపెడుతూ, నోరారా కీర్తిస్తూ అనంతమైన ఆధ్యాత్మిక ఆనందాలను మనసారా జుర్రుకోవాలని ఆకాంక్షిస్తూ, మరోసారి భక్తలోకానికి సాదరంగా స్వాగతం పలుకుతోంది **మా(మీ) "సప్తగిరి"** మాసపత్రిక!

**ఓం శ్రియై నమః**

# వచ్చెను... అలమేలుమంగ!!

తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాల(23-11-2019 నుండి 01-12-2019 వరకు) సందర్భంగా...

- డా॥ ఆకెళ్ల విభీషణశర్మ, 98662 34482

శ్రీమహావిష్ణువు భూలోకంలో 108 దివ్యతిరుపతులలో అర్చామూర్తిగా విరాజిల్లుతున్నారు. అందులో శ్రీరంగం, శ్రీముష్ణం, తోతాద్రి, సాలగ్రామం, నైమిశం, బదరికాశ్రమం, కాంచి, వేంకటాచలమనే ఎనిమిది క్షేత్రాల్లో స్వయంవ్యక్తమూర్తిగా పూజలందుకొంటున్నారు. ఈ ఎనిమిదింటిలోను తిరుమలక్షేత్రం ఆ స్వామి ప్రత్యక్ష మహిమలకు సాక్ష్యంగా శోభిల్లుతున్నది. ఆ పద్మనాభుడైన తిరుమల స్వామివారి దేవేరి 'అలమేలుమంగ' అమ్మవారు తిరుచానూరులో విలసిల్లుతున్నది.

కలియుగదైవం శ్రీనివాసప్రభువు తపమాచరించిన పుణ్యప్రదేశం తిరుచానూరు. సూర్యనారాయణుణి ముందుంచుకొని తన హృదయపద్మంపై నివసించే సిరుల తల్లికై, దీక్షతో 12 సంవత్సరాలు తపశ్చర్య కొనసాగించాడు. అగణిత మహిమలకు నిలయమైన పద్మసరోవరంలో కార్తిక మాసంలో శుక్లపక్షపంచమితిథి, ఉత్తరాషాఢనక్షత్రంలో, శుక్రవారంనాడు స్వర్ణకమలంలో అవతరించింది 'పద్మావతీదేవి'.

ఈ క్షేత్రంలో ప్రతిసంవత్సరం వృశ్చికమాసం పంచమిరోజున అవభృథాన్ని సంకల్పించి, ఆ రోజుకు ముందు తొమ్మిదవరోజున ధ్వజారోహణం చేయడం జరుగుతుంది. చిన్నశేషవాహనం మొదలుగా అనేక వాహనాలపై అమ్మవారు బ్రహ్మోత్సవంలో తిరువీధులలో ఊరేగుతూ, వివిధ సన్మంగళ ఫలాలను భక్తులకు ప్రసాదిస్తుంది.

**ధ్వజారోహణం–** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరునికి హృదయేశ్వరి పద్మావతీదేవికి **'గజధ్వజారోహణం'**తో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజం ఆలయంలో జీవస్థానం. ఈ నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు సకలదేవతలనూ, పరిషద్దేవతలనూ, ఇతర భక్తకోటినీ ఆహ్వానించడమే ధ్వజారోహణంలోని అంతరార్థం.

**చిన్నశేషవాహనం–** శ్రీపద్మావతీదేవి బ్రహ్మోత్సవాలలో మొట్టమొదటిది– "చిన్నశేషవాహనం". శేషుడు శ్రీవైకుంఠంలో నిత్యసూరియై, లక్ష్మీనారాయణులకు సేవలందిస్తున్నాడు. చిన్నశేషవాహనంపైన అమ్మవారు జీవకోటిని ఉద్ధరించే లోకమాతగా దర్శనమిస్తుంది. శేషశేషిగా శ్రీనివాసుణ్ణి అనునిత్యం స్తోత్రం చేయడం– భాగవతుల కర్తవ్యం. జీవకోటిని పరిరక్షించే స్వామిని తెలుసుకోవాలంటే అమ్మవారి అనుగ్రహమే మూల కారణం అవుతుంది.

**పెద్దశేషవాహనం–**శ్రీపద్మావతీతాయార్లకు వార్షికబ్రహ్మోత్సవాలలో రెండవవాహనం పెద్దశేషుడు. ఆళ్వార్లు కొనియాడినట్లు "ఎన్నాల్ కుడయిడుమా.. సింగాసనమా" శేషుడు లక్ష్మీసహితుడైన శ్రీవారికి దాసుడిగా, సఖుడిగా, శయ్యగా, సింహాసనంగా, ఛత్రంగా సమయోచితంగా సేవలందిస్తాడు.





పరమపురుషుడైన శ్రీనివాసుని హృదయేశ్వరి పద్మావతియే వివిధ అంశలతో జీవులకు ఘనతను చేకూరుస్తుంది. ఆ దివ్యతత్త్వాన్నే. "ఓ తల్లీ! మహాలక్ష్మీ! మగవాని యందలి భాగ్యలక్షణం నీయంశం, స్త్రీ యందలి విలాస లక్షణం నీయంశం, ఏనుగులు, గుర్రాలూ, పక్షులూ, పాములూ మొదలగు వాటిల్లోని విశిష్టలక్షణాలు నీఅంశాలే. చెట్లు, చేమలు, పచ్చికబీళ్ళు, పశువులు, పెయ్యలు వీటిల్లో ఒక్కొక్కదానిలో అసాధారణమై గోచరించే సొంపులన్నీ నీయంశలే" అని అగస్త్యుడు ప్రస్తుతించాడు. శేషవాహనంపై అమ్మవారిదర్శనం విషతుల్యమైన మానవుల పాపాలు తొలగిస్తుంది.

**హంసవాహనం–** శ్రీపద్మావతీదేవి వార్షిక బ్రహ్మోత్సవాలలో రెండవరోజు రాత్రివేళ హంసవాహనంపై వీణాపాణియై దర్శనమిస్తుంది. హంసకు పాలూ, నీళ్లూ వేరు చేసే వివేకం ఉంది. నీళ్లను వదిలి, పాలను గ్రహిస్తుంది. సకలవిద్యలూ పద్మావతి అమ్మవారి అనుగ్రహంవల్ల చేకూరుతాయి.

**వీణ వాయించెనే అలమేలు మంగమ్మ,**
**వేణుగాన విలోలుడైన వేంకటేశుల యొద్ద**

– అని అన్నమయ్య కీర్తించాడు.

అనునిత్యం వేణుగాన విలోలుడైన శ్రీవేంకటేశ్వరుని వద్ద వీనులవిందుగా వీణవాయించే అలమేలుమంగఅమ్మవారు, హంస వాహనంపై నేడు తిరుమాడవీథులలో విహరిస్తోంది. తాళ్లపాక కవుల సంకీర్తనలలో రవళించిన సకల విద్యాసారం అలమేలుమంగమ్మ అనుగ్రహమే. యోగిమనోవిహారుడైన శ్రీవేంకటేశ్వరునిపై భక్తినీ, శరణాగతినీ సమస్తభక్తబృందాలకు ప్రసాదిస్తున్న కరుణాంతరంగ అలమేలుమంగమ్మ.

**ముత్యాలపందిరివాహనం–** సిరులతల్లి మూడవనాటి ఉదయం ముత్యాలపందిరివాహనంపై విహరిస్తుంది. ముద్దులొలికించే ముత్యాలు అలమేలుమంగఅమ్మవారికి ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వానచినుకులు సముద్రంలోని ముత్యపు చిప్పల్లో పడి, మేలిముత్యంగా రూపొందుతాయనీ, ఏనుగుల కుంభస్థలాలలో ముత్యాలు ఉంటాయనీ, తామ్రపర్ణీనదీ తీరంలో లభిస్తాయని, కల్పవృక్షంబెరళ్ళలో కూడా ముత్యాలు ఉంటాయని, పురాణాలు చెబుతున్నాయి. ముత్యాలను ఆభరణాలుగా ధరించడం, తలంబ్రాలుగా పోసుకోవడం సదాచారం.

'ముత్యాలపందిరిలో ముంగిట నిలచితివి...' అని అన్నమార్యుడు కీర్తించినట్టు తెల్లని, చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అలమేలుమంగమ్మను సేవించిన భక్తబృందాలకు తాపత్రయాలు తొలగి, కైవల్యం ఫలంగా చేకూరుతుంది. ఆ లోకమాతను బ్రహ్మాదులంతా శ్రీవేంకటేశ్వరునికటాక్షాన్ని పొందే యోగ్యతను ప్రసాదించమని అనునిత్యం వేడుకొంటారు.

**సింహవాహనం–** బ్రహ్మోత్సవాలలో శ్రీవారిదేవేరి మూడవ రోజురాత్రి సింహవాహనంపై దర్శనమిస్తుంది. అమ్మవారు సింహవాహనంపై ఊరేగినవేళ దుష్టశిక్షణ, శిష్టరక్షణ అవలీలగా చేస్తుంది. భగవతి పద్మావతి ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ(ప్రభ), జ్ఞానం, వైరాగ్యం అనే ఆరు గుణాలనూ భక్తులకు ప్రసాదిస్తుంది.

నిత్యానపాయినిగా, శ్రీవారిహృదయేశ్వరిగా కీర్తించబడుతున్న అలమేలుమంగఅమ్మవారు సూర్యునిలో వెలుగు, చంద్రునిలో వెన్నెల, జలంలో శైత్యం, పృథ్విలో సువాసన, వికసింపజేసే శక్తి. ఈ క్షేత్రంలో పాంచరాత్ర ఆగమ విహితంగా పూజలందుకొంటున్న మంగళదేవత, సింహవాహనంపై ప్రసన్నంగా దర్శనమిచ్చే పద్మావతీదేవి ప్రపన్న జనులను పరిరక్షించే ధైర్యలక్ష్మి.



వినయాన్ని మించిన భూషణం లేదు

**కల్పవృక్ష వాహనం-** బ్రహ్మోత్సవాలలో నాలగవరోజు ఉదయం కల్పవృక్షం పద్మావతీదేవికి వాహనమవుతున్నది. పాలకడలిని అమృతానికై మథించినవేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. మంగమ్మపాదాలు కల్పతరువు చిగురును తలపిస్తాయని అన్నమయ్య కీర్తించాడు.

**తరుణి పాదాలు కల్పతరువుచిగురుఁ బోలె**
**పరగగఁ దన వెనుబల మంటాను,**

అలమేలుమంగ అమ్మవారు అనుగ్రహంవల్ల ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం కలుగుతాయి.

కల్పవృక్ష వాహనంపై విహరించే అలమేలుమంగ కోరికలు ప్రసాదించడంలో సమర్థురాలు, ఆశ్రితభక్తులకు ఆర్థిక కష్టాలని తొలగించే పరిపూర్ణ శక్తి.

**హనుమద్వాహనం-** బ్రహ్మోత్సవాలలో నాలుగవ రోజు రాత్రి అలమేలుమంగ అమ్మవారు హనుమద్వాహనంపై దర్శనమిస్తుంది. అతుల మతిమంతుడైన హనుమంతుడు, శ్రీరామచంద్రునికి అనన్యభక్తుడు. సీతాన్వేషణలో మారుతి సాగరాన్ని దాటి లంకకు చేరి, సీతమ్మను అశోకవనంలో దర్శించాడు. 'రామముద్రిక'ను సీతకు అందించాడు. ఆమెతో



"శ్రీరాముడు భల్లూక వానరసైన్యంతో లంకను ముట్టడిస్తాడనీ, శీఘ్రంగా నిన్ను రక్షిస్తాడని" ధైర్యం చెప్పాడు. లేకపోతే నావీపుపై చేర్చుకొని రామునివద్దకు తీసుకువెళ్ళగలనని భక్తితో పలికాడు.

అందుకు సీత వీరుడైన శ్రీరాముడు, రావణుణ్ణి జయించి తనను తీసుకువెళ్ళడం యుక్తమని పలికింది. ఆ సీతామాతే పద్మావతి. అర్చామూర్తిగా తిరుచానూరులో పూజ లందుకొంటున్నది. తనజాడను శ్రీవారికి తెలిపిన మహాభక్తుడైన ఆంజనేయుని కోరికను తీర్చడానికా అన్నట్లు అలమేలు మంగ బ్రహ్మోత్సవాలలో శ్రీరాముని రూపంతో హనుమంతుణ్ణి వాహనంగా సంభావించింది. ఈ హనుమంతునిపై నున్న మంగమ్మదర్శనం భక్తులకు బలాన్ని, కీర్తిని, ధైర్యాన్ని, ఆరోగ్యాన్ని, అజాడ్యాన్ని విశేషంగా ప్రసాదిస్తుంది.

**పల్లకీ వాహనం-** అలమేలుమంగమ్మ బ్రహ్మోత్సవాలలో పల్లకి వాహనంలో ఐదవరోజు ఉదయం సాక్షాత్కరిస్తుంది. అమ్మవారు జగన్మోహిని, విశ్వరూపిణి. ఆ దేవదేవి, విరూద్రూపానికి సూర్యచంద్రులు జడబిళ్లలుగా అమరుతారు. ఆ మంగళ దేవత చేతనున్న చిలుక గానం చేస్తుంది. వెన్నెల బొమ్మ అలమేలుమంగమ్మ కూర్చున్న పల్లకిని ముద్దుగుమ్మలు మోసినట్లు అన్నమయ్య-

**కులుకక నడవరో కొమ్మలాలా**
**జల జల రాలీని జాజులు మాయమ్మకు......**

– అని కీర్తించడం విశేషం.

సౌందర్యరాశి అలమేలుమంగమ్మ 'విభూత్యై నమః' అని భక్తులచేత నమస్కరింపబడుతూంది. అష్టసిద్ధులనే విభూతిగా కల ఐశ్వర్య దేవత అలమేలుమంగ అమ్మవారు. కనుక భక్తులకు పల్లకి వాహనసేవవల్ల అష్టసిద్ధులూ చేకూరుతాయి.

ఈ రోజు సాయంత్రం అమ్మవారికి వేడుకగా వసంతోత్సవం జరుగుతుంది.

**గజవాహనం-** తిరుమలేశునికి గరుడవాహనం ఎంత ప్రశస్తమైందో, అట్లే వారి దేవేరి పద్మావతీదేవికి, గజ

వాహనం అంతగా ప్రశస్తం. బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు రాత్రి అమ్మవారు స్వర్ణగజవానంపై విహరిస్తుంది. అసంఖ్యాక భక్తులు ఈ వాహనసేవలో సేవించి తరిస్తారు. ఐరావతం, పాలకడలిలో అమృతమథనం జరిగినవేళ లక్ష్మీదేవితో జన్మించింది. గజం ఐశ్వర్య సూచకం, అందుకే "ఆగజాంతం హి ఐశ్వర్యం" అని ఆర్యోక్తి. పాలసంద్రంలో ప్రభవించిన సిరులతల్లిని గజరాజులు భక్తితో అభిషేకించాయని శ్రీస్తుతి చేశారు–వేదాంతదేశికులు. దిక్కుల భారాన్ని ఎనిమిది దిగ్గజాలు వహిస్తున్నాయి. శ్రీనివాసునికీ, పద్మావతి అమ్మవారికీ తొలిసారిగా పరిచయానికి గజరాజం మూలమయ్యింది.

"నీవే తప్ప నితః పరం బెరుగ" నని శరణాగతిని పొంది, మొసలిబారి నుండి సాక్షాత్తు శ్రీవారిచేత రక్షింపబడిన గజేంద్రుడు భాగవతోత్తముడు. గజేంద్రుడు ఆశ్రయించిన శరణాగతిమార్గాన్ని ప్రతిజీవుడూ ఆశ్రయించాలన్న సందేశాన్ని ఇచ్చే వాహనసేవయే గజవాహనసేవ.

**సర్వభూపాలవాహనం–** ఇక ఆరవరోజు ఉదయం పద్మావతీదేవి సర్వభూపాలవాహనంపై విహరిస్తుంది. సకలలోకేశ్వరుడు శ్రీవేంకటేశ్వరుడు. ఆ శ్రీహరిహృదయపీఠంపై నిలిచి లోకాల్ని కటాక్షిస్తున్న కరుణాంతరంగ అలమేలుమంగమ్మ.

సర్వభూపాలవాహనం పైన ఆ దేవదేవిని– నదులన్నింటికీనాథుడైన సముద్రుని కూతురు శ్రీఅలమేలు మంగను– సేవించినవారికి రాజ్యసుఖప్రాప్తి చేకూరుతుంది.

ఈ రోజు సాయంత్రం **స్వర్ణరథం**లో సిరులతల్లి పురవీథుల్లో దర్శనమిస్తారు.

**గరుడవాహనం–** బ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఆరవనాటి రాత్రి గరుడవాహనంపై ఊరేగుతుంది. గరుడుడు నిత్యసూరులలో అగ్రేసరుడు. 'వేదాత్మా విహగేశ్వరః' అని శ్రుతి వాక్యం. గరుడుని రెండురెక్కలు జ్ఞానవైరాగ్యాలకు చిహ్నాలు. శ్రీవారికీ, అమ్మవారికీ నిత్యవాహనం గరుడాళ్వార్లు. తమిళభాషలో గరుడసేవను 'పెరియతిరువడి' అంటారు. భక్తికి సాకారమైన గరుడుడు, దేవేంద్రుని వజ్రఘాతానికి ఈకను ఇచ్చిన బలశాలి. 108 దివ్యదేశాలలో గరుడసేవకు ప్రత్యేకమైన ఆదరణ ఉంది. శ్రీవారినీ, అమ్మవారినీ నిత్యం గరుడాళ్వార్లు దాసుడిగా, చాందినీగా, ఆసనంగా, వాహనంగా ఇంకా అనేక విధాలుగా సేవిస్తున్నాడు. అందువల్ల అమ్మవారికి జరిగే గరుడసేవ, భక్తులకు దాస్యభక్తి ప్రసాదిస్తుంది.

**సూర్యప్రభవాహనం–**శ్రీపద్మావతీఅమ్మవారు బ్రహ్మోత్సవాలలో ఏడవనాడు సూర్యప్రభవాహనంపై విహరిస్తుంది. ప్రకృతికి చైతన్యప్రదాత, లోకానికి ఆరోగ్యాన్ని ప్రసాదించే సహస్ర కిరణుడు సూర్యనారాయణుడు. పరమాత్మ సూర్యమండలంలో ఉండేవాడు. కనుక శ్రీవారి ఎదలో కొలువుండే అమ్మవారికి, 'సూర్యప్రభ' బ్రహ్మోత్సవాలలో వాహనమవడం సముచితంగా ఉంది. సూర్యనారాయణునిసాక్షిగా తిరుచానూరులో శ్రీవారు తపమాచరించి కృతార్థులయ్యారు. తిరుచానూరులో నేటికీ నిత్యపూజలతో భాసిల్లుతున్న సూర్యదేవాలయం ఇందుకు సాక్షీభూతంగా నిలిచి ఉంది. సూర్యప్రభ వాహనసేవలో అమ్మవారి దర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుంది.

**చంద్రప్రభవాహనం–**శ్రీపద్మావతీదేవికి బ్రహ్మోత్సవాలలో ఏడవనాటి రాత్రి చంద్రప్రభవాహన సేవ ఘనంగా జరుగుతుంది. ఉపనిషత్తులు చెలికత్తెలుగా కల లోకమాతకు చంద్రప్రభవాహనం సముచితమైంది. తన నవ్వుల వెన్నెలలో శ్రీవేంకటేశ్వరునికి ఆహ్లాదాన్ని కలిగించే అలమేలుమంగ అమ్మవారికి, చంద్రుడు చల్లని తెల్లని కాంతులీనే తనప్రభను, మంగమ్మకు వాహనంగా అందించాడు. అగస్త్యుడు చంద్రముఖిని మనోహరంగా ప్రస్తుతిస్తూ–

**చంద్రమునియందు జ్యోత్స్నవు చంద్రవదన!**
**ప్రభవు వాసరకరునందుఁ బద్మనయన!**
**దాహశక్తివి పూబోఁడి! దహనునందు**
**మ్రొక్కెదను నీకుఁ గల్యాణమూర్తి! లక్ష్మి!**

"నీవు చంద్రునియందు వెన్నెలవు. సూర్యునియందు ప్రభవు. అగ్ని యందలి దాహశక్తివి. కల్యాణమూర్తీ! లక్ష్మీ! నీకు మ్రొక్కెదను" అని శరణాగతి చేశాడు. చంద్రప్రభ



సంపదలు ఏర్పడినప్పుడు సజ్జనులు గర్వాన్ని పొందరు

వాహన సేవవల్ల భక్తులకు ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక మనే తాపత్రయాలు తొలగి, జీవనం సుఖవంతమవుతుంది.

**రథోత్సవం–** శ్రీపద్మావతీదేవికి బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు ఉదయం రథోత్సవం. వాహనసేవలలో తలమానిక మయింది రథోత్సవం. రథోత్సవం ఎందరో భక్తులు సేవించి తరించేందుకు అవకాశం ఇస్తుంది.



ఆత్మ రథికుడనీ, శరీరం రథమనీ, బుద్ధి సారథిగా, మనస్సు పగ్గమై, ఇంద్రియాలు గుర్రాలై, విషయాలనే వీథులలో సాగుతాయని కఠోపనిషత్తు చెబుతూంది. అలమేలు మంగ అమ్మవారు రథంపై బ్రహ్మోత్సవాలలో ఊరేగుతున్న వేళ అన్నమయ్య ఆత్మానాత్మ వివేకాన్ని కలిగించే రథసేవను, పలుసంకీర్తనలలో ప్రస్తుతించాడు.

**అశ్వవాహనం–**బ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఎనిమిదవ రోజురాత్రి అశ్వవాహనంపై ఊరేగుతుంది. అశ్వం వేగంగా పరిగెత్తే అందమైన జంతువు. అందుకే ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణిస్తున్నాయి. అలమేలుమంగ అమ్మవారు అన్ని కోరికలను తీర్చడంలో ఒకే ఒక ఉపాయంగా, సౌభాగ్యంగా రాజసంతో అశ్వంపై ఉండి తెలియజేస్తుంది.

పద్మావతీ శ్రీనివాసుల తొలిచూపువేళ, ప్రణయవేళ, పరిణయవేళ సాక్షిగా అశ్వం నిలిచింది. అలమేలుమంగ అమ్మవారు అశ్వవాహన సేవాభాగ్యాన్ని పొందుతున్న భక్తులకు కలిదోషాలను తొలగిస్తుంది.

**పంచమితీర్థ మహోత్సవం–** పాంచరాత్రాగమ సంప్రదాయానుసారం ఈ క్షేత్రంలో అన్ని అర్చనక్రియలూ నిర్వర్తింపబడుతున్నాయి. పాంచభౌతిక వికారజన్యాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది విషయసుఖభోగాలనుండి మానవుణ్ణి విముఖుడిని చేసి పరమాత్మసేవలో తరింపజేసేది పాంచరాత్రశాస్త్రం. 'పాంచరాత్రమేవ పాంచరాత్రమ్'. ఐదురాత్రులలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు లక్ష్మి, బ్రహ్మ, అనంత, గరుడ, విష్వక్సేనులకు ఉపదేశించిన అర్చనావిధానం ఇది. ఈ పాంచరాత్ర సంహితలు 108గా విద్వాంసులు తెలియజేస్తున్నారు.

ఈ పర్వదినంనాడు తిరుమల నుండి శ్రీవారు తన పత్నికి పంపిన తులసి, కుంకుమ, పసుపు, పీతాంబరం, పణ్యారం వంటి సారెను ఏనుగులపై ఊరేగింపుగా తెచ్చి తిరుచానూరులో ఆలయమర్యాదలతో సమర్పిస్తారు. సుదర్శన స్వామితో అవభృథస్నానానికి బ్రహ్మోత్సవ ఆయాసపరిహారార్థం ఉత్సవమూర్తిగా అమ్మవారు పద్మసరోవరతీరానికి చేరుకుంటారు. కార్తికపంచమినాడు అమ్మవారి చక్రస్నానం జరిగేవరకూ తిరుమలలో శ్రీనివాసునికి సేవలు నిర్వహించరు. భక్తజనులు పాలు, పెరుగు, తేనె, పసుపు, కొబ్బరి నీళ్ళతో జరిగే అభిషేకం తిలకిస్తారు. పసుపు కుంకుమలను కలకాలం పొందడానికి వచ్చిన నారీమణులూ, తరగనిసిరి సంపదలూ, ఆముష్మికప్రాప్తినీ పొందడానికి వచ్చిన భాగవతులూ ఈ ఉత్సవాన్ని కనులారా వీక్షించి తరిస్తున్నారు.



చక్రస్నానం తరువాత వేలాదిమందిభక్తులు పద్మసరోవర స్నానంతో ధన్యులవుతున్నారు. పద్మసరోవరంలో పంచమితీర్థ వేళస్నానమాచరించే భాగ్యం కోటిజన్మల పుణ్యఫలం.

*జగన్మాతా! అలమేలుమంగా!! పాహి మాం!!!*



# సందేహాలు - సమాధానాలు

-డా॥ శివపురం మురళీధరరావ్, 94402 17146

**1) ప్రసిద్ధి గాంచిన 'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' అన్న ఆర్షవాక్యం ఎక్కడిది? ఏ సందర్భం లోనిది?**

-అభిఖ్య, తిరుపతి.

ఇది ఋగ్వేదంలోనిది. అందలి 'మహాసౌరసారం' 20వ ఋక్కు. దీని పూర్తి పాఠం.

ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహురథో దివ్యస్స సుపర్ణోగరుత్మాన్।
ఏకం సత్ విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః॥

ఉన్నది ఒక్కటే. అది శాశ్వత ఉనికి కల్గిన పర మాత్మయే. విశేషమైన బుద్ధి కల్గినవారు దానిని పలు విధాలుగా చెప్తారు. అంటే సృష్టికార్యంలో భగవంతునిచే ప్రకటింపబడే వివిధ శక్తులననుసరించి – 'అతడే'– ఇంద్ర, మిత్ర, వరుణ, సుపర్ణ, గరుత్మాన్.... ఇత్యాది దేవతలుగా చెప్పబడింది. అంటే, 'అన్ని దేవతలలో భగవంతుడు ఒక్కడే' అని దీని భావం.

**2) 'జపము' ఏ విధంగా ఆచరించాలి?**

– మనోహర్, ద్రోణాచలం.

భగవంతుని ప్రీతికొరకు, మానసిక వికాసానికి జపతపాదులు ఆచరిస్తారు. తాను ఉపదేశము పొందిన 'మంత్రమును' నిశ్చలమైన మనస్సుతో, అంతరాత్మ పరిశీలన తత్పరతతో, ఏకాగ్ర మనస్కునిగా ఇతర చింతన లేకుండా తనలో తాను తలచుకొంటూ చేసే దైవధ్యానమే 'జపము'. సరిగ్గా చెప్పాలంటే అంగన్యాస, కరన్యాసాది విధితో ధ్యాన మంత్రమును చెప్పి-నిశ్చల మనస్సుతో వెలుపలకు తెలియ రాకుండా ప్రశాంతంగా చేసే 'దైవధ్యానమే' జపము.

**3) 'భగవత్ప్రాప్తికి' తగిన ఉపాయమేమి?**

– చైతన్య, విజయనగరం.

'భగవత్ప్రాప్తికి' తగిన ఉపాయము 'భక్తియే'. భక్తికి మించిన శ్రేష్ఠమైన ఉపాయము మరేదియు లేదు. వృథాప్రయాసలకు లోనుగానటువంటి జీవునికి భక్తి ఒక్కటి వశమైతే భగవత్ప్రాప్తి సులభమవుతుంది. అనేక జన్మల పుణ్యపరిపాకము చేతనే జనులకు 'భక్తి' పై ప్రీతి కల్గుననీ, కలియుగంలో భక్తియొక్కటే తరణోపాయమని, భక్తి చేతనే భగవానుడు సాక్షాత్కరించునని పెద్దలు పలికిరి. దీనిని 'సూత్రార్థ ప్రకాశిక' ఈ విధంగా పేర్కొనింది.

నృణాం జన్మ సహస్రేణ భక్తౌ ప్రీతిర్హి జాయతే ।
కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః ॥

**4) సంస్కృతికి ప్రాణం 'సంస్కృతభాష' అంటారు, అదీ స్తోత్రసాహిత్యం మూలంగా అనీ, నిజమేనా?**

– శ్రీకృష్ణ, మంత్రాలయం.

ఈ మాట అక్షరసత్యం. ఎందుకంటే భారతీయ సంస్కృతికి ప్రాణంవంటి 'సంస్కృతభాష' సామాన్య జనుల నాలుకపై బ్రతుకున్నదంటే అది 'స్తోత్రసాహిత్యం' ప్రభావమని నిస్సందేహంగా చెప్పవచ్చు. మన తరగని కళాసంపదలు- ధార్మికవారసత్వాలు ముక్తి మార్గానికి సోపానాలు. భగవంతుని పలు రూపాలలో ఉపాసించే భక్తులు తమ అనుభూతిని, ఆత్మనివేదనకే అక్షరాకారాలుగా అపారస్తోత్ర వాఙ్మయాన్ని సంతరించారు. తద్వారా మన భక్తి మార్గాన్ని, ధార్మిక కళాసంపదనీ నిరంతరాయంగా నిలుపుకో గలుగుతున్నాం.

**5) పూజాకార్యక్రమంలో ఘంటను ఎందుకు మ్రోగిస్తారు?**

– వసంతకుమార్, విజయవాడ.

మానవుడు ఆరాధించే దైవానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే పూజకు భంగం కల్గుతుంది. కనుక, నిరాటంకంగా పూజను సాగించడానికి ఘంటను మ్రోగించటం సామాన్యం. ఘంటానాదంతో భక్తునికి ఏకాగ్రత కలుగుతుంది, పూజకు సిద్ధం చేస్తుంది.

పూజకు దేవతలను ఆహ్వానించడానికి, రాక్షసులను తరుమడానికి గుర్తుగా 'ఆగమార్థం తు దేవానాం, గమనార్థం తు రక్షసాం కురు ఘంటారావం' అని దేవతార్చనకు ప్రారంభించడానికి ముందు చెప్తారు.

భగవద్గీత-యువత

# మనోనిగ్రహానికి మార్గం

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్
9821914642

చిన్నపిల్లవాడి నుండి పండు ముసలివాడి వరకు ప్రతిఒక్కరినీ పట్టి పీడించే కష్టం మానసికచింత. ప్రతీ ఒక్కరి నుండి సాధారణంగా వినిపించేది మనస్సు గురించే. ముఖ్యంగా నేటి రోజులలో మానసిక చింతలు బాగా పెరిగిపోయాయి. దానికి అందరు 'మానసిక ఒత్తిడి' అనే క్రొత్త పేరు కూడ పెట్టారు. పూర్వం దానిని 'మానసిక సంక్షోభం' అనేవారు. ముఖ్యంగా ఇది విద్యార్థులలో పరీక్షా సమయాలలో, ఇంటర్వ్యూ సమయాలలో, ఎంట్రెన్స్ పరీక్షల సమయంలో, ఆటల పోటీలలో కలుగుతూ ఉంటుంది. అయితే ఈ మానసిక ఒత్తిడి క్రొత్తదేమీ కాదు.

భగవద్గీతలో ఈ విషయము చర్చించబడింది. భగవద్గీతలో శ్రీకృష్ణార్జునుల మధ్య చర్చ జరిగింది. ఒక చోట అర్జునుడు శ్రీకృష్ణునితో మాట్లాడుతూ మనోనిగ్రహం చాలా కష్టమని, దానిని సాధించడం వాయువును నిగ్రహించడమంతగా కష్టమని తెలియజేశాడు. వాయువును నిరోధించడం ఎవ్వడి తరమూ కాదు. అలాగే మనస్సును



నిగ్రహించడం కూడా అత్యంత కష్టమని అర్జునుడు అన్నాడు. దానికి సమాధానంగా గీతాచార్యుడు ఒక అద్భుతమైన మనోనిగ్రహ పద్ధతిని తెలియజేశాడు.

శ్రీకృష్ణభగవానుడు ఇలా పలికాడు: "ఓ గొప్ప బాహువులు కలిగిన అర్జునా! చంచలమైన మనస్సును నిగ్రహించడం నిస్సందేహంగా చాలా కష్టమేయైనా దానిని తగిన అభ్యాసంతో, వైరాగ్యంతో సాధించవచ్చును" (భగవద్గీత 6.35).

మనస్సు చంచలమైనదని సాక్షాత్తుగా భగవంతుడే అంగీకరించాడు. ఇది అందరి అనుభవము లోనిదే. మనస్సు ఒక్క క్షణమైనా ఖాళీగా కూర్చోలేదు. అసలు మనస్సు అంటే ఏమిటి? కేవలం అది ఆలోచనల పరంపర. జరిగినవి, జరుగుతున్నవి లేదా జరుగబోతాయని ఊహించేవి అనే మూడు రకాల ఆలోచనలే మనస్సు, ఈ మూడు కార్యాలలో మనస్సు తలమునకలై ఉంటుంది. గడచిపోయిన విషయాలను తలచుకుంటూ మనస్సు క్రుంగిపోతూ ఉంటుంది, జరుగబోయేవాటిని ఊహించుకుంటూ భయపడుతూ ఉంటుంది. నిజానికి అది ప్రస్తుత విషయాలను ప్రక్కకు పెట్టేస్తుంది. అంటే అది ప్రతీక్షణం అటుఇటు దుముకుతూ ఉంటుంది. పాతవిషయాలను తలచుకోవడంవల్ల నష్టమేముంది లేదా భవిష్యత్తు గురించిన ఊహలవల్ల కలిగే నష్టమేముంది అంటూ ప్రశ్నించడంలో అర్థం లేదు.

## తెప్పలపై తిరుమలేశుని రాణి!

**ప్రతిఏటా జ్యేష్ఠమాసంలో పున్నమికి పూర్తి అయ్యేట్లుగా ఐదురోజులపాటు సాయంవేళల్లో పద్మసరోవరంలో జరిగే తెప్పోత్సవాల్లో, మొదటి రోజు శ్రీరుక్మిణీసత్యభామా సమేత శ్రీకృష్ణస్వామి వారు; రెండవరోజు శ్రీదేవీభూదేవీ సమేతంగా శ్రీసుందరరాజస్వామివారు; చివరి మూడు రోజులు శ్రీపద్మావతి అమ్మవారు తెప్పలపై శోభాయమానంగా దర్శనమిస్తారు.**

ఎందుకంటే గతంలో జరిగిన కష్టాలను తలచుకొని బాధపడడం వల్ల నిరాశాభావన పెరిగిపోతుంది. అలాగే భవిష్యత్తులో ఏదో ఆపత్తు జరుగబోతుందని భయపడడంవల్ల ఉద్విగ్నత పెరిగిపోతుంది. వీటివలన మనిషిలో ఉత్సాహం, శక్తి, స్ఫూర్తి తగ్గిపోతాయే గాని పెరగవు. అందుకే ఈ రకమైన పాత జ్ఞాపకాలతో, భవిష్యత్తును గూర్చి ఊహలతో కాలం గడపడంవలన ఎటువంటి లాభం ఉండదు. అయితే ఇది అంత తేలికగా సాధ్యమయ్యేది కాదు. అందుకే అభ్యాసము, వైరాగ్యము అనేవి తప్పనిసరిగా కావాలని గీతాచార్యుడు చెబుతున్నాడు.

అయితే విద్యార్థులు చేయవలసిన అభ్యాసమేమిటి? అలాగే వారు సాధన చేయాల్సిన వైరాగ్యమేమిటి? విద్యార్థులు చేయవలసిన అభ్యాసము లక్ష్యాన్ని ఏర్పాటు చేసికోవడం, ఆ లక్ష్యాన్ని నిశ్చయంగా సాధిస్తానని పదేపదే స్మరించడం. ఎప్పుడైతే లక్ష్యం ఉండదో మనిషి ఏదీ చేయకుండ ఖాళీగా ఉండిపోతాడు. లక్ష్యసాధనకు పనికిరాని విషయాలను వెంటనే విడిచివేయడం వైరాగ్యం అనబడుతుంది.

ఇటువంటి అభ్యాసము, వైరాగ్యము ద్వారా విద్యార్థులు అతిశీఘ్రంగా మానసికచింత నుండి బయటపడతారు. విజయాలను సాధిస్తారు. అప్పుడు జీవితం ఎంతో ఆరోగ్యవంతం, ఉత్సాహవంతం, ఐశ్వర్యవంతం అవుతుంది.



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

### తిరుచానూరు శ్రీ పద్మావతిఅమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవం

**2019, నవంబరు 23 నుండి డిసెంబరు 01 వరకు**



| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 22-11-2019 | శుక్ర | లక్షకుంకుమార్చన | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 23-11-2019 | శని | తిరుచ్చిఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 24-11-2019 | ఆది | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 25-11-2019 | సోమ | ముత్యపుపందిరి వాహనం | సింహవాహనం |
| 26-11-2019 | మంగళ | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 27-11-2019 | బుధ | పల్లకీ ఉత్సవం, సా॥ వసంతోత్సవం | గజవాహనం |
| 28-11-2019 | గురు | సర్వభూపాలవాహనం, స్వర్ణరథోత్సవం | గరుడవాహనం |
| 29-11-2019 | శుక్ర | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 30-11-2019 | శని | రథోత్సవం | అశ్వవాహనం |
| 01-12-2019 | ఆది | పల్లకీ ఉత్సవం, తీర్థవారిఅవభృథము, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చిలో ధ్వజావరోహణ ఉత్సవం |

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-07

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

అది కైలాసాద్రి. పార్వతీపరమేశ్వరలాస్య తాండవ విలాసాలతో పరమపవిత్రమైన పర్వతరాజం. ప్రమథులు, పరమయోగులు, పరమమాహేశ్వరులు దృశ్యా దృశ్యరూపాలతో సంచరించే శైలం.

శైలశిఖరాలు ధవళకాంతులతో నయనానంద కరంగా ఉన్నాయి. గాఢంగా గాలులు వీచినప్పుడు మంచు పింజెలు లేచి మీద పడుతున్నాయి. అయినా హంసుడు, డిభకుడు శివలింగంముందు నిశ్చలభక్తితో గంభీరంగా కూర్చుండి తీవ్రంగా తపస్సు చేస్తున్నారు.

హంసడిభకులు హృదయగుహలలో జపిస్తున్న "ఓంనమశ్శివాయ" అనే షడక్షరీమంత్రతరంగాలు కైలాసం లోపలిమందిరంలో కొలువై ఉన్న పరమశివుని హృదయాన్ని తాకుతున్నాయి. శివుడు సాలోచనాముఖకవళికలతో చిరునవ్వు నవ్వుకుంటున్నాడు. స్వామి నవ్వుతున్నదెందుకో తెలియక ప్రమథులు ఒకరిమొగాలొకరు చూచుకుంటున్నారు.

సాల్వదేశానికి రాజు బ్రహ్మదత్తుడు. బ్రహ్మదత్తునికి ఇద్దరు భార్యలున్నా చాలాకాలం దాకా సంతానం కలగ లేదు. మంత్రిపురోహితుల హితవచనాలు పాటించి భార్యాభర్తలు మందాకినీధరుడయిన మహేశ్వరుణ్ణి పది సంవత్సరాల పాటు పరమశ్రద్ధతో ఆరాధించగా ఇద్దరు కొడుకులు పుట్టారు. వారే హంసుడు మరియు డిభకుడు. ఈ సోదరులు మహాబలపరాక్రమసంపన్నులు.

ఈ హంసడిభకులకే కౌశికుడు, చిత్రసేనుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. అయితే హంసడిభకులనేపేర్లే బాగా ప్రసిద్ధికెక్కాయి. ఈ హంసడిభకులు (కౌశిక చిత్రసేనులు) మగధ సమ్రాట్టయిన జరాసంధునికి అనుయాయులై మంత్రులుగాను, సేనాపతులుగాను వ్యవహరిస్తూ అనేక యుద్ధాలలో అతనికి సహకరించారు. ముఖ్యంగా మథురానగర దండయాత్రలలో జరాసంధునికి తోడై బలరామ శ్రీకృష్ణులకు పలుసార్లు చీకాకులు కలిగించారు. అనగా జరాసంధునికి అటు శిశుపాలదంతవక్త్రులు, ఇటు హంసడిభకులు సహచరులై చరిస్తూ చక్రాయుధుడయిన శ్రీకృష్ణునితో వైరం పెంచుకున్నారన్నమాట!

మానవశక్తులతో మాధవుణ్ణి సాధించటం సాధ్యం కాదని భావించిన హంసడిభకులు దివ్యశక్తులతో సాధించాలని నిర్ణయించుకున్నారు. దేవదేవుడయిన మహాదేవుణ్ణి ప్రార్థించి దివ్యాస్త్రాలు సంపాదించి వాటితో వాసుదేవుణ్ణి వధిస్తే, తమ చక్రవర్తి జరాసంధుడు సంతోషిస్తాడని తలంచారు. తలంచినదే తడవుగా తల్లిదండ్రులకు, భార్యలకు నచ్చజెప్పి కైలాసాద్రికి వచ్చి కఠోరతపస్సులో కూర్చున్నారు అన్నదమ్ములయిన హంసడిభకులు.

ఇదే సమయంలో సాల్వనగరంలో జనార్దనుని ఇంటిలో పూజామందిరంలో శ్రీకృష్ణార్చన జరుగుతున్నది. పూజామందిరంలో శ్రీకృష్ణుని విగ్రహం చక్కగా అలంకరించబడింది. విగ్రహంముందు పూజాద్రవ్యం పుష్కలంగా ఉంది. ఒకవైపు జనార్దనుడు, అతని తండ్రి మిత్రసహుడు- ఇంకొకవైపు జనార్దనుని ఇల్లాలు పద్మావతి, అతని తల్లి భక్తిమయ చిత్తాలతో కూర్చుని శ్రీకృష్ణపరమాత్మను అర్చిస్తున్నారు. అర్చన ముగిసిన తరువాత క్షణకాలం పాటు కన్నులు మూసుకుని మనస్సులలో "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే ద్వాదశాక్షరీమంత్రాన్ని మననం చేశారు. ఆ మంత్ర తరంగాలు ద్వారకలో ఉన్న ద్వారకానాథుడయిన శ్రీకృష్ణుని హృదయాన్ని తాకినై. స్వామి చిఱునవ్వు చిందించాడు.

సాల్వదేశాధీశుడయిన బ్రహ్మదత్తునికి ప్రాణమిత్రుడు మిత్రసహుడు. మిత్రసహుడు బ్రాహ్మణోత్తముడు. మిత్రసహు

నికి కూడా చాలా కాలందాకా సంతానం కలగలేదు. అందు కోసం భార్యతో కలసి శ్రీమహావిష్ణువును ఐదు సంవత్సరాల పాటు అతినిష్ఠతో ఆరాధించాడు. తత్ఫలితంగా తనయుడు జన్మించాడు. అతనిపేరు జనార్దనుడు. విచిత్రమేమిటంటే – రాజయిన బ్రహ్మదత్తునికి కొడుకులు పుట్టిననాడే బ్రాహ్మణుడయిన మిత్రసహునికి కూడా కొడుకు పుట్టాడు. అనగా ఈ ముగ్గురూ సమవయస్కులన్న మాట! తండ్రులు ప్రాణ మిత్రులయినట్లే, కొడుకులు కూడా ప్రాణమిత్రులయ్యారు. అయితే రాజుకొడుకులు పరమమాహేశ్వరులు కాగా, విప్రునికొడుకు పరమవైష్ణవుడయ్యాడు. ఈ సంస్కారభేదం వీరితండ్రులతరంనుంచి వచ్చిందే.

అంబికావల్లభునిగుఱించి కైలాసగిరిమీద హంస డిభకులు, రుక్మిణీవల్లభుని గుఱించి.... గృహసీమలో జనార్దనుడు పరమనియమాలతో తపస్సు చేస్తుండగా కాలచక్రం కళాత్మకంగా కదిలిపోతున్నది.

– – – – – – –

ఒకనాడు సూర్యోదయకాలంలో... గగనలక్ష్మి బంగారు వెలుగులతో జగాలను అలంకరిస్తున్నది. సూర్య మండలంనుండి వెండి వెలుగులతో దేవర్షి నారదుడు వెలువడి నారాయణ నామసంకీర్తనం చేస్తూ ఆకాశమార్గాన వస్తున్నాడు.

**గీతిక– పల్లవి:**

నారాయణ! తే నమో నమో
నలినాయతనయన! నమో నమో
పరమపావన! భక్తజనావన!
నరవరపరిపూజితచరణ! శ్రీకృష్ణ!

**చ.** అగణితలీలాగానవిలోల!
నగధర! శ్రీధర! కాంచనచేల!
దనుజవిఖండనదారుణకాల!
మునిజనపాలనవైభవహేల!

**చ.** జలచర భూచర శతవిధరూప!
సలలితరాగ శృంగార స్వరూప!
నారీజనహృదయోల్లాసరూప!
దూరీకృత శ్రితసంసారతాప!

పాట ముగిసేసరికి దివిజర్షి గగనతలంలో ద్వారక దాకా వచ్చాడు. క్రిందికి చూడగా సముద్రవేష్టిత ద్వారకా నగరం సుందరకాంతులతో మనోహరంగా కనిపించింది. మందహాసం చేసి క్రిందికి సాగాడు.

ఆ సమయంలో పూలతోటలో పూలు కోసుకుని పూలసజ్జలో వేసుకుంటున్నాడు వసంతకుడు. వాసంతిక కూడా తాంబూలకరండవాహినితో కలసి పూలకోసం వచ్చింది. తాంబూలకరండవాహినిని చూడగానే దీపావళి నాటి రాత్రి ఆమె తనమీద పడిన దృశ్యం గుర్తుకొచ్చి బిక్క మొగం వేశాడు వసంతకుడు. ఆమె మాత్రం నాటి దృశ్యాన్ని తలచుకొని అదోలా మురిసిపోయింది.

వసంతకుణ్ణి ఆటపట్టించాలని వాసంతిక దగ్గరగా వచ్చింది. వసంతకుడు తలత్రిప్పకుండానే ప్రక్కకు జరిగి పూలు కోసుకుంటున్నాడు.

**వాసంతిక :** వసంతయ్యా!

**వసంతకుడు :** ఏం పనిమీద వచ్చావు?

**వాసంతిక :** మీ పనిమీదే!

**వసంతకుడు :** నాపనా?

**వాసంతిక :** అదే.... పూలకోసం.

**వసంతకుడు :** సరిసరి. కోసుకో. నన్ను మాత్రం రాసుకోకు.

**వాసంతిక :** వసంతయ్యా. తమరి నొకమాటడగనా?

**వసంతకుడు :** ఒకటేమిటి, ఓపికుంటే వెయ్యడుగు.

**వాసంతిక :** పూలు మన్మథునికి బాణాలట కదా?

**వసంతకుడు :** అవును. అయితే?

**వాసంతిక :** తమరు బ్రహ్మచారులు గదా! ఇలా మదన బాణాలతో పూజ చేయటం తప్పు కాదా?

**వసంతకుడు :** ఓసి వాసంతికా! నీకు శాస్త్రం తెలియదే. బ్రహ్మచారులు మదనబాణాలతో మదనపూజ చేయటం తప్పు గాని, మదన జనకుని పూజ..... అదే శ్రీమన్నారాయణునిపూజ చేయటం తప్పు కాదే వెఱ్ఱిమొహమా! అయినా ఈ మధ్య మీలాంటి యువతీ మణులంతా వనవిహారానికి వెళ్లి అక్కడ మదన బాణాలతో మదన

దేవుణ్ణి పూజిస్తున్నారట! మీపూజ వేరు, నాపూజ వేరు. తెలిసిందా?

**వాసంతిక** : ఓహో! అలాగా! అది సరేగాని నన్ను చూస్తే తమరి కేమనిపిస్తుంది?

**వసంతకుడు** : నిన్ను చూస్తేగదే ఏమైనా అనిపించటానికి?

**వాసంతిక** : అయితే చూడు.

అని యెదురుగా నిలబడి ఒయ్యారంగా జడ ఊపుతుంది. వసంతకుడామెను నిర్వికారంగాను, నిశ్చలంగాను, విచిత్రంగాను చూశాడు.

**వసంతకుడు** : చూశాను.

**వాసంతిక** : ఏమనిపిస్తుంది?

**వసంతకుడు** : నీజడ పట్టుకుని...

**వాసంతిక** : ఆఁ... నా జడ పట్టుకుని?

**వసంతకుడు** : మెడ వంచి.....

**వాసంతిక** : ఆఁ ఆఁ ... మెడ వంచి?

**వసంతకుడు** : వీపుమీద నాలుగు గుద్దులు గుద్ది, ఈడ్చుకు పోయి మీసత్యాదేవిగారివాకిట్లో పడేయాలనిపిస్తున్నది.

**వాసంతిక** : అయితే గుద్దవా వసంతయ్యా!

**వసంతకుడు** : ఓసి నీదుంప తెంపి గంపకెత్త. ప్రొద్దున్నే గుద్దులాటకు సిద్ధమయ్యావేమిటే మొద్దుమొహమా!

అంతలో నారదమహర్షి "నారాయణ నారాయణ" అంటూ దిగాడు. వాసంతిక, తాంబూలకరండవాహిని నారదులవారికి నమస్కరించారు. ఆయుష్మతీ భవ! ఆయుష్మతీ భవ!! – అని దీవించాడు దేవఋషి. వారిద్దరు వెళ్లిపోయారు. వసంతకుడు నారదులవారిని సమీపించాడు.

**వసంతకుడు** : దేవమునీంద్రులకు వందనాలు!

**నారదుడు** : శుభమస్తు నిత్యమ్!

**వసంతకుడు** : ఏం శుభం దేవర్షీ! ఇప్పుడు మీకు నమస్కారం చేసి వెళ్లారే ఇద్దరు ముద్దుగుమ్మలు, ఆ జతలో పూలసజ్జతో వెళ్లిందే... అదే వాసంతిక!

**నారదుడు** : ఆఁ ఆఁ ఆమె సత్యాదేవిగారి కూరిమిచెలికత్తె కదూ?

## 2019, డిసెంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పంచమీతీర్థం |
| 02 | తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పుష్పయాగం |
| 08 | గీతాజయంతి |
| 09 | శ్రీచక్రతీర్థ ముక్కోటి |
| 10 | తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో కార్తికదీపోత్సవం |
| 11 | శ్రీదత్తజయంతి |
| 17 | ధనుర్మాస ప్రారంభం |
| 26 | సూర్యగ్రహణం |

**వసంతకుడు** : అవును స్వామీ! ఆ బ్రహ్మరాక్షసి కన్ను నా బ్రహ్మచర్యంమీద పడింది.

**నారదుడు** : ఆమెకన్ను పడినంతమాత్రాన నీవు వెన్ను వంచుతావా వసంతయ్యా?

**వసంతకుడు** : వంచననుకోండి! అయినా నా జాగ్రత్తలో నేనుండాలి గనుక తమరు నాకు ఆంజనేయమంత్రమొకటి అనుగ్రహించగూడదా?

**నారదుడు** : భలేవాడివి వసంతకా! శ్రీకృష్ణులవారి కూరిమి మిత్రుడవైన నీకు ఆంజనేయమంత్రమా? ఉపదేశిస్తే మదనగోపాల మంత్రమో సంతానగోపాలమంత్రమో ఉపదేశించాలి గాని....

**వసంతకుడు** : దేవర్షీ దేవర్షీ! తమరు కూడ నన్ను.....

**నారదుడు** : లేదులే వసంతకా! ఊరకే చమత్కారాని కన్నాను. చతుర్దశభువనాధ్యక్షుడయిన శ్రీకృష్ణులవారి మిత్రుడవు కాబట్టి నీకు మంత్రంతో పనేలేదు. నిర్భయంగా ఉండు. నేను స్వామిని దర్శించుకోవటానికి వెళుతున్నాను. నారాయణ నారాయణ!!

అంటూ రుక్మిణీమందిరంవైపు నడిచాడు. వసంతకుడు తల విదిలించుకుని ధైర్యం వహించి 'కృష్ణం వందే జగద్గురుమ్' అనే మంత్రాన్ని మననం చేస్తూ తన నివాసం వైపు వెళ్లాడు.

*(ఇంకా ఉంది)*

# పెత్తనమంతా... పద్మావతీదేవిదే!!

– ఆచార్య కె.జె.కృష్ణమూర్తి,
83740 28457

తిరుమలక్షేత్రంలో...

"పెత్తనమంతా పద్మావతీదేవిదే!"

అబ్బో! ఈ మాట చాల విచిత్రంగా ఉందే! ఆశ్చర్యగానూ ఉంది కదూ! ఇంతకూ ఈ మాట అన్నదెవరో తెలుసా! సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు!

ఏడుకొండలవాడు ఈ మాటను ఎవరితో అన్నాడు? ఎప్పుడన్నాడు? ఎందుకు అన్నాడు?– ఈ ప్రశ్న పరంపరలకు సమాధానం తెలుసుకోవాలంటే మాత్రం, సుమారు మూడువందల ఏండ్ల కిందట తిరుమలలో జరిగిన యథార్థగాథను గూర్చి తప్పక చెప్పుకోవాల్సిందే మరి!

ప్రతిరోజూరాత్రి **"ఏకాంతసేవ"** అనే పవళింపుసేవలో, చివరగా మాతృశ్రీతరిగొండవెంగమాంబగారిపేరుతో శ్రీస్వామివారికి దివ్యమంగళకర్పూర నీరాజనం ఇస్తారు. ఆ హారతిని **"ముత్యాలహారతి"** అంటారు. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వరస్వామివారు యోగనిద్రకు ఉపక్రమిస్తారు. పిదప ఆలయం తలుపులు మూస్తారు.

ఇంతటి భక్తురాలుగా ప్రసిద్ధురాలైన వెంగమాంబ, తిరుమలకొండకు చేరుకొన్న తొలినాళ్లలోని సంగతి. అప్పట్లో ఆ తల్లి, ఆలయం మూసివేసిన తర్వాత ఏ చెట్టుకిందో, ఏ మండపంలోనో తలదాచుకొనేది. రాత్రుళ్లలో చలిబాధ, దోమలబెడద. ఇదిగాక, అప్పుడప్పుడు జడివానల బాధ.

ఇన్ని అగచాట్లు పడలేక, ఒకనాటి రాత్రిపూట వెంగమాంబ తిరుమలేశుణ్ణి తీవ్రంగా ప్రార్థించింది. "స్వామీ! నిరంతరం నీ సేవలో తరించాలని నీ సన్నిధికి చేరుకొన్నానే! నా మీద కనికరమే లేదా! ఏడేడు లోకాల్లో సాటిలేని దయామయుడవని నిన్ను అంటారు కదా. ఏ దిక్కూ కానక నీవే దిక్కని నీ పంచన చేరుకొన్నానే. నా అగచాట్లు నీకు కనపడనే లేదా? నా మొరలు నీకు వినిపించనే లేదా? మళ్లీ మళ్లీ దీనంగా విన్నవించుకుంటున్నా స్వామీ! జీవితాంతం నీ సేవలో తరించాలన్నదే నాకోరిక. నీ కొండపైన ఉండడానికి ఇంత చోటు చూపించి, కాసింత ప్రసాదం అనుగ్రహించవయ్యా స్వామీ! వేంకటరమణా! సంకటహరణా!" అంటూ కన్నీళ్లు కారుస్తూ, గుడికి ఎదురుగా ఉండే వేయికాళ్ల మండపంలో ధ్యానం చేస్తూ, చేస్తూ మగతనిద్రలోకి జారుకొంది పరమభక్తాగ్రణి తరిగొండ వెంగమాంబ.

వెంగమాంబ వేదనకు వేంకటేశ్వరుడు, కరిగి నీరయ్యాడు. ఎంతైనా ఏడుకొండలవాడు భక్తవత్సలుడు కదా! అందులోను వెంగమాంబ తనకు అత్యంత ఆంతరంగిక భక్తురాలు కదా. ఒక్క క్షణం కూడా తాళలేకపోయాడు తిరుమలేశుడు. చల్లగా, ఆహ్లాదకరంగా ఉన్న ఆ బ్రాహ్మీముహూర్తంలో ఆమె ఎదుట ప్రత్యక్షమై– ఇలా అన్నాడు. "తల్లీ! వెంగమాంబా...! నీ ఆవేదన నాకు తెలియదా! నా బంగారుతల్లీ! నేనొక్కమాట చెబుతున్నా. జాగ్రత్తగా విని శ్రద్ధగా ఆచరించు!






మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ

**తిరుమలక్షేత్రంలో పెత్తనమంతా పద్మావతీదేవిదే! నా పట్టపురాణి ఆ అలమేలుమంగ ఎంత చెపితే అంత! అందు వల్ల నా హృదయంలో కొలువై ఉన్న ఆ "వ్యూహలక్ష్మి"ని వేడుకో. బాగా ప్రార్థించు; నీ కోరికను విన్నవించుకో! అలమేలుమంగ నిన్ను అనుగ్రహించిందనుకో. ఇక తిరుగే లేదు. నీవు దండిగా, మెండుగా ఈ కొండపై ఉండవచ్చు.**

ఇంకొక్కమాట తల్లీ! అత్యంత విలువైన మాట!

అలమేలుమంగ అత్యంత దయగల తల్లి. పూర్వం ఒకప్పుడు నేనే ఆమె అనుగ్రహం కోసం, ఆరాటపడ్డాను. పరితపించాను. ఏడుకొండలు దిగి, కొల్హాపురక్షేత్రానికి వెళ్లి పదిఏండ్లపాటు తపస్సు చేశాను. అక్కడ నా తపస్సు ఫలించనేలేదు. ఇంతలో అశరీరవాణి యొక్క ఆదేశంతో సువర్ణముఖీనదీ తీరాన పద్మసరోవరం చెంత పండ్రెండేండ్ల పాటు తపస్సు చేశాను. కొంతకాలం గోక్షీరసేవనంతో మరికొంతకాలం నిరాహారిగా తపమాచరించాను. ఎట్టకేలకు అలమేలుమంగ దయతలచింది. పద్మసరోవరంలో బంగారు పద్మంలో **"పద్మావతీదేవి"**గా అవతరించి, నా వక్షఃస్థలాన్ని అలంకరించింది. నన్ను **'శ్రీనివాసుణ్ణి'** చేసింది. తిరుచానూరు పద్మసరోవర తీరాన ఆమే **"పద్మావతీదేవి"**గా, **"అలమేలు మంగ"**గా అర్చామూర్తిగా పూజలందుకొంటున్నది. అందు వల్ల ఆ అలమేలుమంగమ్మను ఉపాసించు!" అంటూ అదృశ్య మయ్యాడు ఆనందనిలయుడు.

మగతగా ఉన్న వెంగమాంబ ఉలిక్కిపడింది. కొండల రాయని దివ్యమంగళస్వరూపదర్శనానికి ఆనందపడింది. ఆ స్వామి మాటలకు ఆశ్చర్యపడింది. అంతే; శ్రీవేంకటేశ్వరుని వక్షఃస్థలంలో నెలవైన నెలతను నిగమ నిగమాంత వేద్య అయిన ఆ అలమేలుమంగమ్మను పెక్కువిధాల కీర్తిస్తూ, ఆరాధించింది. తన కోరికను మనసార ఇలా విన్నవించు కొంది వేంగమాంబ!-

**రాగం-తిలాంగ్**

**"అమ్మా! నేనిందుండుదు నటవే?**
**శ్రీ అలమేల్మంగ! నన్నాదరించేవటవే? ॥పల్లవి॥**

**అది యేమోకాని, నీ విభుడు నిన్నడిగి**
**నన్నిందుండుమని చెప్పినాడూ**
**సదయదృష్టిని నన్ను చూడూ**
**సద్గతి గోరుచు నేనిందుండే నిపుడూ ॥అమ్మా!॥**

**ఏదేశములు తిరుగలేనూ, ఖండ-**
**వాదులతో పెక్కువాదించలేనూ**
**మేదినీంద్రుల పొగడలేనూ, ధనము**
**మెండుగా గూర్చి దానము చేయలేనూ ॥అమ్మా!॥**

**తనువూ నే నలయించలేనూ, కష్టముల**
**కోర్వజాలా, నేనేమి చేయుదునూ?**
**జనసంఘమున నిలువలేనూ, ఈ**
**స్థలమున మీ మహిమ సలుపుచుండెదనూ ॥అమ్మా!॥**

**తరిగొండ నారసింహుడయినా శేషాచ-**
**లేంద్రుని దాపు జేరుదునా?**
**కరుణించి సెలవిమ్మీ! చాలా, మీ**
**పరమపదంబుల భావించుదానా" ॥అమ్మా!॥**

శ్రీనివాసునితో పాచికలాడిన మహంతుబావాజీ శిష్య పరంపరలో ప్రసిద్ధుడైన ఆత్మారాందాస్‌జీ అనే భక్తుడు అప్పట్లో, తిరుమలలో మహంతుగా ఉండేవాడు. ఆయనకు అలమేలుమంగమ్మ కలలో కనపడింది. దేవాలయ అధికారు లతో చెప్పి వెంగమాంబకు స్థిరంగా ఒక కుటీరం, దినవెచ్చపు సంబారాలు ఏర్పాటు చేయుమని ఆదేశించింది. అంతే! ఆత్మారాందాస్‌జీ ఆదేశించిన మాటకు కట్టుబడిన శ్రీవారి ఆలయ అధికారులు, శ్రీస్వామిపుష్కరిణికి దగ్గర్లో స్థిరంగా ఒక కుటీరాన్ని నిర్మించి ఇచ్చారు. అంతేగాక, శ్రీవారిఆలయం ఉగ్రాణం నుండి ప్రతిరోజూ ఒక సేరు బియ్యం, దానికి తగి నట్లుగా తదితర వంటద్రవ్యాలను, శ్రీవేంకటేశ్వరుని తల్లి **'వకుళమాత'** పేరుతో పంపించే ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాటునే **'హారవెచ్చం'**- అనే పేరట తి.తి.దే. రికార్డులు పేర్కొంటున్నాయి.

అనంతరకాలంలో మాతృశ్రీతరిగొండవెంగమాంబ తిరు మలక్షేత్రంలో అటు దైవసేవ, ఇటు సాహిత్యసేవ చేయడమే గాక, బ్రహ్మోత్సవము, నృసింహజయంతివంటి సందర్భాల్లో భక్తులకు అన్నదానం చేసేవారు.

విచిత్రం ఏమంటే, వెంగమాంబగారి కుటీరం పూర్వం తిరుమలలో ఎక్కడ ఉండిందో, అక్కడే నేడు శ్రీస్వామివారి దివ్యసంకల్పంగా "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాదభవనం" వెలసింది. ఈ భవనంలోనే ప్రతిరోజు వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాన్ని తృప్తిగా ఆరగిస్తు న్నారు. ఈ అద్భుతమైన సంఘటన భగవంతుడు వేంకటేశ్వరుడు- భక్తురాలు వెంగమాంబ-ఈ ఇరువురికీ ఉన్న అనుబంధంతో పాటు, తిరుమల యాత్రలో శ్రీఅలమేలు మంగమ్మ సందర్శనప్రాశస్త్యాన్ని తెలుపుతున్నది కదూ!!

*శ్రియై శ్రీపద్మావతీదేవ్యై నమః*

# హరిగాన.. మహిమ చాటే...

# కైశికద్వాదశి

- డా॥ సూరపరాజు వసంతకుమారి
99083 91024



**వ**రాహపురాణంలో, భూదేవికి వరాహావతారంలో ఉన్న విష్ణుదేవుడే తెలిపిన నంబాడువాన్ కథ, **'కైశిక పురాణం'**గా ప్రసిద్ధికెక్కింది.

ఈ కథనే శ్రీకృష్ణదేవరాయులు తన ఆముక్త మాల్యదలో మాలదాసరికథగా చిన్ని చిన్ని మార్పులతో తెలిపాడు. ఈ కథ 'హరినామ' సంకీర్తనా మహిమను లోకాలకు చాటుతూ ఉంది.

**09-11-2019న**
**కైశికద్వాదశి సందర్భంగా...**

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవ రాయలు రచించిన దివ్యప్రబంధం 'ఆముక్తమాల్యద'. శ్రీనివాసస్వామి భక్తుడైన శ్రీకృష్ణదేవరాయలు, మోక్షసాధనకు భక్తే మార్గమని, మానవకోటికి మార్గనిర్దేశం చేసిన, పరమ పవిత్రమైన ప్రబంధం ఆముక్తమాల్యద.

ఆముక్తమాల్యదలోని 'మాలదాసరి కథ' కలి కాలంలో మానవకోటికి మార్గదర్శకత్వాన్ని చూపే మహిమాన్వితమైనది.

శ్రీమహావిష్ణువు వామనరూపంలో అవతరించి, నివసించిన పుణ్యభూమి 'కురుంగుడి'. 108 దివ్యవైష్ణవక్షేత్రాల్లో

**తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రతి సంవత్సరం కార్తికశుద్ధద్వాదశీ రోజు కైశికద్వాదశి ఉత్సవం జరుగుతుంది. తిరుమల ఆలయంలో... మూలమూర్తిగా, భోగశ్రీనివాసమూర్తిగా, మలయప్ప స్వామిగా, ఉగ్రశ్రీనివాసమూర్తిగా, కొలువు శ్రీనివాస మూర్తిగా ఐదు రూపాలలో పూజలందుకుంటున్నారు శ్రీవేంకటేశ్వరస్వామివారు. ఎన్నడూ గర్భాలయం దాటి వెలుపలకు రాని.... ఉగ్రశ్రీనివాసస్వామి, ఒక్క కైశిక ద్వాదశి రోజున మాత్రమే సూర్యోదయానికి పూర్వమే గర్భాలయంనుండి... బయలుదేరి, తిరుమల నాలుగు మాడవీధులలోకి వేంచేసి, సుమారు ఉదయం 4.30**



ఒకటి. ఈ పుణ్యక్షేత్రం తమిళనాడులో ఉన్నది. ఈ క్షేత్రంలో మహావిష్ణువు 'మన్నారుస్వామి'గా పూజలందుకొంటూ... ఉన్నారు. ఆ గుడికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలోని ఒక హరిజనవాడలో విష్ణుభక్తుడైన 'మాలదాసరి' నివసించే వాడు. స్వామివారిని నిత్యం సేవించడమే తన దినచర్యగా జీవించే భక్తుడతడు.

ఇతను రోజూ ఉదయాన్నే బ్రాహ్మీముహూర్తంలో తనవాడ నుంచి కాలినడకనే మన్నారు స్వామి కొలువై ఉండే కురుంగుడికి చేరుకొని, చేతిలోని కిన్నరవీణను మీటుతూ, 'మంగళకైశికీ' రాగంతో రాళ్ళుసైతం కరిగేలా శ్రీహరిని స్తుతిస్తూ, గానం చేస్తాడు. భక్తి పారవశ్యంతో తనను తాను మరచిపోయి, మధ్యాహ్నం వరకు తాండవం చేస్తూ, స్వామి వారిని అర్చిస్తాడు.

గుడి బయట ప్రాకారానికి ప్రదక్షిణ చేసి, స్వామికి సాష్టాంగనమస్కారం బయటనుండే చేసి, గుడి లోపల నుంచి వచ్చిన వారు ఇచ్చే తీర్థప్రసాదాలను స్వీకరించి, పొద్దుపోయే సమయానికి తిరిగి హరిజనవాడకు చేరు కుంటాడు.

ఒక రోజు అర్ధరాత్రి సమయాన మాలదాసరి ఇంటికి దగ్గరలోని కోళ్ళ అకాలకూతలకు మేల్కొని, తెల్ల వారిందనుకొని, అర్ధరాత్రి వేళ మన్నారుస్వామి గుడికి బయలు దేరుతాడు. దారిలో మరులు తీగ త్రొక్కుతాడు. ఆ తీగను ఎవరైతే త్రొక్కుతారో, వారు దారి మరచిపోయి తిరుగుతూ ఉంటారు. అందువలన మాలదాసరి కూడా దారి తప్పి, ఆ అర్ధరాత్రివేళ ఎవ్వరూ లేని అడవిలోకి ప్రవేశించి, ఒక పెద్ద మర్రిచెట్టు వద్దకు చేరుకొనగా, ఆ చెట్టుపైన ఒక బ్రహ్మరాక్షసుడు చచ్చిన మనిషి శరీరాన్ని మొలత్రాడుగా చుట్టుకుని, రెండు పెద్ద కోరలతో, నల్లగా, భయంకరంగా ఉన్న అతడు మాలదాసరిని చూచి బండబూతులు తిడుతూ "ఒరేయ్! కనిపించావు, పారిపోకు" అని చెట్టు మీద నుంచి క్రిందకు దుమికి, అతనిని గట్టిగా పట్టుకొంటాడు. పూర్వము మాలదాసరి యుద్ధ భటుడుగా పనిచేశాడు. కాబట్టి తన దగ్గర ఉన్న బాణంతో రాక్షసుడిని కొట్టగా, రాక్షసుడు దానిని విరచివేశాడు. ఇద్దరూ ఒకరుపై ఒకరు పడి పెనుగులాడు కొన్నారు. కానీ చివరకు దాసరి రాక్షసుణ్ణి ఓడించలేక పోయాడు.

## తిరుమలలో కైశిక ద్వాదశీ ఉత్సవం



**నుంచి 5.30 గంటల నడుమ శ్రీదేవి భూదేవి సమే తుడై భక్తులను అనుగ్రహిస్తారు. ఈ ఉత్సవ నేపథ్యంలో తిరుమల ఆలయంలో స్వామివారికి సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తి స్వామివారు తన ఉభయనాం చారులతో తిరువీధులలో ఊరేగి తిరిగి ఆలయంలో ప్రవేశించాక, నైవేద్య సమర్పణానంతరం, తిరుమల ఆలయంలో కైశికద్వాదశీ ఆస్థానం జరుగుతుంది.**

**ఆ ఆస్థానంలో స్వామివారికి పూజల అనం తరం, కైశికపురాణంలోని నంబాడువాన్‌కథను తెలియ చేసి హరి గాన మహిమను తెలియచేస్తారు.**

రాక్షసుడు తన రాక్షస స్త్రీలను పిలవగా, అందరూ చుట్టు ముట్టి దాసరిని పట్టుకొని త్రాళ్ళతో కట్టేస్తారు. నన్ను ఇంత శ్రమపెట్టిన నీ తల నరికి, నీ మాంసాన్ని తింటానని అంటాడు. అప్పుడు దాసరి ఆ రాక్షసుడితో ప్రాణరక్షణ కోసం పెనుగులాడకుండా 'నువ్వు కోపం తెచ్చుకోవద్దు, నాకు శరీరం మీద కోరిక లేదు, ఈ శరీరం నశించడమే మంచిది' అని పలుకుతాడు.

"నా శరీరాన్ని నీకు ఆహారముగా ఇవ్వడం వలన నాకు ఎంతో మేలు జరుగుతుంది. ఒక ప్రాణి ఆకలిని తీర్చి సంతోషాన్ని నింపడం వలన నాకు మోక్షము కలుగుతుంది. ఇందుకు, అశాశ్వతమైన దేహాన్ని త్యజించి, శాశ్వతమైన మోక్షాన్ని సాధించిన శిబిచక్రవర్తే, ఉత్తమ ఉదాహరణ కదా!", అని మాలదాసరి, ఆ రాక్షసుడితో పలుకుతాడు. అతడా మాటలను హేళన చేస్తూ పెడచెవిన పెడతాడు. దైవస్మరణ చేస్తూ దాసరి, ఆ రాక్షసుడితో, "నేను నా శరీరాన్ని నీకు ఆహారంగా తప్పక అర్పిస్తాను. నీకు ఆహారం కాబోయేముందు నా ప్రార్థన ఏమంటే ఇక్కడికి దగ్గరలో ఉన్న కురుంగుడి వైకుంఠుణ్ణి ఒక వ్రతంగా, నిత్యం నేను కైశికిరాగంతో అర్చిస్తాను. ఈ రోజే ఆ వ్రతం పూర్తి కానున్న దినం. నీవు దయతో అంగీకరించి, హరిగాన కైంకర్యానికి వెళ్ళి రావడానికి నాకు అనుమతిని ఇవ్వు", అని ప్రార్థిస్తాడు. రాక్షసుడు నవ్వుతూ 'నోటికి దొరికిన ఆహారాన్ని నీ మాటలు నమ్మి నేనెలా పోగొట్టుకుంటాను?, నీ మాయమాటలు ఆపమని', పలుకుతాడు. దాసరి ఎన్నో శపథాలు చేసినా, రాక్షసుడు నమ్మడు.

అప్పుడు దాసరి ఈ విధంగా రాక్షసుడితో శపథం చేస్తాడు. ఎవ్వని చూపుతో ఈ జగం జన్మిస్తుందో, నివసిస్తుందో, నశిస్తుందో, ఆ సాటిలేని దేవదేవుడు మహావిష్ణువు. అతడిపై ఆన! అంటూ దాసరి శపథం చేస్తాడు. ఆ మాటలు విశ్వసించిన రాక్షసుడు, దాసరి కట్లు విప్పేస్తాడు.

మాలదాసరి కురుంగుడికి వెళ్ళి శ్రీహరికి సాష్టాంగ నమస్కారం చేసి, విపంచి వాయిస్తూ తనివి తీరా హరి గానం చేసి స్వామిని అర్చించి, బ్రహ్మరాక్షసుడి దగ్గరకు తిరిగి వచ్చి, ఇక తన శరీరాన్ని ఆహారంగా స్వీకరించ రమ్మని, మాలదాసరి రాక్షసుడిని పిలుస్తాడు. దాసరి సత్య వాక్యపాలనకు, ఆనంద ఆశ్చర్యాలకులోనైన బ్రహ్మరాక్షసుడు దేవతలు, దానవులు, రాజులు, మునులు వీరెవ్వరూ కూడా నీలాగా ఇంతకు మునుపు ఇలా శరీర దానం చేయలేదని దాసరిని స్తుతిస్తాడు.

"ఓ దాసరీ! ఈ నీ ధైర్యం, నీ స్మృతి, నీ సత్య భాషణమునకు సాటి, యెవ్వరునూ లేరు. నీవు శ్రీహరి పదసేవనమే జీవనంగా ఉన్నవాడివి. కురుంగుడి భగవంతుని కరుణ కలిగినవాడివి. మధురమైన హరిస్తోత్రగానం అనే సముద్రపు అలల్ని దివ్యనాద ప్రదంగా తుంచికట్టిన నీ వీణ అనెడి తెప్పచేత దాటుతున్నావు. అలాంటి నీకు సమానమైన వారెవ్వరూ లేరని" రాక్షసుడు దాసరితో అంటాడు. దాసరి, తనను ఆహారంగా స్వీకరించి నీ ఆకలిని తీర్చుకొనుమని రాక్షసుడిని కోరగా, రాక్షసుడు నీ లాంటి మహానుభావుడి కోసమే ఎదురు చూస్తూ ఉన్నానంటూ, తాను పూర్వజన్మలో సోమశర్మ అనే బ్రాహ్మణుడినని, ఆ జన్మవృత్తాంతం వివరించి, తనకు ఎట్లు ఈ రాక్షస రూపం వచ్చిందో తెలుపుతాడు.

తరువాత దాసరిని "నీ మంగళకైశికీ హరిగాన ఫలాన్ని నాకు దానం చేసి, నా ఈ రాక్షస రూపాన్ని పోగొట్టమని" రాక్షసుడు ప్రార్థిస్తాడు. "అయ్యా! హరిగాన ఫలము నే నెఱగను, నిన్ను శ్రీహరి రక్షిస్తాడని" దాసరి అనగానే బ్రహ్మరాక్షసుడు శాపవిముక్తుడై సోమశర్మ అనే వైష్ణవునిగా మారిపోతాడు. దాసరిని ఆ వైష్ణవుడు పూజలు చేసి, శెలవు తీసుకొని, తీర్థయాత్రలు చేసి, చివరకు మోక్షము పొందుతాడు. కులం కాదు, గుణమే ప్రధానమని, దైవ కృపకు అందరూ సమానులేనన్న సందేశానిస్తున్నదీ కథ. విష్ణుదేవుని... గొప్పతనాన్ని, వైష్ణవ... భక్తిమాహాత్మ్యాన్ని, ముఖ్యంగా హరిగాన మహిమను లోకాలకు చాటుతున్న ఈ కథ తెలుగుసాహిత్య సింహాసనాన ఓ కలికితురాయి.

# పేయాళ్వార్ పాశురాలలో 'పెన్నిధి'

- ఆచార్య కె. సర్వోత్తమరావు, 97041 04000

శ్రీవైష్ణవ సంప్రదాయానికి తమిళనాడు పెట్టని కోట. ఈ సంప్రదాయానికి మూలపురుషులు ఆళ్వారులు. స్థితికారకుడైన మహావిష్ణువు రూప, లీలాగుణాదుల కీర్తనలతో పరవశించి ఆ ఆనందంలో మునిగినవారే ఆళ్వారులు. ఇలాంటి ఆళ్వారులు పన్నిద్దరని సంప్రదాయం విశ్వసిస్తుంది. వారిలో 'ముదల్ ఆళ్వార్లు' ఇతర ఆళ్వారులకంటె సర్వోన్నతులని కొందరి విశ్వాసం. వారే పొయ్గై ఆళ్వారు అనబడే సరోయోగి, పూదత్తాళ్వార్ అనబడే భూతయోగి, పేయాళ్వారనబడే మహాయోగి. వీరందరు ఒకే కాలంవారు. దైవ నిర్ణయంతో ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా 'తిరుక్కోవలూరు' అనే దివ్యదేశంలో కలుసుకొన్నవారు. వీరు ముగ్గురు శ్రీహరికి చేసిన 'నివాళి' కమనీయం. రమణీయం. భక్తిభరితం. జ్ఞానదృష్టి గోచరం.

మొదటి ఆళ్వార్ భూమిని ప్రమిదగా భావిస్తే రెండవ ఆళ్వార్ భక్తినే ప్రమిదగా భావించారు. తొలి ఆళ్వార్ సముద్రజలాన్ని నేతిగా భావిస్తే రెండవ ఆళ్వార్ తన భగవదార్తిని నేయిగా సమర్పించారు. ప్రథములు దీపారాధన కోసం సూర్యునే వత్తిగా చేయగా ద్వితీయులు భగవచ్చింతనను వత్తిగా చేసి తమ జ్ఞానసంపదను దీపకాంతిగా చేసికొన్నారు. వీరిద్దరు వెలిగించిన జ్ఞానదీపద్వయం కారణంగా మూడవ వారైన పేయాళ్వార్ భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని తనివితీరా దర్శించి-

తిరుక్కండేన్ పొన్మేని కండేన్, తికళుమ్
అరుక్కన్, అణినిరమున్ కండేన్, శెరుక్కిశరుం
పొన్నాళి కండేన్ పురిశంగై కండేన్
ఎన్నాళి వణ్ణన్ పాల్ ఇంగు

అనే పాశురం పాడారు. ఈ పాశురం అర్థాన్ని... శ్రీ కె.టి.యల్.నరసింహాచార్యులవారు...

'ఆహా! ఏమి ఆనందం? శ్రీమహాలక్ష్మి నా ఈ ప్రాకృత నేత్రాలకు కనిపించింది. శ్రీవారి సువర్ణశరీర సౌందర్యాన్ని ఈనాడు నేత్రాంజలులతో తనివితీరా క్రోలగలిగాను. పాపాత్ములను సమూలంగా ఛేదించే స్వామి హస్తాన్ని అలంకరించిన సుదర్శనాయుధాన్ని కూడా సందర్శించగలిగిన భాగ్యశాలిని అయ్యాను. ప్రళయకాలాభీలమైన పర్జన్యదేవుని గర్జనను అనుకరించే పాంచజన్యదర్శన సుకృతి నాకు లభించింది. నీలమేఘవర్ణుడైన శ్రీవైకుంఠుని దివ్యమంగళ విగ్రహాన్ని సందర్శించిన సౌభాగ్యవంతుడనైన నాకు కోరదగినది ఏముందని కమనీయంగా విశదీకరించారు.

తాళ్లపాక కుటుంబీకుడైన తిరువేంగళనాథకవి పరమయోగివిలాసంలో ఆళ్వారుల పాశురభావాన్ని అందమైన సుందరమైన శ్రావ్యమయిన తెలుగులో వర్ణించిన తీరు ప్రశంసాపాత్రం.

సిరిగంటి చెన్ను మించిన మేను గంటిఁ
గరమొప్పు వదన వికాసంబు గంటి।

సల్లలితావనీస్తనకుంభ శుంభ
పల్లవంబులఁ బోలు పాదముల్గంటి...

చుట్టుఁగైదువు వలచుట్టు శంఖంబు
పట్టి చూపట్టిన బాహువుల్గంటి

శీతాంశుమండల శతకోటికోటి
రీతిఁ జూపట్టు కిరీటంబుఁ గంటి

మలగులై తెల్లదామరలఁ దామరలఁ
గలహించు నిడువాలుఁ గన్నులఁ గంటి

మకరకుండల బాలమార్తాండరుచుల
వికసించు వదనారవిందంబుఁ గంటి.

శ్రీమహావిష్ణువును కళ్లార దర్శించిన మహాయోగి శతభిషక్ నక్షత్రంలో మయూరనగరం (చెన్నై-మైలాపూర్)


**శ్రీపేయాళ్వార్‌వర్షతిరునక్షత్రం 06-11-2019 సందర్భంగా...**

ఎఱ్ఱకలువలో జన్మించినవారు.వీరు అన్నమయ్యలాగ స్వామి నందకాంశసంభూతులు. వీరికి 'భ్రాంతయోగి' అని నామాంతరం. వీరు రచించిన నూరుపాశురాలు మూండ్రాం తిరువందాదిలో కనిపిస్తాయి. గానంతో... పాడబడే పద్యాలనే తమిళంలో పాశురాలు అంటారు.

పేయాళ్వారు పాడిన పాశురాలలో 'తిరువేంగడ ముడైయాన్' పాశురాలు బహుళప్రచారంలో ఉన్న పాశురాలు. ఏడుకొండల పైభాగాన్ని మొట్టమొదట 'తిరుమలై' అని కీర్తించినవారు పేయాళ్వార్. వీరు పాడిన 19 పాశురాలు అతని కాలం నాటి తిరుమల ప్రాకృతికసౌందర్యాన్ని, ప్రాచీనతను, తిరుమలలో సంచరించే తిర్యక్కుల భక్తివిశేషాల్ని, ఇతర దివ్య దేశాలకంటె తిరుమల సమున్నతమని నిర్ధారించే అంశాలను స్పష్టపరుస్తాయి. వీటిలో నాలుగయిదు పాశురాల అర్థవిశేషాల్ని పరిచయం చేయడం ఈ వ్యాసప్రధానాంశం.

పేయాళ్వార్ తిరుమలేశుని తేరిపార చూచినారు. తలపై జడలు కనబడుతున్నాయి. చేతిలోని గొడ్డలి కళ్లకు ఆనుతూ ఉంది. మొలలో నాగాభరణం మెరుస్తూ ఉన్నది. అదే సందర్భంలో స్వామిపై సువర్ణకిరీటం, చేతిలో చక్రం, మొలపై బంగారు మొలనూలు కనబడితే స్వామి 'ఇరండు ఉరువుం ఒన్డాయ్ ఇశైన్దు'. హరిహరస్వరూపాలు రెండూ చేరి ఒకటిగా తోచుచున్నదన్నాడు విశాలభావం గల పేయాళ్వార్.

తిరుమలలోని ఏనుగులు కూడా స్వామిసేవకు తహతహలాడేవే. స్వామిని సేవించాలనుకొనే వారు ముందుగా నోళ్ళను శుభ్రం చేసుకోవడం, పాదాలను కడుగుకొని ఆలయంలో ప్రవేశించడం సహజధర్మం. ఇలాగే ఒక ఏనుగు మదజలంతో నోటిని కడిగి పరిశుద్ధం చేసుకొన్నది. మదజలములచే పాదాలను ప్రక్షాళనం చేసుకుంది. మత్తు కలిగించే తేనె నిండారిన పుష్పాలను తొండంతో అందుకొంది. తిరువేంగడ ముడైయానును సేవించి తన జన్మను సార్థకం చేసుకొన్నది. అటువంటి తిర్యక్ సంతతి సంచరించే తిరుమలకొండ.



పేయాళ్వార్ దృష్టిలో వేంకటేశ్వరుడు శ్రీకృష్ణ స్వరూపుడే. తిరుమల సువిశాలం, అనేకానేక పర్వత శోభితం. చంద్రుని విహారానికి తగిన ఆవరణం. అలాంటి చంద్రునిలోని నల్లటి కుందేటిని అడవిలో సంచరించే ఒకానొక పులి చూచింది. ఆ కుందేలు తన్ను హీనంగా చూస్తున్నట్లు భావించింది. కోపంతో గాండ్రించింది. అలాంటి గాండ్రింపులు సదా వినబడే శ్రీకృష్ణస్వామి నివసించే పర్వతం ఇదే. వికసించి పరిమళించిన 'వేంగై' పుష్పాలతో అలరారే కొండ అని వర్ణించారు. కొండల శిఖరాలు త్రివిక్రమ స్వామి వైభవాన్ని చాటుతున్నట్లున్నాయి. స్వామి కల్యాణగుణాలను ప్రస్ఫుటం చేసే వేంగై పుష్పాలని వ్యాఖ్యాతలు ఈ కీర్తనకు అర్థవిశేషం చెప్పారు.

తిరుమల పర్వతప్రాంతం. ఈ పర్వత ప్రాంతాలలో... వెదురులెక్కువ. వెదురుపొదలు ఎక్కువ. ఆ ప్రదేశంలో ముదుసలి బోయవాండ్రు వ్యవసాయం చేయాలనుకొన్నారు. అటవీ ప్రాంతం... కనుక వెదుళ్ళను నరికారు. పొదలను సమూలంగా పెరికివేశారు. వ్యవసాయ యోగ్యమైన... క్షేత్రంగా

మార్చారు. అడవిపండులతో దున్నించారు. ధాన్యాలు చల్లిపంటలు పండించి జీవిస్తున్నారు. కాని అక్కడక్కడ వదలిపెట్టబడిన వెదురుదుంపల నుండి పొలాలకోసం పారించిన జలసమృద్ధితో ఆ వెదుళ్ళు మొలిచాయి. ఏపుగా పెరిగాయి. వెదుళ్ళకొనలు ఆకాశాన్ని బద్దలుచేస్తున్నాయి. ఆ వెదుళ్ళను చూస్తుంటే ద్వాపరయుగంలో పిల్లన గ్రోవిని చేబట్టి పాటలు పాడి జగత్తునంతా మోహింపజేసిన కృష్ణుని తలపిస్తున్నది. వేంకటాచల దివ్యపర్వతం శ్రీకృష్ణుడు నివసించిన పర్వతమని చాటి చెబుతున్నట్లున్నది. ఈ భావంగల పేయాళ్వార్ పాశురం-

**ముడిన్ద పొళుదిల్ కుఱవానర్, ఏనమ్**
**పడిన్దుఴుశాల్ పైన్దినైగళ్ విత్త-త్తడిన్దెఴున్ద**
**వేయ్ంగళ్ళైపోయ్ విణ్తిఱక్కుమ్ వేంగడమే మేలారునాళ్**
**తీఞ్గుళల్ వాయ్ వైత్తాన్ శిలమ్బు**

వేటాడేబోయజాతి చివరదశలో వార్ధక్యంలో వ్యవసాయం చేయడం వింతలో వింత. కాని, ఇందులో పరమార్థం లేక పోలేదు. జీవితమంతా హింసతో గడచింది. పాపాల పుట్టగా బతుకుసాగింది. ఇకనైనా పరమాత్మ చింతన అవసరమని భావించి వ్యవసాయ వృత్తిని చేబట్టారని అర్థ విశేషం.

కలియుగంలో అలసులు, మందబుద్ధులు, తరించడానికోసం స్వామి తన పరివారాన్ని అవతరించవలసిందిగా ఆదేశించాడు. తానూ అర్చావతారంగా అనేక ప్రదేశాలలో సాక్షాత్కరించాడు. అవన్నీ దివ్యదేశాలుగా ఆళ్వారుల మంగళాశాసనాలతో దర్శనీయంగా వైభవోపేతంగా అలరారుతున్నాయి.

స్వామికి నిత్యనివాసం పాలకడలి. అలాగే వైకుంఠం. మరి స్వామి భూలోకంలో స్వయంవ్యక్త మూర్తిగా అవతరించిన వేళ వాసస్థలమేది అనే సందేహం పామరులకు రావచ్చు. ఈ సందేహనివృత్తి కోసం ఆళ్వార్ 'తిరుక్కడికై' (షోలింగర్-ఘటికాచలం) 'తిరువిణ్ణగరమ్' అనే దివ్యదేశాలే వాసస్థలమన్నారు. మరి ఈ తీర్మానానికి బలంగా తుమ్మెదలు గుంపులు గుంపులుగా సంచరించే 'ఘటికాచలం' ఒక సాక్ష్యం. సర్వేశ్వరుడు నిత్యయౌవనమూర్తిగా కనిపించే 'తిరువిణ్ణగరమ్' మరోసాక్ష్యం. క్షీరసాగరం, వైకుంఠంలో వసించే స్వామి దివ్యదేశాలలో విరాజితుడయినా ఆళ్వార్ మనసులో సదా నివసిస్తున్నాడని మరొక అర్థవిశేషం.

పేయాళ్వార్ తిరువేంగడముడైయాన్‌ను త్రివిక్రమావతారునిగా భావించారు. ఆ స్వామి సాక్షాత్కరించిన వేంకటగిరి నిర్మలస్ఫటికశిలాతలభరితం. ఈ తిరుమలపై వానరద్వయం సంచరిస్తున్నది. ఆ తిర్యక్కుల అనురాగం అత్యాశ్చర్యకరం. ఒక ఆడుకోతి తన నాథుడైన మగకోతిని చూచి 'నాథా!' నేనెప్పుడు నిన్ను ఏదీ కోరలేదు. అదిగో చూశావా? ఆకాశంలో తెల్లగా చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. స్ఫటికశిలకారణంగా గిరియంతా శ్వేతవర్ణాంకితంగా ఉంది. ఆ చంద్రుని నాకు తెచ్చి ఇవ్వవా అని అడిగేటి పర్వతం వేంకటాచలమని..

**తెళిన్ద శిలాతలత్తిన్ మేలిరున్ద మన్ది**
**అళిన్ద కడువనై యే నొక్కి విళంగియ**
**వెణ్ మదియమ్ తా వెన్నుమ్ వేంగడమే- మేలొరునాళ్**
**మణ్ మదియిల్ కొండుగన్దాన్ వాళ్వు.**

- వర్ణించారు. అంతేకాదు ఆళ్వారు తిరుమలను వరాహక్షేత్రంగా భావించారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం తిరుమలలో స్వామిపుష్కరిణి తీరంలో వరాహస్వామి సన్నిధి నేటికీ భక్తజన సేవ్యమానమై ఉండడమే!

పేయాళ్వార్ తిరువేంగడముడైయాన్ మంగళాశాసన పాశురాలలో పౌరాణిక ప్రాశస్త్యం, తిర్యక్ జాతి అనుపమ భక్తి ప్రకటన, తిరుమల కొండవైభవం సుస్పష్టం. మొదటి ఆళ్వార్ సర్వేశ్వరుడు ఉభయవిభూతియుక్తుడని అనుసంధానిస్తే, రెండవ ఆళ్వార్ ఆ విభూతి నారాయణశబ్దమని తెలియజేస్తే, మూడవ ఆళ్వార్ నారాయణశబ్దానికి శ్రీశబ్దాన్ని కూడా చేర్చుకోవాలని సూచించారు.

*ఆళ్వార్ తిరువడిగళే శరణమ్*



# శ్రీమహాలక్ష్మి చతుర్వింశతి నామావళి

- శ్రీ యం.జి.రామచంద్రన్, 70107 07289

తిరుమలక్షేత్రంలో ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాణ్మూర్తికి ప్రతిరోజూ మూడు మారులు అర్చన జరుగుతున్నది. తెల్లవారుజామున తోమాల సేవ అయిన వెంటనే అష్టోత్తరసహస్ర (1008) నామాలతో "సహస్రనామార్చన"జరుగుతుంది. పిదప, మధ్యాహ్నం పూట, మళ్లీ రాత్రిపూట అష్టోత్తరశత (108) నామాలతో అర్చన జరుగుతుంది. పై అర్చనలు జరిగిన ప్రతిసారీకూడ ఆ వెంటనే శ్రీవేంకటేశ్వరస్వామివారి వక్షఃస్థలంలో కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారికి వరాహపురాణంలోని చతుర్వింశతి(24) నామాలతో అర్చన జరుగుతుంది.

**"సప్తగిరి" పాఠకుల కోరికమేరకు, శ్రీవ్యూహలక్ష్మి అమ్మవారి చతుర్వింశతి నామావళిని ఈ నెలలో జరుగుతున్న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అందజేస్తున్నాం.**

*శ్రీవేంకటేశ మహిషీ మహాలక్ష్మీ ప్రీత్యర్థం శ్రీవేంకటేశ మహిషీ మహాలక్ష్మీ చతుర్వింశతి నామభిః శ్రీవేంకటేశ మహిషీ మహాలక్ష్మీఅర్చనం కరిష్యే.*

*అస్య శ్రీమహాలక్ష్మీ చతుర్వింశతినామ మంత్రస్య బ్రహ్మా ఋషిః। అనుష్టుప్ ఛందః। శ్రీమహాలక్ష్మీ దేవతా శ్రీ వేంకటేశ మహిషీ మహాలక్ష్మీ ప్రీత్యర్థే జపే వినియోగః.*

**ధ్యానమ్॥**

**ఈశానాం జగతోస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్**
**పద్మాలంకృత పాణి పల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్.**

01) ఓం శ్రియై నమః
02) ఓం లోక ధాత్ర్యైనమః
03) ఓం బ్రహ్మమాత్రే నమః
04) ఓం పద్మ నేత్రాయైనమః
05) ఓం పద్మముఖ్యై నమః
06) ఓం ప్రసన్నముఖపద్మాయై నమః
07) ఓం పద్మకాంత్యై నమః
08) ఓం బిల్వవనస్థాయై నమః
09) ఓం విష్ణు పత్న్యై నమః
10) ఓం విచిత్ర క్షౌమధారిణ్యై నమః
11) ఓం పృథుశ్రోణ్యై నమః
12) ఓం పక్వ బిల్వఫలా పీన తుంగస్తన్యైనమః
13) ఓం సురక్త పద్మపత్రాభ కరపాదతలాయై నమః
14) ఓం శుభాయై నమః
15) ఓం సరత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితాయై నమః
16) ఓం యక్ష కర్దమ సంలిప్త సర్వాంగాయై నమః
17) ఓం కటకోజ్జ్వలాయై నమః
18) ఓం మాంగల్యాభరణైశ్చిత్రై ర్ముక్తాహారై ర్విభూషితాయై నమః
19) ఓం తాటంకై రవతంసై శ్చ శోభమానముఖాంబుజాయై నమః
20) ఓం పద్మహస్తాయై నమః
21) ఓం హరివల్లభాయై నమః
22) ఓం ఋగ్యజుస్సామ రూపాయై నమః
23) ఓం విద్యాయై నమః
24) ఓం అబ్ధిజాయై నమః

**ఏవం చతుర్వింశతి నామభిః బిల్వపత్రైః లక్ష్మ్యర్చనం**
**కుర్యాత్ తేన సర్వాభీష్ట సిద్ధిర్భవతి.**


**ఇతి చతుర్వింశతి నామావళిః**




## 30-09-2019 నుండి 08-10-2019 వరకు జరిగిన
### తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం
### వాహన సేవలు, కళాప్రదర్శనల దృశ్యాలు



తిరుమల మాఢవీధులలో
ఉభయదేవేరులతో శ్రీవారి ముందు భాగాన
గరుడపటం ఊరేగింపు



తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభంపై గరుడపటం ఎగురవేయుట



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న
ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి గారు



పెద్ద శేషవాహన సేవలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర
ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

తిరుమల తిరుపతి దేవస్థానములు

## 30-09-2019 నుండి 08-10-2019 వరకు జరిగిన

## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం వాహన సేవల దృశ్యాలు



పెద్దశేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు !




చిన్నశేషునిపై శ్రీవారు! జీయర్‌స్వాములు, అధ్యాపకుల దివ్యప్రబంధపారాయణం



హంసవాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామివారు !



సింహవాహనంపై శ్రీస్వామివారు !



ముత్యపుపందిరివాహనంలో శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీవారు !



కల్పవృక్షవాహనంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడు !



సర్వభూపాలవాహనంలో శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుడు !



జగన్మోహిని అలంకారంలో శ్రీస్వామివారు !

తిరుమల తిరుపతి దేవస్థానములు

## 30-09-2019 నుండి 08-10-2019 వరకు జరిగిన

## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం వాహన సేవల దృశ్యాలు



గరుడవాహనంపై శ్రీగరుడాచలపతి !



హనుమవాహనంపై శ్రీవేంకటాద్రిరాముడు !



గజవాహనంపై శ్రీనివాసుడు !



సూర్యప్రభవాహనంలో శ్రీసప్తగిరీశుడు !



చంద్రప్రభవాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామివారు !



స్వర్ణరథోత్సవంలో శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి !



అశ్వవాహనంపై ఆనందనిలయుడు !



శ్రీదేవి,భూదేవి,శ్రీవారి సమక్షంలో చక్రతీర్థోత్సవం !


తిరుమల తిరుపతి దేవస్థానములు

# 30-09-2019 నుండి 08-10-2019 వరకు జరిగిన

## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం దృశ్యాలు



శ్రీవారి దర్శనానంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌ॥ శ్రీబిశ్వభూషణ్ హరిచందన్‌గారికి శ్రీవారి చిత్రపటాన్ని తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఎ.ఎస్., గారు అందజేశారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వైయస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి శ్రీవారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,



ఊంజలసేవ



స్నపనతిరుమంజనం





కళాబృందాలు





## వింత వింత మొక్కుబళ్లు

'పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి' అన్నట్లు ఎన్నెన్ని పుర్రెలున్నాయో, వాటి ఆలోచనలు మరెన్నెన్ని ఉన్నా, ఆ ఆలోచనలకు తగ్గట్లు అభిరుచులు ఉన్నా, ఆ అన్నింటి ఆలోచనలకు, అభిరుచులకు తగిన దేవుడు తిరుమలేశుడు.

భక్తుల ఆచార వ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాషలు ఒక్కటి కాకపోయినా, మొక్కులను వింత వింతలుగా చెల్లించినా వాటినన్నింటిని ప్రీతిగా స్వీకరించి, వారి వారి కోరికలను తీరుస్తున్న స్వామి తిరుమలేశుడు!

అసలు మొక్కుబళ్ల మిషతోనే తన దగ్గరికి రప్పించుకుంటాడట శ్రీనివాసుడు. మొక్కబళ్ల సమర్పణలో ఆడామగా, చిన్నా పెద్దా తేడా లేకుండా మొక్కులుగా, కొందరు నిలువు దోపిళ్లిస్తారు. తలచిక్కులను ఇస్తారు. తల చిక్కులను స్వీకరించి, జీవితంలోని చిక్కులను తీర్చే విచిత్రమైన స్వామి వేంకటేశుడు.

సామాన్యులేకాక మాన్యులు, అసామాన్యులు కూడా దేవుడికి మొక్కులు చెల్లించారు.

విజయనగరచక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు 1513 నుండి 1521 వరకు ఏడుమార్లు తిరుమలయాత్ర చేసి, నవరత్నఖచిత హారాలను, పాల ఆరగింపు కోసం బంగారు గిన్నెలను, మకరతోరణాన్ని, బంగారు విమాన పూతను మొక్కుబళ్లుగా సమర్పించినాడట! అచ్యుతరాయలు వెంకటపతిరాయలు, ఎన్నో మొక్కులు చెల్లించారు.

అంతకు పూర్వం 614లో **పల్లవరాణి సామవై** వెండి శ్రీనివాసుని చిన్నవిగ్రహాన్ని మొక్కుగా సమర్పించి, బ్రహ్మోత్సవాలకు ముందుగా ఊరేగించేట్లు ఏర్పాటు చేసిందట.

**తులాభారాలు, ఆలయప్రదక్షిణలు, అంగప్రదక్షిణలు, అఖండదీపారాధనలు...** ఇలా శ్రీస్వామివారికి సమర్పింపబడే మొక్కులు ఎన్నెన్నో! ఎవరికెరుక.

## విచిత్రమైన వరాలు - ఆనందకరమైన లీలలు

కొండలరాయడు 'కోరిన వరాలరాయడు'. అన్నమయ్య అన్నట్లు–

**'ఏమివలసిన ఇచ్చు ఎప్పుడైనను**
**ఏమరక కొలిచిన ఇతడే దైవము'**

కొందరికి కన్నులిస్తాడు, కాళ్లిస్తాడు. పనిచేయ చేతులిస్తాడు. మాటలిస్తాడు. ప్రాణమిస్తాడు. పదవులిస్తాడు. కడుపును నింపుతాడు. కడుపును పండిస్తాడు.

**'శ్రీనివాసా! బహూక్త్యా కిం? భక్త సర్వార్తినాశనే**
**సర్వార్థ పూరణే చాపి త్వత్సమోబ్రహ్మాండే న కుత్రచిత్'**

అయ్యా! భక్తులకు "అవి ఇస్తావు, ఇవి ఇస్తావు" అని పొగడడం దేనికి? భక్తుల సర్వార్తులను పోగొడుతూ, సర్వార్థాలను ప్రసాదించే నీలాంటి దేవుడు ఈ బ్రహ్మాండంలో ఎక్కడా లేడు, కనపడదు కదయ్యా స్వామీ! అని పొగడబడుతున్నాడు తిరుమలేశుడు.

తిరుమల క్షేత్రానికి, తర్వాతి కాలంలో శేషాద్రి, గరుడాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, వృషభాద్రి, వృషాద్రి, అంజనాద్రి అనే ప్రధానమైన ఏడు పేర్లు ఏర్పడ్డాయి. అందువల్లే ఈ క్షేత్రం 'ఏడుకొండలు' అనీ, 'సప్తగిరులు' అని పిలువబడుతున్నది. కేవలం ఈ ఏడుపేర్లే గాక ఈ క్షేత్రానికి ఎన్నెన్ని పేర్లు ఉన్నాయో లెక్కపెట్టి చెప్పడం కూడా చాలా కష్టం.



03

# దివ్యక్షేత్రం... తిరుమల

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

అలాగే ఈ పుణ్యక్షేత్రంలో దర్శనం ఇస్తూ ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి "ఏడుకొండలవాడు, శేషాచలపతి, శ్రీవేంకటపతి, అంజనాద్రీశ్వరుడు, వృషభాద్రీశ్వరుడు, తిరుమలేశుడు, శ్రీనివాసుడు అనీ ఇలా అనేకమైన పేర్లు కలిగాయి.

భక్తుల కోసమే శ్రీవైకుంఠం నుండి దిగి వచ్చిన శ్రీవేంకటేశ్వరస్వామిని స్మరిస్తే చాలు! పాపాలు అన్నీ పోతాయి. ఆ దేవుణ్ణి స్తుతిస్తే చాలు! కోరికలన్నీ తీరుతాయి. ఆ దేవదేవుణ్ణి సందర్శిస్తే చాలు! ముక్తి కలుగుతుంది.

అట్టి శ్రీనివాస భగవానుణ్ణి నిత్యమూ భజిస్తూ, ఆ స్వామివారినీ, ఆయన కొలువై ఉన్న తిరుమల క్షేత్రాన్ని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

శ్లో॥ స్మరణా త్సర్వపాపఘ్నం స్తవనా దిష్టవర్షిణం।
దర్శనా న్ముక్తిదంచేశం శ్రీనివాసం భజేఽనిశమ్॥

## 5. తిరుమల - సంక్షిప్త గాథ

తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికంటె ముందు 'ఆదివరాహస్వామి' ఉండినాడట! అందువల్ల ఇది ఆదివరాహ క్షేత్రం అని పిలువబడుతున్నది. ఆదివరాహస్వామి ఎవరు? ఇక్కడికి ఎందుకొచ్చాడు? ఎప్పుడు వచ్చాడు? అని తెలుసుకోవాలంటే మాత్రం వేల సంవత్సరాలకు పూర్వం జరిగిన కథను చెప్పుకోవాల్సిందే మరి!

### వరాహావతారం

ఒకప్పుడు బ్రహ్మదేవుడు సృష్టి చేస్తూ చేస్తూ బాగా అలసిపోయాడు. పాపం! అలా అలసి సొలసి ఉన్న బ్రహ్మకు నిద్ర ముంచుకొచ్చింది. ఇంతలో ఆయన సృష్టి అంతా అల్లకల్లోలమయి, జలప్రళయం ఏర్పడింది, ఇదే అదను అనుకొన్న హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని సముద్రం అడుక్కి తీసుకెళ్లాడు. ఆ భూగోళాన్ని తంతూ, ఎగరేస్తూ నానా గందరగోళం చేశాడు. ఇంతలో నిద్ర మేల్కొన్న బ్రహ్మదేవుడు రక్షించమని మహావిష్ణువును శరణు వేడాడు. వెంటనే విష్ణుభగవానుడు పెద్దవరాహరూపాన్ని ధరించి,



హిరణ్యాక్షుణ్ణి వధించి తన కోరలతో భూదేవిని ఉద్ధరించి రక్షించాడు.

ఆ స్వామి వరాహరూపంతో చేసిన ఘనకార్యాన్ని దేవతలంతా పొగడుతూ, "ఓ వరాహస్వామీ! భూదేవితో కూడా ఇక్కడే ఉండి అందర్నీ రక్షించుమని" ప్రార్థించారు.


'సరే!' అంటూ వరాహస్వామి, గరుత్మంతునితో వైకుంఠంతోపాటు, అక్కడవుండే సరస్సును తెప్పించి ఇక్కడ స్థాపించాడు. ఆనాటినుంచి అది "ఆదివరాహక్షేత్రం" అనీ, ఆ సరస్సు "స్వామిపుష్కరిణి" అనీ పిలువబడుతున్నది. ఇదీ ఆదివరాహక్షేత్ర గాథ!

ఆ తర్వాత కొన్ని వేల ఏండ్ల తర్వాత ఈ క్షేత్రానికి శ్రీవేంకటేశ్వరస్వామి వచ్చాడు. అసలు ఆ స్వామి ఎందుకు వచ్చాడో, వచ్చిన వాడు ఇక్కడే ఎందుకు నిలబడ్డాడో కూడ తెలియజెప్పుకొందామా మరి! *(ఇంకా ఉంది)*

# శ్రీధన్వంతరి మహాత్మ్యం

- డా॥ ఎస్.లక్ష్మి,
70130 97105

శ్లో॥ అచ్యుతానంత గోవింద విష్ణో నారాయణామృత।
రోగాన్ మే నాశయాశేషానా ఆశు ధన్వంతరే హరే॥



దేవాసురులు అమృతం కోసం సముద్రం మథించినప్పుడు ముందుగా హాలాహలం పుట్టింది. అగ్నిజ్వాలలు కక్కుతూ, విషవాయువులు వీస్తూ ప్రజలందరినీ భయభ్రాంతులను చేస్తున్న ఆ విషము, దుర్నిరీక్ష్యమై ఆకాశాన్నంటుతూ నలుదిక్కులా వ్యాపిస్తూంటే దేవతలు, రాక్షసులు, మానవులు, పరమశివుని ప్రార్థించారు. పరమేశ్వరుడు ఆ విషమును నేరేడు పండులాగా చేతిలో పట్టుకుని, అమృత గుళికలాగా నోట్లో వేసుకొని, ఇంద్రనీలమాణిక్యం లాగా కంఠసీమలో అలంకరించుకుని 'గరళకంఠుడు' అయ్యాడు. కామక్రోధాదులు విడిచిన సత్పురుషుని మనస్సులాగా విషనిర్ముక్తమైన ఆ పాలసముద్రం నుండి తెల్లని పవిత్రమైన కామధేనువు, ఐరావతం, ఉచ్చైశ్రవం ఉద్భవించాయి. లోకమాత శ్రీమహాలక్ష్మి, కోరికలు తీర్చే కల్పవృక్షాలతోబాటు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు **'ధన్వంతరి'**గా అవతరించాడు. ఆ స్వామి శంఖచక్రాలు, ఓషధులు, అమృతకలశం, తన చతుర్భుజములయందు ధరించి 'ఆదివైద్యుని'గా క్షీరసాగరము నుండి ఉద్భవించాడు. దేవతలకు అజరామరమైన అమృతమునందించిన శ్రీధన్వంతరి మానవులకు అనేక ప్రభావములు కలిగే, జరా వ్యాధి మరణాలను తొలగించే ఔషధాలను ప్రసాదించాడు. వాటి ప్రభావములను వర్ణించే 'ఆయుర్వేద శాస్త్రము'ను ప్రసాదించి లోకోపకారం చేశాడు.

'జగత్యేవమనౌషధం' జగత్తులో ఔషధంకాని ద్రవ్యం లేనేలేదు. 'నాస్తిమూలమనౌషధం' ఓషధి కానిచెట్టు లేదు. మర్రిచెట్టు మొదలు తృణపర్యంతం ఉండే వృక్షజాతులు అన్నీ ఓషధీమయమే.


కేరళ రాష్ట్రంలో నెల్లువాయిలో త్రిశూర వద్ద ఒక పెద్ద 'ధన్వంతరి' దేవాలయం ఉంది. దూరదూరాల నుండి రోగగ్రస్తులు అక్కడికి వచ్చి ఆ స్వామిని సేవిస్తూ, కొద్ది రోజులు అక్కడ ఉండి, రోగవిముక్తులై ఆనందంతో తిరిగి వెడుతూంటారు. స్వామిని 'విష్ణుసహస్రనామాల'తో అర్చిస్తారు. 'ముక్కుడి' అనే ప్రసాదం నివేదించి అక్కడ పంచుతారు. ఈ స్వామిని సేవించినవారు ఉదరవ్యాధుల నుండి విముక్తులౌతారని ప్రజల విశ్వాసం. కేరళలో ఆయుర్వేద వైద్యశాస్త్రానికి, ఆయుర్వేద వైద్యులకు వారి ఆరాధ్యదైవమైన 'భగవాన్ ధన్వంతరి'కి చాలా ప్రాముఖ్యమున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రదేశంలో సుప్రసిద్ధులైన ఎందరో ఆయుర్వేద వైద్యులు శ్రీధన్వంతరి పూజచేయటం పరిపాటి. ప్రజల్లో కూడా ఆ చైతన్యం రావాలి. రోగవిముక్తులు కావాలి.

24-11-2019న శ్రీధన్వంతరి జయంతి సందర్భంగా...

# శ్రీవేదాంతదేశికులవారి
# "రఘువీరగద్యం"

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186



**కవితార్కికసింహాయ కల్యాణగుణశాలినే।**
**శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః॥**

ఈ చరాచరసృష్టిలో అనంతజీవకోటిరాశులు తమ మనుగడను సాగిస్తున్నాయి. వీటిలో మానవజన్మ చాలా విశిష్టమైనది. ఎందుకంటే మనిషి తనను తాను సంస్కరించుకొని, తత్త్వజ్ఞానాన్ని పొంది, స్థితికారకుడైన సకల లోకపరిపాలకుడైన శ్రీమన్నారాయణుని అనుగ్రహంచేత మోక్షాన్ని పొందగలుగుచున్నాడు. కానీ, కలియుగంలో అధర్మం వల్ల ధర్మము ఏకపాదముపై నడుస్తున్న వేళ సజ్జనులు పామరులు అందరూ కలిమాయవలన భగవంతునికి దూరమైన సమయంలో ఆ శ్రీహరి **'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'** అన్న వచనాన్ని నిజం చేయడానికై దశావతారాలనే కాక, అనేకానేక అవతారాలను పొందుతూ, **'కలౌ వేంకటనాయకః'** అన్నట్టుగా సాక్షాత్ శ్రీమన్నారాయణుడు భక్తుల పాపాలను భస్మీపటలం చేయటానికి వేంకటగిరిపై వేంకటేశుని అర్చామూర్తిరూపంలో ప్రాదుర్భవించాడు. ఈ స్వామిని విడిచి క్షణమైనా ఉండలేని, స్వామివారి ఆయుధాలు, వాహనాలు ఆళ్వారుల రూపంలో భూమిపై అవతరించి తమ జ్ఞానాగ్ని చేత అజ్ఞానపు చీకట్లను, పారద్రోలి, భక్తులను భగవంతునికి దరికి చేర్చుటకై అహర్నిశలు శ్రమించి, ఆ శ్రీహరిని సేవించి ధన్యతను పొందినారు. వీరిలో సాక్షాత్ శ్రీమన్నారాయణుని 'ఘంటావతార' సంభూతులైన **శ్రీశ్రీవేదాంతదేశికులవారు** అగ్రగణ్యులు.

భక్తాగ్రగణ్యులైన శ్రీవేదాంతదేశికులవారు ఆ శ్రీహరి పైన పరమప్రీతితో అనేకవిధములైన పద్యగద్యస్తోత్ర కావ్యాలను రచించారు. ఈ విధంగా శ్రీవేదాంతదేశికులచే రచింపబడిన స్తోత్రములలో **'రఘువీరగద్య'**మొకటి. దీనికి **'మహావీర వైభవము'**ను పేరు కూడా ఉన్నది. మహావీర శబ్దము

**'శ్రీవేదాంతదేశికులవారి శాత్తుమొఱ'**
**04-11-2019న సందర్భంగా...**

శ్రీరామపరముగా వ్యాఖ్యానించి, పరమపావనుడైన ఆ సీతాపతి శ్రీరాముని వైభవాన్ని కొనియాడుతూ ఈ గద్యభాగాన్ని రచించారు. ఈ కావ్యంలో సందర్భానుసారంగా, అనన్యసాధారణమైన రీతిలో, యథోచిత అర్థవంతమైన పదములను ప్రయోగించి, వినువారి చెవులకు, అర్థమును గ్రహించువారి మనస్సునకు అలౌకికమైన భక్తిరససాగరంలో ముంచెత్తుతుంది. నవరసోపేతమైన కావ్యానందమును అవశ్యం చేకూరుస్తుంది.

**'లోకోత్తరాణాం హి చేతాంసి కో హి విజ్ఞాతుమర్హతి'** అన్నట్టుగా ఈ గద్యరచన గురించి ఆశ్చర్యకరమైన ఒక సంగతిలోకంలో ప్రచారంలో ఉంది. అదేమనగా–**'కంచుఢక్క'** అనే బిరుదుగల్గిన డిండిమభట్టు అనే మహాపండితుడు

దేశికులవారితో వాదనకు వచ్చి, తన వద్దనున్న ఢక్కను వారికి ఇచ్చి 'ఈ ఢక్కను మ్రోగింపుడు. ఆ ధ్వనికి అనుగుణముగా నేను కవిత్వమును చెప్పెదనన్నాడు. కాని దేశికుల వారి డింఢిమధ్వనులకు తడబడి తలవంచెను, తదుపరి దేశికులవారి ఆదేశం మేరకు డిండిమభట్టు ఢక్కను వాయింపగా, తదనుగుణముగా దేశికుల వాక్కు గంగా ప్రవాహము వలె నిరంతరాయముగా ప్రవహించి **'రఘువీరగద్యం'**గా రూపుదాల్చింది.

ఇటువంటి రచన కేవలం మహాత్ములకే సాధ్యము. ఎందుకంటే సంపూర్ణ శ్రీమద్రామాయణమును చదువుతున్న వారికి అలౌకికమైన ఆనందాన్ని కలిగిస్తూ శాంతరసనిష్పత్తి చేత పాఠకుల కనులను కరుణింపచేస్తూ, 95 గద్య వాక్యములతో కావ్యనిర్మాణము అనేది 'న భూతో న భవిష్యతి' అగుచున్నది.

బాలకాండము– దేశికులవారి వాక్– *'దేవాసుర సమర సమయ సముదిత నిఖిల నిర్జర నిర్ధారిత నిరవధిక మాహాత్మ్య!'*

**భావము–**పూర్వము దేవతలకు, అసురులకు మధ్య గొప్ప యుద్ధము జరిగెను. అందు పాల్గొన్న దేవతలు అసురులను జయించు సామర్థ్యమును లేనివారై, శ్రీమన్నారాయణుని వద్దకు చేరి తమను రక్షింపుమని వేడినపుడు, స్వామి అసురులను ఓడించి, దేవతలను కాపాడెను, అపుడు దేవతలందరు **'అధికం మేనిరే విష్ణుమ్'** అన్నట్లు తమలో అందరి కంటే విష్ణువే అధికుడని నిశ్చయించిరి కదా, శ్రీరామచంద్రా! ఇట్టి నిరతిశయ వైభవమును కలవాడవు నీవు.

***గద్యము–*** *'క్రతుహర శిఖరి కంతుక విహృత్యున్ముఖ జితహరి దంతి దంత దంతుర దశ వదన దమన కుశల దశ శత భుజ ముఖ నృపతికుల రుధిర ఝురభరిత పృథుతర తటాక తర్పిత పితృక భృగుపతి సుగతి విహతి కర నత పరుడిషు పరిఘ!'*

**భావము–** 'పూర్వము దక్షకృత అపరాధమునకుగాను శివుడు దక్షుని యజ్ఞమును ధ్వంసము గావించాడు. ఇట్టి శివుడు నివసించు పర్వతము కైలాసము, దీనిని చేతులతో రావణుడు మోసినాడు. అంతటి పరాక్రమవంతుడగు రావణుని కూడా కార్త్యవీర్యార్జునుడు జయించాడు. పరశురాముని తండ్రియగు జమదగ్నిముని పట్ల కార్త్యవీర్యార్జునుడు చేసిన అపరాధమునకుగాను కోపించిన పరశురాముడు లోకంలో క్షత్రియవంశమే లేకుండ చేస్తానని ప్రతిజ్ఞచేసి, క్షత్రియులతో ఇరవైఒక్కమార్లు యుద్ధం చేసి చంపెను. వారి రక్తప్రవాహములను మడుగుగా చేసి అందు తన పితృదేవతలకు తర్పణము చేసెను. ఇటువంటి పరాక్రమ వంతుడు పరశురాముడు, శ్రీరామచంద్రా! నీవు సీతాదేవిని పెండ్లి చేసికొని, అయోధ్యకు తిరిగి వచ్చునపుడు శివుని విల్లును నీవు విరిచితివని, విని కోపించిన ఆ పరశురాముడు తన వద్ద గల వైష్ణవధనుస్సును, బాణమును నీకు ఇచ్చి ఎక్కుపెట్టమని పల్కెను, నీవు ఆతడు పల్కినట్లె చేసి పరశురాముణ్ణి జయించితివి."

ఈ విధముగా శ్రీవేదాంతదేశికుల వారు బాలకాండము, అయోధ్యాకాండము, అరణ్యకాండము, కిష్కింధాకాండము, సుందరకాండము, యుద్ధకాండము, ఉత్తరకాండము యొక్క సారాంశమును సుందర రమణీయార్థప్రతిపాదకశబ్దములచే గద్యరూపమున రఘువీరగద్యమను ఈ గ్రంథమును రచించెను.

**కవికథక సింహకథితం కఠోర సుకుమార గుంభ గంభీరమ్।**
**భవ భయ భేషజమేతత్ పఠత మహావీరవైభవం సుధియః॥**

కవులు, తార్కికులు అను ఏనుగులకు సింహము వంటివాడై, వారిని జయించు శ్రీవేదాంతదేశికులచే ఈ గద్య రూపములోనున్న స్తోత్రము రచింపబడినది. సంసారమను వ్యాధికి భయపడువారు ఈ స్తుతిని తగిన మందుగా తలుస్తారు. దీనిని పఠించి శ్రీరామునియందు భక్తిని కల్గి, ఆ స్వామి పాదములందు ప్రపత్తిని చేసినచో సంసారబంధము తీరి మోక్షము పొందవచ్చును. శ్రీరాముని మహిమను కీర్తించు మహావీరవైభవమను ఈ రఘువీరగద్యమును మీరునూ పఠించి, ఆనందింతురు గాక.

**మనోవిశుద్ధ్యై చరితానువాదః** అన్నట్టు ఆచార్యుల గురువుల చరిత్రయొక్క అనువాదమువలన మనస్సు పరిశుద్ధి కాగలదు.

భాగవత కథాసాగరం

# ప్రియవ్రత మహారాజు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

ప్రియవ్రతమహారాజు ఉదంతము భాగవతము లోని పంచమస్కంధములో వస్తుంది. స్వాయంభువ మనువు తనయులలో ఒకడైన ప్రియవ్రతుడు తన గురువైన నారద మునికి ఒనర్చిన పాదపద్మసేవ కారణంగా మహాభాగవతు డయ్యాడు. ఆ విధంగా పరమార్థజ్ఞానంతో అతడు పరి పూర్ణత్వాన్ని పొందాడు. కాని, తండ్రి మాటను పాటించి ప్రపంచ పాలనాబాధ్యతను స్వీకరిస్తే తన భక్తిపథం తప్పు తుందని ప్రియవ్రతుడు భావించాడు. అపుడు ప్రియవ్రతునికి నచ్చజెప్పే బాధ్యత సాక్షాత్తుగా బ్రహ్మదేవుడే స్వీకరించాల్సి వచ్చింది.

పరమశక్తిమంతుడైన బ్రహ్మ స్వపార్షదులను, మూర్తీ భవించిన వేదాలను గూడి ప్రియవ్రతుడు తపస్సు చేసే ప్రాంతానికి వచ్చాడు. బ్రహ్మదేవుని ఆగమనాన్ని గమనించిన ప్రియవ్రతుడు వెంటనే తన ఆసనం నుండి లేచి నిలబడ్డాడు. స్వాయంభువ మనువు, నారదుడు కూడ అదే మర్యాదను పాటించారు. అందరి చేత ఆదరసత్కారాలను పొందిన తరువాత బ్రహ్మదేవుడు ప్రియవ్రతునికి ఉపదేశం చేశాడు. అంతట ప్రియవ్రతుడు బ్రహ్మదేవుని ఆజ్ఞను నెరవేర్చడానికి సిద్ధపడ్డాడు.

దేవదేవుని ఆజ్ఞానుసారము ప్రియవ్రతుడు ప్రాపంచిక వ్యవహారాలలో పూర్తిగా నెలకొనినప్పటికీ భగవంతుని స్మరణను మాత్రము వీడలేదు. నిజానికి అతడు పెద్దల మాటను మన్నించడానికి భౌతికజగత్తును పరిపాలించే బాధ్యతను స్వీకరించాడు. తరువాత అతడు విశ్వకర్మ తనయ యైన బర్హిష్మతిని వివాహం చేసికొన్నాడు. ఆమె ద్వారా అతనికి సౌందర్య సౌశీల్య ఔదార్యగుణాలలో తనతో సమాన మైన పదిమంది పుత్రులను పొందాడు. ఊర్జస్వతి అనే పుత్రిక కూడ ప్రియవ్రతునికి కలిగింది. ఆగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞబాహువు, మహావీరుడు, హిరణ్యరేతసుడు, ఘృత పృష్ఠుడు, సవనుడు, మేధాతిథి, వీతిహోత్రుడు, కవియను నవి ప్రియవ్రతుని పదుగురు పుత్రుల పేర్లు. వీరిలో కవి, మహావీరుడు, సవనుడు అనేవారు నైష్ఠిక బ్రహ్మచర్యాన్ని పాటించారు. చిన్నప్పటినుండే వారు బ్రహ్మచర్యంలో శిక్షణను పొంది పరమహంసాశ్రమాన్ని స్వీకరించారు. ఈ ముగ్గురు తనయులు ఇంద్రియకర్మలను పూర్తిగా నిగ్రహించి ఋషి పుంగవులయ్యారు. వాసుదేవుని చరణకమలాల పైననే వారు తమ మనస్సును కేంద్రీకరించారు.

ప్రియవ్రతునికి రెండవ భార్య వలన ఉత్తముడు, తామసుడు, రైవతుడనే ముగ్గురు పుత్రులు కలిగారు. వారందరు మన్వంతరాలకు అధిపతులయ్యారు. ప్రియ వ్రతుడు గొప్ప బలపరాక్రమాలతో పదకొండు అర్బుద సంవత్సరాలు ప్రపంచపాలనము చేశాడు. ఒక్క అర్బుదము



పదికోట్ల సంవత్సరాలకు సమానము. అతడు బలమైన తన భుజదండాలతో విల్లంబులు ఎక్కుపెట్టగానే ధర్మవిరోధు లందరు ప్రాణభీతితో పరుగు తీసేవారు. ప్రియవ్రతుని అసమాన శౌర్యమే అటువంటిది! విశ్వాన్ని ఆ విధంగా ప్రశస్తంగా పాలించే సమయంలో ఒకసారి ప్రియవ్రతునికి సూర్యప్రదక్షిణము పట్ల అసంతుష్టి కలిగింది. సూర్యుడు తన రథంలో సుమేరు పర్వతానికి ప్రదక్షిణము చేస్తూ సమస్త లోకాలను ప్రకాశింపజేస్తూ ఉంటాడు. కాని, పర్వతము యొక్క ఉత్తరదిక్కుగా పోయేటప్పుడు దక్షిణభాగము చీకటిగా ఉండడము, దక్షిణ దిశగా వెళ్ళినపుడు ఉత్తర భాగము చీకటిగా అవడము ప్రియవ్రతునికి నచ్చలేదు. అందువలన ఏ విశ్వపు భాగములో చీకటిగా అవుతున్నదో ఆ భాగాన్ని ప్రకాశింపజేయడానికి జ్యోతిర్మయ రథంలో అతడు సూర్య కక్ష్యలో చరించాడు. అపుడు విశ్వము అన్నివేళలా అన్నిచోట్ల తేజోమయంగానే అలరారింది. దేవదేవుని అర్చించడము వలననే ప్రియవ్రతుడు అంతటి అద్భుతమైన కార్యాన్ని చేయ గలిగాడు. ప్రియవ్రతుడు ఆ విధంగా తన రథాన్ని సూర్యుని వెనుక నడిపినపుడు ఆ రథచక్ర గురుతులచే సప్తసముద్రాలు ఏర్పడి భూమండలము సప్తద్వీపాలుగా విభజింపబడింది.

జంబూద్వీపము, ప్లక్షద్వీపము, శాల్మలీద్వీపము, కుశద్వీపము, క్రౌంచద్వీపము, శాకద్వీపము, పుష్కరద్వీపము అనేవే సప్తద్వీపములు. ఇవి ఒకదాని కంటే ఒకటి రెండింతలు పరిమాణాన్ని కలిగి ఉంటాయి. ప్రతి ద్వీపము ద్రవ పదార్థాలతో చుట్టబడి ఉంటుంది. ఇక సప్తసముద్రాలు వరుసగా లవణజలము, చెఱకురసము, సుర, ఘృతము, క్షీరము, పెరుగు, తియ్యని జలము అనువాటిచే నిండి ఉంటాయి. ద్వీపాలన్నీ కూడ ఈ సముద్రాలచే చుట్టబడి ఉన్నాయి. ఒక్కొక్క సముద్రము యొక్క వెడల్పు ద్వీపము యొక్క పరిమాణముతో సమానముగా ఉంటుంది. ప్రియ వ్రతుడు తన పుత్రులైన ఆగ్నీధ్రుడు, ఇధ్మజిహ్వుడు, యజ్ఞ బాహువు, హిరణ్యరేతసుడు, ఘృతపృష్ఠుడు, మేధాతిథి, వీతిహోత్రులకు ఈ సప్తద్వీపపాలనను అప్పజెప్పాడు. తండ్రి ఆజ్ఞపై వారందరు వాటికి అధిపతులయ్యారు. తరువాత ప్రియవ్రతుడు తన పుత్రికయైన ఊర్జస్వతిని శుక్రాచార్యునికి ఇచ్చి వివాహం చేశాడు. ఆమె వలన శుక్రాచార్యునికి దేవయాని అనే పుత్రిక కలిగింది.

ఈ విధంగా రాజ్యపాలనము చేసిన తరువాత ప్రియవ్రతుడు తనకు పూర్తిగా విధేయులై యున్నట్టి పుత్రులకు రాజ్యభారాన్ని అప్పజెప్పి భార్యను, సంపత్సమృద్ధమైన రాజ్యాన్ని పూర్తిగా త్యజించి ఆధ్యాత్మికపథానికే తిరిగి వచ్చి భగవద్ధామానికి చేరుకున్నాడు.

## అలమేలుమంగమ్మకు ఆరగింపులు

**శ్రీనివాస పరంధాముని పట్టపుదేవేరి పద్మావతికి ఉదయం సుప్రభాతవేళలో పాలు, పండ్లు ఆరగింపు చేస్తారు.**

**ప్రతిరోజు ముప్పూటలా పులిహోర, మిరియపు పొంగలి చక్కెరపొంగలి, దధ్యోదనాలను ఆరగింపు చేయడంతో పాటు, ప్రత్యేకంగా మొదటి నివేదనలో సీరా(రవకేసరి)ను, మధ్యాహ్నం రెండవ నివేదనలో లడ్డులను, వడలను ఆరగింపు చేస్తారు.**

**నిత్యమూ జరిగే శ్రీపద్మావతి పరిణయోత్సవవేళలో అప్పాలు, చక్కెరపొంగలి, పులిహోరలు తప్పనిసరిగా ఉంటాయి.**

**ప్రతి సాయంత్రంవేళ జరిగే ఊంజల్‌సేవలో సిరుల తల్లికి శనగగుగ్గిళ్ళ (సుండలు)ను నివేదిస్తారు.**

**రాత్రి ఏకాంతసేవా (పవళింపు) సమయంలో గోరు వెచ్చని పాలు, పంచకజ్జాయం నివేదింపబడతాయి.**

**ప్రతి గురువారం తిరుప్పావడ సేవలో పులిహోరలతో పాటు ప్రత్యేకంగా జిలేబీలు నివేదింపబడతాయి.**

**ప్రతి శుక్రవారం మధ్యాహ్నంవేళ పద్మావతికి ప్రత్యేకంగా పాయసం ఆరగింపు చేయబడుతుంది. శుక్రవారపు తోటలో ఆ మధ్యాహ్నం అభిషేకానంతరం వడపప్పు, పానకం, మిరియపు పొంగలిని, పిదప అలంకరణ అయిన తర్వాత పులిహోర, దోసెలు, సుండలు నివేదింపబడతవి.**

# చరిత్రలో 'తిరుచానూరు' క్షేత్రం

- శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు, 94919 46070

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి. ఆయన దేవేరి శ్రీపద్మావతీదేవి. శ్రీవేంకటేశ్వరస్వామి ఆపద మొక్కులవాడిగా, అనాథరక్షకుడుగా, భక్తజనప్రియుడుగా పేరు పొందితే, ఆయన దేవేరి శ్రీపద్మావతీదేవి పలుకు తేనెల తల్లిగా, భక్తకల్పవల్లి కరుణామయిగా, ప్రేమస్వరూపిణిగా పేరు పొంది అసంఖ్యాక భక్తుల ఆరాధనలందుకుంటూ ఉంది. అటువంటి శ్రీపద్మావతీ అమ్మవారు కొలువుదీరిన దివ్యక్షేత్రం– **'తిరుచానూరు'**.

తిరుమల క్షేత్రం ఎంత పవిత్రమైందో... అంతే పవిత్రతనూ... వైభవాన్ని సొంతం చేసుకున్న తిరుచానూరు చిత్తూరు జిల్లాలో తిరుపతి పట్టణానికి ఐదుకిలోమీటర్ల దూరంలో ఉంది.

పూర్వం శ్రీశుకమహర్షి ఈ ప్రాంతంలో నివసించడం వల్ల ఈ ప్రాంతానికి 'శ్రీశుకనూరు' అనే పేరు ఏర్పడింది. శ్రీశుకనూరు అనేది తమిళంలో 'తిరుచ్చుగనూరు'గా పిలువబడి... తర్వాతి కాలంలో వాడుకలో 'తిరుచానూరు' అయింది. తిరుచానూరు క్షేత్రానికే 'అలమేలుమంగాపురం', 'అలమేలుమంగపట్నం' అనే పేర్లు కూడా ఉన్నాయి.

తిరుమల క్షేత్రం ఎంత ప్రాచీనమైన చరిత్రను కలిగి ఉందో, తిరుచానూరు అంతే ప్రాచీనమైన చరిత్రను కలిగి ఉంది. పూర్వం తిరుమలకు వెళ్ళేందుకు సరైన సౌకర్యాలు లేని సమయంలో తిరుమల బ్రహ్మోత్సవాలను తిరుచానూరులోనే నిర్వహించేవారనీ, పైగా తిరుమల క్షేత్రంలో కేవలం ధ్వజారోహణం నిర్వహించేవారు. మిగతా వాహనసేవలన్నీ తిరుచానూరులోనే జరిగేవి.

తర్వాతికాలంలో శ్రీరామానుజాచార్యులవారు ఈ పద్ధతికి స్వస్తిపలికి ఉత్సవాలు తిరుమలలో జరిగే ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రతిరూపాన్ని తిరుచానూరు ఆలయంలో ఉంచుకుని పూజలు జరపడం ద్వారా తిరుమలకు వెళ్లలేని భక్తులకు



తిరుచానూరులోనే దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దానికి ముందుకాలంనాటి తమిళశాసనాల్లో పేర్కొనబడింది. స్వామివారికి తిరుచానూరులోనే ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి 'తిరువిలన్‌కోయిల్' అనీ, అందులోనిస్వామి వారికి 'తిరువేంకట పెరుమాళ్' అనీ పేర్లు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

తిరుచానూరులో సుమారు యాభైకి పైగా శాసనాలు లభించాయి. ఈ శాసనాలు అన్నీ తిరుచానూరు చరిత్రకు అద్దం పడుతూ ఉన్నాయి. వీటి ప్రకారం తిరుపతి ప్రాంతంలో తిరుచానూరు ఆధ్యాత్మిక, మత కార్యక్రమాలకు ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. క్రీ.శ. 8వ శతాబ్దం ప్రారంభంలోనే తిరుచానూరు వైష్ణవశాఖకు ఒక ప్రధాన కేంద్రంగా విలసిల్లింది. తొమ్మిదవ శతాబ్దం ప్రారంభం నుంచి అనేకమంది వైష్ణవులు వచ్చి తిరుచానూరులో స్థిర పడ్డారు. ఈ సమయానికే తిరుమలను గురించి అవగాహన ఉన్నా వెళ్లడం కష్టం కనుక వైష్ణవులతో పాటూ... భక్తులూ తిరుమల కంటే తిరుచానూరుకే అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. తిరుచానూరులోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రతి రూపాన్ని ప్రతిష్ఠించిన ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ, పూజలందుకుంటూ ఉంది. క్రీ.శ. 9వ శతాబ్దం చివరకు 'తొండమండలం' ప్రాంతాన్ని చోళులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలు తొండ మండలంలోనే భాగంగా ఉండేవి. చోళులు శైవమతాభిమానులు. చోళుల ప్రభావం వల్ల బలమైన వైష్ణవక్షేత్రంగా ఉన్న తిరుచానూరు ప్రాంతానికి శైవమతం చేరింది. చోళులు తిరుచానూరు పశ్చిమప్రాంతం (ప్రస్తుతం యోగిమల్లవరం)లో శివాలయం నిర్మించారు. అదే నేటి పరాశరేశ్వరస్వామి ఆలయం. తొండమండలంలో చోళుల అధికారం పదమూడవ శతాబ్దం మధ్యకాలం నాటికి అంతరించింది. మొదట జటావర్మ సుందర పాండ్యుడు చోళరాజ్యంలోని ఈ ప్రాంతాలను ఆక్రమించుకోవడంలో చోళుల అధికారం అంతమైంది. తర్వాత కొంతకాలం యాదవులు... ఈ ప్రాంతంలో ఆధిపత్యాన్ని చెలాయించారు. ఈ సమయంలోనే తిరుచానూరులో శ్రీకృష్ణస్వామి ఆలయాన్ని నిర్మింపజేశారు. కాగా, విజయనగరరాజ్యం క్రీ.శ. 1336వ సంవత్సరంలో స్థాపింపబడిన కొంతకాలానికే ఈ ప్రాంతం వారి స్వాధీనమైంది. వారి పాలనలో తిరుచానూరు, తిరుమలతో పాటు దేదీప్యమానంగా వెలుగొందడం ప్రారంభమైంది. విజయనగర చక్రవర్తుల కాలంలోనే శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయ ముఖమండపం నిర్మింపబడింది. తర్వాత ఆంగ్లేయులు పాలనను స్వీకరించాక తిరుమల పాలనను హథీరాంజీ మఠంకు అప్పగించింది. హథీరాంజీమఠంవారు 1843 జూలై 16వ తేదిన ఆలయపాలనాబాధ్యతను స్వీకరించి 1933 వరకు పాలనం చేశారు. ఈ సమయంలో తిరుచానూరు అభివృద్ధికి వారు కృషి చేశారు. తర్వాతి కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండళ్లు అభివృద్ధిని కొనసాగించి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాయి.

అంతేకాదు– శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తితో సేవించి, కీర్తించిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య–

చొచ్చితి తల్లీ! నీ మరుగు
సొంపుగ నీ కరుణాకటాక్ష మె
ట్లిచ్చెదొ నాకు నేడు పర
మేశ్వరి! యో యలుమేలుమంగ...

అని మొట్టమొదట శ్రీపద్మావతీ అమ్మవారిని గురించే శతకం రచించాడు.

శ్రీవేంకటేశ్వరుడిపైన అనేక కీర్తనలు రచించిన అన్నమయ్య –

'అలరులు కురియగ... నాడెనదె
అలకుల గులుకుల నలమేలుమంగ...' అని,

'పరమాత్ముడైన హరికి పట్టపురాణివి నీవు
ధర మము విచారించతగునా నీకు అమ్మా!' అనీ,

– కీర్తనలను శ్రీపద్మావతీ అమ్మవారిని గురించి రచించారు. అటువంటి తల్లి కొలువై ఉన్న తిరుచానూరును దర్శించి తీరుదాం!

ఈశానాం జగతోస్య వేంకటపతేర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్‌క్షాంతి సంవర్ధినీం
పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్॥




# కొండల రాయుడే.... కొండంత అండ...!

– శ్రీమతి ఉమాదేవి దార్వేముల, ***94412 93965***

**మా** వారు సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసరుగా రిటైరు అయినారు. యాత్రలు చేయవచ్చు అనుకున్నాము. మా మొదటి సామూహిక యాత్రగా మొత్తము 30 మంది కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిసేవా కార్యక్రమంలో పాల్గొన్నాము. అక్కడ ఎనిమిది రోజులు ఉన్నాము. మొదటి రోజు మావారు, నేను మ్రొక్కు తీయించుకొని శ్రీవారిదర్శనం చేసుకొన్నాము. మరునాడు నుండి అక్కడ ఆఫీసులో ఇచ్చిన విధంగా గ్రూపులుగా ఉండి సేవచేశాము. అవి శ్రీవారికి పూలదండలు కట్టడం, చిన్నలడ్డూలు చేయడం, కూరలు తరగడం, అన్నదానంలో వడ్డించే పని రోజూ చేశాము. రోజూ సేవకు బయలుదేరే ముందు అక్కడ శ్రీనివాసునికి నమస్కరించి 'స్వామి! మేము ముందు ముందు చేయబోవు యాత్రలలో మాకేమి కష్టములు రాకుండా కాపాడు తండ్రి!' అని మ్రొక్కుకునే వాళ్లము.

శ్రీవారిసేవలో పాల్గొన్నవారికి అందరికి భగవంతుని కటాక్షము తప్పక కలుగుతుందని మా నమ్మకం. శ్రీవారి సేవలో.. పాల్గొన్న తర్వాత మాకు ఆ స్వామి దయవలన... అమర్‌నాథ్, వైష్ణవిదేవి యాత్రలకు వెళ్ళే అవకాశం కల్గినది. అమరనాథుని మంచులింగము చూసి తరించడం జరిగింది. మేము వెళ్ళినపుడు శ్రీనగరులో కర్ఫ్యూ. వచ్చేటప్పుడు మా బస్సు మీద రాత్రి కొందరు దుండగులు రాళ్లు వేసి డ్రైవరు ముందు అద్దాలు పగులగొట్టారు. ముందు అద్దము లేకుండా మెలికలు తిరిగిన కొండలో డ్రైవ్ చేయటము చాలా కష్టము. మేమంతా ఆ దేవదేవుని ప్రార్థిస్తూ కూర్చున్నాము. ఆ వేంకటేశ్వరుడే డ్రైవరు రూపంలో ఉండి అద్దము లేని బస్సును జాగ్రత్తగా నడిపి మా అందరి ప్రాణాలు కాపాడాడు. మేము మొదట చేసిన శ్రీవారిసేవ, మా ప్రార్థనలు మన్నించి మా ఇలవేల్పు శ్రీవేంకటేశ్వరస్వామే మమ్ములను క్షేమంగా చేర్చాడు.

అక్కడ నుండి వైష్ణవిదేవి యాత్రకు వెళ్లాము. అది డోలీలో వెళ్ళాము. సగము దూరంలో పెద్ద ఉరుములు, మెరుపులతో వాన, పెద్ద పెద్ద బండరాళ్లు కొండపై నుండి క్రిందికి దొర్లడం, ఆ భీకరవాతావరణము చూసిన నేను భయపడి వెనుకకు వెళ్లదామన్నాను. వేంకటేశ్వరస్వామినే తలచుకొంటు రెండుగంటలు అలాగే కూర్చున్నాము. వర్షము కొద్దిగా తగ్గిన తర్వాత బయలుదేరాము. మరల ఆ వేంకటేశ్వరుడే డోలీని మోసే వాళ్లరూపములో మమ్ములను పైకి తీసుకువెళ్లి వైష్ణవిదేవి అమ్మవారి దర్శనముచేయించి క్రిందకు క్షేమముగా తీసుకు వచ్చారు. ఈ పెద్దయాత్ర చేసిన తర్వాత స్వామివారికి కృతజ్ఞతా పూర్వకంగా ఇద్దరం తొమ్మిదిరోజులు శ్రీవారిసేవలో రెండవసారి పాల్గొన్నాము. ఈసారి మాకు వైకుంఠము క్యూ కాంప్లెక్స్–1, 2 దగ్గర, వెండివాకిలి దగ్గర సేవలందించే భాగ్యము కల్గినది.

ఈ యాత్ర తర్వాత భక్తితో స్వామివారికి మా కృతజ్ఞతలు విన్నవించుటకు మావారు నాల్గురోజులు పరకామణి సేవలో పాల్గొన్నారు.

ప్రతిచోట, ప్రతికష్టములో అడుగడుగునా ఆ ఆపద మొక్కులస్వామి అండదండలు ఉంటాయని నమ్మకమున్నచో మనకు తప్పక జయము కలుగుతుంది. అందుకే 'శ్రీవారి సేవ'లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులుకండి.

అరణ్యవాససమయంలో ఒకరోజు పాండవులు అరణ్యంలో తిరుగుతుండగా ధర్మరాజుకు దప్పిక వేసింది. అప్పుడు ధర్మరాజు సహదేవుణ్ణి పిలిచి "సహదేవా! దగ్గరలో ఎక్కడైనా మంచినీళ్ల నదులు ఉన్నాయేమో చూసి మంచినీళ్లు తీసుకొని రమ్మని" పలికాడు. అప్పుడు సహదేవుడు ఒక పెద్ద వృక్షం ఎక్కి చుట్టూ పరికించాడు. అప్పుడు దగ్గరలో మంచి నీళ్లనది కనిపించింది.

అప్పుడు సహదేవుడు అక్కడికి వెళ్లి మంచినీళ్లనదిలో దిగి నీరు త్రాగుచుండగా అశరీరవాణి, "ఓ సహదేవా! ముందుగా నేను అడిగిన ప్రశ్నలకు సమాధానములు చెప్పి దప్పిక తీర్చుకోమని, లేదంటే నువ్వు మూర్ఛపొందుతావు" అని పలికింది.

కానీ, దాహంతో సహదేవుడు దప్పిక తీర్చుకున్నాడు. వెంటనే సహదేవుడు మూర్ఛను పొందాడు. సహదేవుడు ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో ధర్మరాజు నకులుణ్ణి చూసి ఏమి జరిగిందో చూసి రమ్మని పంపాడు. నకులుడు కూడా నది వద్దకు వెళ్లి దప్పిక తీర్చుకుంటాడు. అతడు కూడా అశరీరవాణి మాటలు వినలేదు. నకులుడు కూడా మూర్ఛను పొందాడు.

నకులుడు కూడా ఎంతసేపటికి రాకపోవడంతో ధర్మరాజు అర్జునుని పంపించాడు. అర్జునుడు కూడా నకుల, సహదేవులు చేసినదే చేసి మూర్ఛను పొందారు. అర్జునుడు ఎంతసేపటకి రాకపోవడంతో ధర్మరాజు భీముణ్ణి పంపించాడు.

భీముడు కూడా అశరీరవాణి పలుకులు వినక దప్పిక తీర్చుకున్నాడు. నకుల, సహదేవ, అర్జునులు అయినట్లుగానే మూర్ఛను పొందాడు.

అప్పుడు ధర్మరాజు స్వయంగా మంచినీళ్లనది వద్దకు బయలుదేరి, నది వద్ద తన తమ్ములైన నకుల, సహదేవ, భీమ, అర్జునులు మూర్ఛపొందడాన్ని చూసి దిగ్భ్రాంతిని ఆశ్చర్యాన్ని పొందాడు. ధర్మరాజు దప్పికబాధతో ఉండడం వల్ల మంచినీళ్లనది వద్దకు వెళ్లి దప్పిక తీర్చుకునేంతలో ఆ అశరీరవాణి మరల ఇలా పలికింది.

బాలవాక్కు

# యక్షప్రశ్నలు

"ధర్మరాజా! ఇక్కడే ఆగు, తన ప్రశ్నలకు సమాధానములు చెప్పి వెళ్లమని" పలికింది. అప్పుడు ధర్మరాజు ప్రశ్నలను చెప్పమన్నాడు. అశరీరవాణి రూపంలోని యక్షుడు వచ్చి ప్రశ్నలను అడిగాడు.

**యక్షుడు** : ధర్మాలలో ఉత్తమమైన ధర్మము ఏది?

**ధర్మరాజు** : అహింసయే పరమధర్మం.

**యక్షుడు** : లోకంలో ఎవడు ధనవంతుడు?

**ధర్మరాజు** : కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు జయించిన వ్యక్తిని ధనవంతుడంటారు.

**యక్షుడు** : గాలికన్నా వేగవంతమైనది ఏది?

**ధర్మరాజు** : మనస్సు, గాలికన్నా, వేగవంతమైనది.

**యక్షుడు** : దుఃఖానికి హేతువేది?

**ధర్మరాజు** : అత్యాశ.

**యక్షుడు** : భూమికన్నా ఓర్పుగలది ఏది?

**ధర్మరాజు** : బిడ్డలను భరించే తల్లి ఓర్పు వహిస్తుంది.

**యక్షుడు** : అత్యంత సులభమైనది ఏది?

**ధర్మరాజు** : ఇతరులకు సలహాలు ఇవ్వడం.

**యక్షుడు** : ఎక్కువ సంతోషాన్ని ఇచ్చేది?

**ధర్మరాజు** : తృప్తితో జీవించడం.

**యక్షుడు** : కీర్తికి నెలవు ఏది?

**ధర్మరాజు** : దానం.




మాస్టర్ కె.బలరామశ్రీకృష్ణగణేష్,
7వ తరగతి,
విజ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్,
కిర్లంపూడి.

**యక్షుడు** : స్వర్గసుఖాలు... ఎక్కడ ఉంటాయి?

**ధర్మరాజు** : స్వర్గానికి సత్యం, సుఖానికి శీలం కలిగి జీవించడం.

ధర్మరాజు చెప్పిన సమాధానములకు యక్షుడు యమధర్మరాజుగా ప్రత్యక్షమయ్యాడు. ధర్మరాజుతో నీ తమ్ములలో ఎవరో ఒకర్ని మాత్రమే బ్రతికించగలనని, అది ఎవరని అడుగగా, ధర్మరాజు నకులుణ్ణి బతికించమని అంటాడు.

అప్పుడు యక్షుడు బలశాలి అయిన భీముణ్ణి, వీరాధివీరుడు అయిన అర్జునునికి బదులుగా, ఆ నకులుని ఎందుకని అంటాడు. అందుకు ధర్మరాజు పాండురాజుకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్దభార్య కుమారునిగా నేను జీవించి ఉన్నానని, రెండవభార్య కుమారుడైన నకులుడు బతకడం న్యాయమంటాడు.

ధర్మరాజు ధర్మబుద్ధికి మెచ్చి అతని యొక్క నలుగురు తమ్ములను బతికించి యమధర్మరాజు తన లోకంలోకి ప్రయాణిస్తాడు.

## పద్మావతికి పరంధాముడి సారె!

(తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేష కథనం)

**పద్మావతి పుట్టినరోజుకు జరిగే పదినాళ్ల పండుగలే కార్తిక బ్రహ్మోత్సవాలు. చివరి రోజున అంటే, అలమేలుమంగమ్మ అవతరించిన "పంచమితీర్థం" నాటికి తిరుమల పరంధాముడు ప్రియంగా పుట్టినరోజు సారెను పంపిస్తాడు.**

**రెండుపట్టుచీరలను, రెండు పట్టురవిక గుడ్డలను, పసుపుముద్ద, శ్రీగంధపు కర్ర, పచ్చి పసుపుకొమ్ములతో ఉన్న పచ్చని పసుపు చెట్లు, పూలమాలలు, తులసీ మాలలతో పాటు ఒక బంగారుహారం (నగ), ఇవికాక పిండివంటలు ఒక పడి (51) పెద్దలడ్లు, ఒక పడి (51) వడలు, ఒక పడి (51) అప్పాలు, ఒక పడి (51) దోసెలు.**

**ఇలా వీటన్నింటిని ఆ రోజు ఉదయం ముందుగా తిరుమలలో శ్రీవారి మూలమూర్తికి సమర్పిస్తారు. ఆ తర్వాత వీటిని దేవస్థానం అధికారులు, పరిచార కులు, సిబ్బంది, కొత్తవెదురుబుట్టలలో పెట్టుకొని, కాలినడకన అలిపిరి పాదాల మండపం దగ్గరలో ఉన్న శ్రీపద్మావతి పసుపు మండపం దగ్గరికి వస్తారు. అక్కడి నుంచి పసుపుకుంకుమ, చీర సారెలను ఏనుగు అంబారీపైన పెట్టుకొని మేళతాళాలతో శ్రీకోదండరామ స్వామివారి ఆలయం శ్రీగోవిందరాజస్వామి ఆలయాల మీదుగా తిరుచానూరుకు చేరుకుంటారు.**

**అక్కడ శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం అర్చకులు, అధికారులు తిరుమల శ్రీవారి సారెకు దివ్యమంగళనీరాజనాలతో ఘన స్వాగతం ఇస్తారు. పిదప తిరుచానూరు పురవీథులగుండా ఊరేగింపుగా వెళ్ళి శ్రీపద్మావతి అమ్మవారికి సమర్పిస్తారు. వాటితో శ్రీపద్మావతి అమ్మవారికి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు తిరుమంజనాదులు ఘనంగా జరిపిన పిదప పద్మసరోవరంలో సుదర్శన చక్రత్తాళ్వారుకు అర్చకులు పవిత్రస్నానం చేయిస్తారు. సరిగ్గా ఆ సమయంలో వేలాది మంది భక్తులు, పవిత్రస్నానాలు చేస్తారు.**

## శ్రీనివాసుడు చేసిన సూర్యప్రతిష్ఠ

**పద్మసరోవరానికి తూర్పుతీరాన పశ్చిమాభిముఖంగా శ్రీసూర్యభగవానుని ఆలయం ఉంది. ఈ సూర్యస్వామిని సాక్షాత్తు శ్రీనివాస భగవానుడు స్వయంగా ప్రతిష్ఠించి అక్కడే మహాలక్ష్మికోసం తపస్సు చేశాడు. 12 ఏండ్ల తర్వాత ఆ సరస్సులో బంగారుపద్మంలో ఆవిర్భవించింది ఆ తల్లి. అలా ఆనందనిలయునిచే ప్రతిష్ఠింపబడిన ఈ సూర్యుని ఆలయం ఎన్నోమార్లు పునరుద్ధరింపబడింది. ఇటీవల 1866 ఏప్రిల్ 23న హథీరాంజీ మఠంవారు జీర్ణోద్ధరణ చేశారు. వైఖానస ఆగమం ప్రకారం నిత్యపూజలేకాక ప్రతి ఆదివారం ఉదయం పూటా, హస్తానక్షత్రం రోజున, శ్రీరథసప్తమి రోజున శ్రీసూర్య నారాయణస్వామివారికి అభిషేకాలతో గ్రామోత్సవం జరుగుతుంది.**

బాలప్రబోధం

# రక్షాప్రభావం


- కె.వీరాస్వామి, 98664 02327

ఒక రోజు నారద మహర్షి హరినామ గానం చేస్తూ ఆకాశమార్గంలో వెళుతున్నాడు. ఆ సమయంలో శనిదేవుడు నారదమహర్షికి ఎదురై భక్తితో నమస్కరించాడు.

"శనీశ్వరా ఏమిటి విశేషం" అని ప్రశ్నించాడు నారదుడు.

"మహర్షీ! భూలోకంలో ఒక బాలుడు పదవ తరగతి పరీక్ష వ్రాస్తున్నాడు. గత జన్మపాపం వల్ల ఈ జన్మలో విధివ్రాత ప్రకారం పరీక్ష తప్పి, చింతాలోలు డవ్వాలి. నేడు ఆఖరు పరీక్ష కాని ఆ బాలుని తల్లి కుమారుని ముంజేతికి ఒక 'రక్ష' కట్టి పరీక్షకు పంపింది. విధి వ్రాతను అమలు చేయాలనే బ్రహ్మదేవుని అజ్ఞతో నేను వెళుతున్నాను. మీ దర్శనం శుభసంకేతం" అంటూ నారద మహర్షికి నమస్కరించి పరీక్షాకేంద్రం వైపు వెళ్లాడు.

నారదమహర్షి ఈ వింత ఏమిటో చూద్దామనే ఉత్సాహంతో పరీక్షా కేంద్రం వైపు బయలు దేరాడు.



పరీక్షా కేంద్రంలో విద్యార్థి చివరి పరీక్ష కూడా సంతృప్తిగా వ్రాసి జవాబు పత్రాలు ఒక దారానికి కట్టి ఇంకా సమయం మిగిలి ఉన్నందున అమ్మ ముంజేతికి కట్టిన 'రక్ష'ను విప్పిచూస్తుండగా "ఏమిటి అది" అని పరీక్ష అధికారి ప్రశ్నించగా, ఆ 'రక్ష'ను అధికారి చేతికి ఇచ్చాడు.

ఆయన 'రక్ష'ను అటు ఇటు తిప్పి చూస్తుండగా శనీశ్వరుడు ఇదే సమయమని ప్రక్క చెట్టు పైనున్న కాకిని ఆవహించి ప్రక్క దుకాణం లోని కోడిగుడ్డును నోటకరచుకొని వెళ్ళి పరీక్షాపత్రాలపై జారవిడిచాడు.

ఆ గ్రుడ్డు పరీక్షాపత్రములపై పడి పగిలి చిన్న పక్షి బయటకు వచ్చి ఎగిరిపోయింది.

ఆ పక్షియే గరుత్మంతుడై శనిదేవుని సమీపించి నమస్కరించి "శనీశ్వరా! ఆ బాలుని 'రక్ష'లో... ఉన్నవి.... 'శ్రీ వేంకటేశ్వరస్వామివారి వ్రత అక్షింతలు'. అవి భక్తుల ఏడేడు జన్మల పాపాలను హరిస్తాయి" ఇతడు పరీక్షలో తప్పక ఉత్తీర్ణుడవుతాడు అని చెప్పి వైకుంఠం వైపు వెళ్ళాడు.

శనిదేవుడు తనలో "బ్రహ్మదేవుని ఆజ్ఞ నా శక్తి మేరకు అమలు చేశాను. ఫలితంతో నాకేమిటి సంబంధం." అనుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇదంతా చూస్తున్న నారదమహర్షి ఆశ్చర్యంతో **'ఓం నమో వేంకటేశాయ'** అంటూ తిరుమల వైపు దర్శనానికి బయలుదేరాడు. చూశారా! 'శ్రీవేంకటేశ్వర రక్ష'కు ఉన్న మహిమను గురించి తెలియజేస్తున్న ఉదంత మిది.

# తి.తి.దే. ఆలయాల ప్యాకేజి టూర్





**ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్**

## 1. స్థానిక ఆలయాలు (ప్రతి రోజు)

| టిక్కెట్టు ధర | బస్సు బయలుదేరు స్థలం | ట్రిప్పులు | బయలుదేరు సమయం |
|---|---|---|---|
| నాన్ ఎ.సి. రూ.100/-<br>ఎ.సి.రూ.150/-<br>(10 సం॥లోపు పిల్లలకు టిక్కెట్టు అవసరం లేదు) | శ్రీనివాసం కాంప్లెక్స్<br>మరియు విష్ణు నివాసం<br>తిరుపతి | 6<br>(ఆరు) | ఉదయం 6.00 నుండి<br>మ॥ 1.00 గం॥లవరకు |

### చూపబడు ఆలయములు

1) శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం --- తిరుచానూరు
2) శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం --- తొండవాడ
3) శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం --- శ్రీనివాసమంగాపురం
4) శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం --- తిరుపతి
5) శ్రీ గోవిందరాజస్వామి ఆలయం --- తిరుపతి

## 2. సమీప ఆలయాలు (ప్రతి రోజు)

| టిక్కెట్టు ధర | బస్సు బయలుదేరు స్థలం | ట్రిప్పులు | బయలుదేరు సమయం |
|---|---|---|---|
| నాన్ ఎ.సి. రూ.250/-<br>ఎ.సి.రూ.350/-<br>(10 సం॥లోపు పిల్లలకు టిక్కెట్టు అవసరం లేదు) | శ్రీనివాసం కాంప్లెక్స్<br>మరియు విష్ణు నివాసం<br>తిరుపతి | 2<br>(రెండు) | ఉదయం 8.00 గంటలకు<br>మరియు<br>ఉదయం 9.00 గంటలకు |

### చూపబడు ఆలయములు

1) శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం --- కార్వేటి నగరం
2) శ్రీ వేదనారాయణస్వామి ఆలయం --- నాగలాపురం
3) శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం --- నారాయణవనం
4) శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం --- అప్పలాయగుంట
5) శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయం --- నగరి
6) శ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం --- బుగ్గ
7) శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం --- సురుటుపల్లి

**ఇతర వివరాలకు**

**0877 - 2289123, 2289120/121, 9848007033**

# పూదత్తాళ్వార్ల సూక్తులలో 'పద్మావతి'

– డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు, 98850 03420

**పూదత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం 05-11-2019న సందర్భంగా...**

శ్రీమన్నారాయణుడే పరదైవమని నమ్మి, ఆ స్వామిని మధురమైన పాశురాలతో కీర్తించిన గొప్ప భక్తులు ఆళ్వార్లు. ఆళ్వార్లు అంటే–భగవంతుని దివ్యగుణాలనే సముద్రంలో మునిగి ఆనందించేవారని అర్థం. శ్రీమన్నారాయణవైభవాన్ని కీర్తించే ప్రయత్నంలో వీరు ఆ దేవుని సదా వెన్నంటి ఉండే లక్ష్మీదేవి మహిమను కూడా స్తుతించారు. వేదం కూడా భగవద్వైభవాన్ని వర్ణించేటపుడు 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ' అని భూదేవి, లక్ష్మీదేవుల ప్రస్తావన చేసింది కదా! ఆళ్వార్లు పాశురాలలో పలుచోట్ల లక్ష్మీదేవి స్వరూపస్వభావాలకు చెందిన ఎన్నో విశేషాలు కన్పిస్తాయి.

శ్రీవిష్ణుపురాణం "అవతారేషు విష్ణో రేషా నపాయినీ, విష్ణోర్దేహానురూపాం వై కరోత్యేషాత్మన స్తనూమ్"–భగవానుని అవతారాలు అన్నిటిలో లక్ష్మి అతనిని విడువకుండా ఉంటుంది. విష్ణువు రూపానికి తగిన రీతిలో తన రూపాన్ని గ్రహిస్తుంది అని తెల్పింది. ఈ క్రమంలోనే భగవానుడు కలియుగాదిలో తిరుమలలో వేంకటేశ్వరుడై అర్చామూర్తి అవతరించగా, లక్ష్మి పద్మావతి రూపంలో తిరుచానూరులో అవతరించింది అని శ్రీవేంకటాచలమాహాత్మ్యం తెల్పుతున్నది. ఇందువల్ల ఆళ్వార్లు పాశురాలలో కన్పించే లక్ష్మికి సంబంధించిన విశేషాలు ఆమె అవతారరూపమైన పద్మావతి దేవి వైభవాన్ని తెల్పుతున్నాయని భావించవచ్చు. ఇది ధర్మైక్యమనే శాస్త్రక్రమానికి కూడా అనుగుణం.

లక్ష్మీవైభవ ప్రకాశకమైన శ్రీసూక్తం "పద్మే స్థితామ్, పద్మవర్ణామ్, పద్మమాలినీమ్" అన్న ఈ నామాలు సామాన్యంగా చూచినపుడు లక్ష్మీదేవిని తెల్పుతున్నా, ఆమె అవతార విశేషమైన పద్మావతిపట్ల విశేషపర్యవసానాన్ని పొందుతున్నాయి. పూదత్తాళ్వార్ల పాశురాలలో భాసించే పద్మావతీ వైభవానికి చెందిన విశేషాలు దిఙ్మాత్రంగా ప్రస్తావింపబడుతున్నాయి.



పూదత్తాళ్వార్లు తులామాసంలో ధనిష్ఠానక్షత్రంలో తిరుక్కడల్‌మల్లైలో (మహాబలిపురంలో) జన్మించారు. వీరు నూరు పాశురాలను కల **'ఇరణ్డామ్ తిరువందాది'** అనే ప్రబంధాన్ని రచించారు. ఆ ప్రబంధంలోని "పనిమలరాళ్ అఙ్గమ్ వలమ్ కొణ్డాన్" అన్న 4వ పాశురంలో ఆళ్వార్లు భక్తిని అందమైన పుష్పంగా రూపించి పల్కి, ఆ భక్తిపుష్పంతో పద్మావతీ సహితుడైన శ్రీనివాసుని ఆశ్రయిస్తున్నాను–అని అన్నారు.

ఇక్కడ పద్మావతీ శ్రీనివాసుల నిత్య సంశ్లేషం సూచింపబడింది. **'తద్వక్షఃస్థల నిత్యవాసరసికామ్'** అని కదా పద్మావతీదేవి స్తుతింపబడుతున్నది అని అన్నందున పద్మావతీ పురుషకారపూర్వకంగా స్వామిని ఆశ్రయించాలనే శాస్త్రార్థం కూడా సూచింపబడింది. ఇందువల్లనే శ్రీనివాసుని దర్శనానికి ముందు పద్మావతిని దర్శించుకోవాలనే సంప్రదాయం ఏర్పడింది. పద్మావతీ సాన్నిధ్యం వల్ల భక్తుడు చేసే ఆశ్రయణం ఫలవంతమౌతుంది అనే విషయం కూడా ఇక్కడ తెలుపబడిందని ఈ ప్రబంధాన్ని వ్యాఖ్యానించిన శ్రీకృష్ణసూరి (పెరియవాచ్చాన్ పిళ్ళై) పల్కడం కూడా గమనించదగిన ఇంకొక అంశం.

52వ పాశురంలో పూదత్తాళ్వార్లు భగవానుని 'శెయ్యనెడునులరాళ్‌మార్వన్ అఱమ్ పెరియన్' (ఎఱ్ఱని, గొప్ప తామరపువులో అవతరించిన, అందులో నివసించే పద్మావతిని వక్షస్సులో కలవాడు) అనీ, 82వ పాశురంలో ఆళ్వార్లు 'వడికోల్లవాళ్ నెడుమ్‌కణ్ మామలరాళ్' అని పల్కడం కూడా పద్మావతీస్వరూపిణి అయిన లక్ష్మి వైభవాన్ని ప్రకాశింపజేస్తున్నది. "వడికట్టిన–అసారం ఏమీలేని– సౌందర్యాన్ని, కాంతిని, వైశాల్యాన్ని కల్గిన నేత్రాలను కల్గినది, గొప్ప తామర పూవులో నివసించేది అయిన పద్మావతి" అని దీని భావం.


ఈ విధంగా పూదత్తాళ్వార్ల ప్రబంధంలో పద్మావతీ వైభవాన్ని తెలిపే సూక్తులు ఇంకా ఎన్నో దర్శనమిస్తాయి.

**తత్త్వం పద్మావతీదేవ్యాం యద్గీతం భూతయోగినా।**
**తదత్ర సంగ్రహేణోక్తం తోషాయ విదుషాం సతామ్॥**

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

42

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



**( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తాম্బినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)**

**(కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్)-** లేగదూడలను కట్టడానికి చక్కని దారాలను సాధనాలుగా ఉపయోగించి నందున, ఇక దేనికీ పనికిరానివి, పలుచోట్ల జీర్ణమై నలిగిపోయి, ఒకటిగా జోడించబడిన కట్టబడినవి అయిన దారాలతో శ్రీకృష్ణుని యశోద బంధించింది. వేరొకరిని కట్టేవానితో ఇతనిని బంధించడం వీలుకాదు. సంగం, కామం, అనురాగం - మొదలైన అవస్థలను కల అనన్యభక్తి అనే దారంతోనే ఇతనికి కట్టడం సాధ్యం-అని ఇక్కడ భావం ఈ రీతిలో ఇతనిని సంబంధించిన రోలుకూడా "పొత్త ఉరలై క్కవిళ్న్దు అదన్‌మేలేఱి" (పెరియాళ్వార్ తిరు 1-10-7) (బంధించిన రోటిని విప్పి, దానిపైకి ఎక్కి) అనే రీతిలో క్రిందిభాగంలో (మూలభాగంలో) జీర్ణమైనదై, దేనికీ పనికి రానిదై, ఇతనిని కట్టడంకోసంగానే ఉన్నట్లు ఉంటుంది.

**(కట్టుణ్ణ ప్పణ్ణియ)-** దేనికీ పనికి రానిదిగా, మృదువుగా ఉన్నప్పటికీ, వక్షస్థలంలో ఉండే లక్ష్మీదేవిని, శ్రీకృష్ణభగవానుని కలిపి యశోద ఒక రోటికి కట్టినపుడు, అచేతనమైన రోలుకు, తనకు మధ్య ఏవిధమైన తేడాలేని రీతిలో స్వామి ఉన్నాడు. (రెండు అచేతనాలే- అనేటట్లు ఉన్నాడు) అయితే, ఇతనికి (శ్రీకృష్ణునకు) చైతన్యం ఉన్నం దున, బయటకు దుఃఖం పొంగిరాగా వెక్కివెక్కి ఏడ్చాడు. ఈ సౌలభ్యగుణాన్ని చూచి నమ్మాళ్వార్లు వ్యామోహాన్ని పొందారు. (ఆళ్వార్ల) మోహాన్ని చూచి మధురకవులు అభినివేశాన్ని పొందుతున్నారు.

**"కణ్ణి-నుణ్-శిఱు-త్తామ్బు"** అనే మూడు విశేష ణాలు స్వాపదేశంలో- జ్ఞానం- భక్తి- వైరాగ్యం- అనే మూడింటిని సూచిస్తాయి. అందువల్లనే వాటిని సూచించే రీతిలో ఈ దారాన్ని శ్లాఘిస్తున్నారు. రుచి, సంగం, భక్తి, పరభక్తి, పరజ్ఞానం, పరమభక్తి- అని భక్తి పలు అవస్థలను కల్గినదై, ఈసన్నని దారం కూడా పలు ముడులను కల్గి ఉన్నది అతడు భక్తికి కట్టుబడేవాడు కనుక, ఆ దారానికి కట్టుబడ్డాడు. స్వయంప్రయోజనమైన భక్తి- భగవానుడే ప్రాప్యం, ప్రాపక-అనే జ్ఞానాన్ని కల్గిస్తుంది. అందువల్ల అది సూక్ష్మమైన జ్ఞానం. **"నుణ్ తామ్బు"** అనే పదం స్వాపదే శార్థంలో ఈ సూక్ష్మమైన జ్ఞానాన్ని సూచిస్తుంది.

భక్తిని కల్గినా, అతడు తానే తనను సాక్షాత్కరింపజేసి నపుడే చేతనుడతనిని దర్శించగలడు. ఈ విషయం **"నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన, యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూగ్‌ం స్వామ్"** (కఠ-1-2-23) (ఈ పరమాత్మ భక్తి లేని శ్రవణంతో గాని, మననంతో గాని, ధ్యానంతో గాని పొంద డానికి వీలైనవాడు కాడు. ఎవనిని, ఈ పరమపురుషుడు వరిస్తున్నాడో, అతనిచేతనే పరమాత్మ పొందడానికి సాధ్య

మవుతున్నాడు. అతనికి ఈ పరమాత్మ తన దివ్యమంగళ విగ్రహాన్ని- స్వరూపాన్ని- చక్కగా దర్శింపజేస్తున్నాడు) అనే ఉపనిషద్వాక్యంలో తెలుపబడింది. **"కట్టుణ్ణ ప్పణ్ణియ"** అని అంటూ ఆ అర్థాన్ని ఇక్కడ సూచిస్తున్నారు. **"ఎట్టినోదు ఇరణ్డెనుమ్ కయిఱ్రినాల్ మనన్దన్నై క్కట్టి"** (తిరుచ్చంద-83) (ఎనిమిదితో పాటు రెండు-అంటే-పది-అనేదారంతో) అనే పాశురంలో-**"ఎట్టు, ఇరణ్డు"** (ఎనిమిది రెండు) అనే పదాలు "పత్తు"(పది) అనే పదాన్ని సూచించడంద్వారా లక్షిత లక్షణా ప్రక్రియలో భక్తిని సూచిస్తున్నాయి. **"ఎట్టుమ్, ఇరణ్డుమ్ పత్తాయ్, భక్తియై చ్చొల్లుకిఅదు"** అని అంటూ పెరియ వాచ్చాన్‌పిళ్ళై తిరుచ్చన్దవిరుత్త దివ్యప్రబంధ వ్యాఖ్యానంలో ఈ విషయాన్ని తెలిపారు. **"ఎట్టు"** అనే పదం అష్టాక్షరిని, **"ఇరణ్డు"** అనే పదం ద్వయమంత్రాన్ని సూచిస్తాయి. ఈ రెండు పదాలలో "ఒక మంత్రం ద్వారానే భగవవానుని వశీకరించుకోవడం సాధ్యం" అనే అర్థాన్ని అళకియ మణ వాళప్పెరుమాళ్ నాయనార్ తమవ్యాఖ్యలో తెలియజేశారు.

**(పెరుమాయన్)- "తొదువే శెయ్‌దు ఇళవాయ్ చ్చియర్ కణ్ణినుళ్ విడవే శెయ్‌దు విళిక్కుమ్ పిరానైయే"** (తిరువాయ్-1-7-5) (కపటాన్ని చేసి చిన్నగోపికల నేత్రాలతో కన్పించి, వారిని కటాక్షించే ఉపకారకుని) అనే రీతిలో గోపకాంతలందరు కలసి రావడంకోసం నవనీతాదులను దొంగలించడమనే సాధనాన్ని ఇతడు (శ్రీకృష్ణుడు) అనుష్ఠించగా, దానిని దర్శించడం కోసం తుల్యమైన పరువాన్ని కల స్త్రీలు అందరు రాగా, పురుషునివలె వారిని చూపుతో వశీకరించుకొన్న ఈ ఆశ్చర్యాన్ని **"పెరుమాయన్"** అని మధుర కవులు అంటున్నారు. ఆభిముఖ్యం లేనివారిని ఆభిముఖ్యాన్ని పొందేటట్లు కటాక్షిస్తాడు. ఆభిముఖ్యాన్ని కలవారిని ఆత్మ సమర్పణం చేసేటట్లు కటాక్షిస్తాడు. ప్రణయకోపాన్ని కల వారిని వారి కోపం తీరేటట్లు కటాక్షిస్తాడు. ఈ విధంగా భగవత్కటాక్షమే అన్నీ చేస్తుంది. **"తొళుకైయుమ్"** (పెరుమాళ్-తిరు-8-8) (అంజలిని చేయడం) అని అంటూ, కోపం చెందిన తనను తన భక్తులు వశం చేసికొనే ఉపాయం అంజలియే-అనే సంగతిని గ్రహించినవాడు కనుక, యశోద యొక్క కోపాన్ని తీర్చగల్గిన అంజలిని ఉపయోగించిన ఆశ్చర్య కరలీలను ఇది తెల్పుతున్నది. **"తొల్లై ఇన్బత్తు ఇఱుది కణ్డాళే"** (పెరుమాళ్ తిరు-8-8) (సనాతనమైన మహానందంయొక్క అవధిని యశోద దర్శించింది. అనుభవించింది కదా) అనే రీతిలో నిత్యముక్తులకు సైతం లభించని ఆనందాన్ని యశోదకు అనుగ్రహించిన ఆశ్చర్యాన్ని ఈ పదం తెల్పుతున్నది- అని కూడాచెప్పవచ్చు. నిత్యులు, ముక్తులు, భగవానుని జ్ఞానం, శక్తి మొదలైన గొప్ప గుణాలను దర్శించి ఆనందిస్తారు. యశోద- ఇతని అందం, భయంతో చూచే బెదరుచూపులు, పక్కచూపులు, దుఃఖంతో అందమైన ఎఱ్ఱని చిరుఅధరాలు స్పందించడం, అంజలిని చేయడం **"అళుకైయుమ్, అఞ్జినోక్కుమ్, అన్నోక్కుమ్, అణికొళ్ శెమ్‌శిఱువాయ్ నెళిప్పదువుమ్, తొళుకైయుమ్"**-(పెరుమాళ్-తిరు-8-8) (ఏడవడం, భయపడి చూడడం, చుట్టూ చూడడం, అందమైన ఎఱ్ఱని పెదవి అదరడం, అంజలి చేయడం) అనే సౌలభ్యగుణ చేష్టితాలను అన్నిటిని దర్శించింది కనుక, ఈమె దర్శించినదే బ్రహ్మానందావధి. నిత్యులు, ముక్తులు భగవానుని జ్ఞానశక్త్యాదులను అనుభవించారు. ఈమె సౌశీల్యాదులను దర్శించి ఆనందించింది. *(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి
### :: 47- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 అ | ■ | 2 మా | ని | ■ | 3 కా | 4 సు | ■ | 5 ఆం |
| న్న | ■ | ళి | ■ | 6 తి | ■ | మం | ■ | ధ్ర |
| 7 మ | హం | ■ | 8 జ | క్క | న | ■ | 9 నే | నా |
| య్య | ■ | 10 వే | ■ | న | ■ | 11 అ | ■ | య |
| ■ | 12 త్యా | గ | య్య | ■ | 13 అ | నా | మి | క |
| 14 రా | ■ | ము | ■ | 15 న | ■ | థ | ■ | శ |
| 16 మ | ల్లె | ■ | 17 క | న్న | య్య | ■ | 18 బ్రా | త |
| దా | ■ | 19 వె | ■ | య్య | ■ | 20 మొ | ■ | క |
| సు | ■ | 21 ల | త | ■ | క | ల్ల | ■ | ము |

ఆయుర్వేదం

# ఆహారం ఆరోగ్యదాయకం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

"ఆహారం సంభవం వస్తుః రోగశ్చాహార సంభవః" (చరక సంహిత)- ఆహారం వల్లనే ఈ శరీరం ఉద్భవి స్తుందని, అలా ఉద్భవించిన ఈ శరీరానికి ఆహారం వల్లనే వ్యాధులు కూడా సంభవిస్తాయని అత్యంత ప్రాచీనమైన సనాతనమైన ఆయుర్వేద వైద్యవాఙ్మయం చెబుతోంది.

అటువంటి పవిత్రమైన ప్రాణాధారమైన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవటంపై చక్కని అవగాహన కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకం. ఆ అవగాహన కోసం మరియు సందేహాల నివృత్తి కొరకు ప్రశ్నలు-జవాబుల రూపంలో ఈ చిరు ప్రయత్నం.

**(1) ఆహారంలో ఉప్పు పూర్తిగా మానివేయడం ఆరోగ్యానికి మంచిదేనా ?**

'ఉప్పు-అప్పు' అను నానుడి గురించి ఇక్కడ ప్రస్తా వించుకోవాలి. అధికంగా ఉప్పు వాడటం వల్ల మన శరీరంలో ప్రతి అణువుపై దాని ప్రభావం పడటం వల్ల అనారోగ్యం పాలై అప్పులపాలవ్వాల్సి వస్తుందని నేటి వారి అభిప్రాయం.

హై బి.పి., కొలెస్ట్రాల్, కిడ్నీ సమస్యలు ఉన్న వారు ఉప్పు బాగా తగ్గించాలి. అయితే ఆరోగ్యవంతులు ఉప్పును శత్రువుగా భావించి పూర్తిగా మానివేయడం కూడా మంచిది కాదు. చాలా మంది మన దేహానికి అవసరమైన సోడియం అంతా కూరగాయలు, ఆకుకూరలు, ఇతర ఆహార పదార్థాల నుండి సహజంగా లభిస్తుందని భావిస్తుంటారు. కాని వాతా వరణ పరిస్థితులు, శారీరక క్రియలను బట్టి రోజు 3-4 గ్రాముల ఉప్పు వాడాలని శాస్త్రరంగం సిఫారసు చేస్తుంది.

**(2) కాయగూరలని వండి తింటేనే మంచిదా ?**

వేయించడం, అధిక ఉష్ణోగ్రత వద్ద వేపుళ్ళు, ఉడి కించడం లాంటివి కాకుండా ఆయా కూరగాయలు, కాయ గూరలు మెత్తగా అయ్యేంతవరకు తేలిగ్గా ఉడికించి తినడం మంచిది. సొర, బీర, కాకర లాంటి కూరగాయల్ని చెక్కు తీయకుండా అలాగే వండడం వల్ల మన శరీరానికి ఉప యుక్తమయ్యే పోషకాలతో పాటు పీచు కూడా లభిస్తుంది. ఇక్కడ మనం ముఖ్యంగా మరొక విషయం కూడా గుర్తుంచు కోవాలి. ఈ రోజుల్లో ఆలుగడ్డలు (బంగాళదుంపలు, ఉర్ల గడ్డలు) వాడని ఇళ్ళు ఉండదంటే అతిశయోక్తి కాదు. చవగ్గా దొరకడం, ఎక్కువ రోజులు నిల్వ ఉండడం, వీటితో వంటకాలు త్వరగా చేయగలడం, రుచిగా ఉండడం ఇత్యాది కారణాల వల్ల మన ఆహారపు అలవాట్లలో ప్రధాన భాగమై పోయింది. కాని దీని వాడకంపై అవగాహనను పెంపొందించుకుని చెక్కుతో సహా వండుకొని సేవించటం వల్ల ఆ చెక్కు లోని పీచుపదార్థాలు జీర్ణప్రక్రియ నిదానంగా సాగేందుకు సహకరిస్తాయి. అందువల్ల ఆ పదార్థం సేవించిన వెంటనే జీర్ణమై రక్తంలో కలవకుండా ఉండడం వల్ల స్థూలకాయం, మధుమేహం, కొలెస్ట్రాల్ లాంటి సమస్యలు కలిగే అవకాశం తగ్గుతుంది.

చాలా రకాల కాయగూరలను, ఆకుకూరలను వండకుండా తినలేము. ఆకుకూరలు, కూరగాయలు తేలిగ్గా వండిన ఒక్కోసారి నీటిలో కరిగే విటమిన్లను నష్టపోయే పరిస్థితి రావచ్చు. కాబట్టి మనం రోజు విడిగా కేరట్, బీట్ రూట్, కీరదోస, నీరుల్లి, బెండ, దొండ లాంటి కొన్ని పచ్చి కూరగాయల ముక్కలు, పండ్లు, పండ్ల రసాలు, మొలకెత్తిన గింజలు వంటివి తప్పనిసరిగా తీసుకుంటూ ఉండాలి.

అల్లం, పుదీనా, కొత్తిమీర వంటి వాటితో చేసే రోటి పచ్చళ్లు కూడా ఉపయోగపడతాయి.

**(3) దక్షిణభారతదేశంలో ప్రధాన ఆహారంగా వాడే బియ్యం గురించి తెలియజేయండి ?**

బియ్యాన్ని ప్రధానంగా మూడు రకాలుగా ఉప యోగిస్తారు. (1) దంపుడు బియ్యం, (2) ఉప్పుడు బియ్యం, (3) మర బియ్యం. వడ్లను దంచడం వల్ల లభించే బియ్యాన్ని దంపుడు బియ్యం అంటారు. పోషకాలు, పీచు ఈ బియ్యంలో పుష్కలంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ బియ్యంతో వండిన అన్నం కంటికి ఇంపుగా ఉండకపోయినప్పటికి శరీరానికి చాలా మంచిది. ఆరోగ్య స్పృహ బాగా పెరుగుచుండడం వల్ల ప్రస్తుతం దంపుడు బియ్యం కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

వడ్లను ఉప్పు నీటిలో తడిపి, ఉడకబెట్టి, ఎండబెట్టి మర పట్టించిన బియ్యాన్ని ఉప్పుడు బియ్యం అంటారు. ఇవి వాసనగా ఉంటాయని చాలా మంది తినరు. ఇందులో కూడా పోషకాలు, పీచు సమృద్ధిగా ఉంటాయి.

అత్యధిక శాతం వాడే బియ్యం మర పట్టించినవి. వీటినే మరబియ్యం అంటారు. పాలిష్ పట్టిన ఈ బియ్యం తెల్లగా ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

**(4) ఎక్కువగా పాలిష్ చేసిన మరబియ్యం ఆరోగ్యానికి మంచిదేనా ?**

ఎక్కువగా బియ్యాన్ని పాలిష్ పట్టడం వల్ల కేవలం పిండి పదార్థం ఎక్కువగా మిగిలి పై పొరల్లోని సూక్ష్మ పోషకాలు నష్టపోవటం వల్ల మనకు మధుమేహంలాంటి వ్యాధులు వస్తాయి. ఇటువంటి ఆహారం త్వరగా జీర్ణం కావటంవల్ల మరల మరలా ఆహారం తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చి ఊబకాయంలాంటి సమస్యలకు దారితీయవచ్చు.

ఇక్కడ మరొక విషయం కూడా తెలుసుకోవాలి. బియ్యాన్ని ఎక్కువగా నీటిలో కడగటం, వండిన తర్వాత గంజి వార్చడం లాంటివి చేయడం వల్ల కూడా నీటిలో కరిగే విటమిన్‌లు అన్ని నష్టపోతాం.

**(5) ఆకుకూరలు, కూరగాయలు వండేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?**

ఆకుకూరలు, కూరగాయలులాంటి వాటిని ముందు నీటిలో శుభ్రంగా కడిగి, తుడిచి పిదప ముక్కలు చేయాలి. ముక్కలు చేసిన తరువాత నీటిలో వేయరాదు. అట్లే వీటిని వండేటప్పుడు కూడ ముందే నీటిలో వేసి వండకుండా నీరు మరుగుచున్నప్పుడు వేయడం ఉత్తమం. ఇలాంటి చిన్నపాటి జాగ్రత్త వల్ల పోషకాలు చాలావరకు నష్టపోకుండా ఉంటాం.

ఇలాంటి ఆహారాలను వండేటప్పుడు గిన్నెపై మూత పెట్టడం తప్పని సరి. లేకపోతే ఆకు కూరలలోని కెరటిన్ నష్టం కావడం వల్ల విటమిన్ 'ఎ' లోపాలు కలుగుతాయి.

కూరగాయలు, పప్పులు త్వరగా ఉడికేందుకు చాలామంది వంట సోడాను వాడుతారు. ఇందువల్ల కూడ కొన్ని పోషకాలు నశిస్తాయి.

**(6) ఆహారంలో నెయ్యిని పూర్తిగా మానేయాలనే ప్రచారంలో వాస్తవమెంత ?**

"ఋణం కృత్వా ఘృతం పిబేత్" అన్నది ప్రాచీన నానుడి. అంటే ఋణం చేసియైనను ఘృతాన్ని సేవించాలని దీని అర్థం. ఈ నెయ్యికున్న ప్రశస్తమైన ఔషధ గుణాలను మన పెద్దలు గుర్తెరిగి ఈవిధంగా నొక్కి వక్కాణించి తప్పని సరి చేయటం జరిగింది.

పాతతరం వారి జీవనశైలి, విధానాలు, శారీరక శ్రమ ఎక్కువగా ఉండటంలాంటి కారణాల వల్ల వారు నెయ్యి త్రాగినా, పోసుకున్నా, వేసుకున్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా ఉండేవారు.

ప్రస్తుత ఆధునిక కాలంలో అవగాహన లోపంతో చాలా మంది భయపడి నెయ్యిని ఆహారంలో పూర్తిగా నిషేధి స్తున్నారు. ప్రస్తుతకాలంలో మన జీవనవిధానంలో, ఆహారపు అలవాట్లలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. శారీరక శ్రమరహిత జీవనం సర్వసాధారణంగా మారింది.

అయితే మన శరానికి, అవయవాలకి అందవలసిన పోషకాలు, శక్తి దృష్ట్యా స్వచ్ఛమైన తాజా నెయ్యిని మితంగా వేసుకోవాలి తప్ప పోసుకోకూడదు. ఇలాంటి క్రొవ్వు పదార్థాలు బొత్తిగా వాడకపోతే శరీరం ఎండినట్లు కావటం, కీళ్ళ నొప్పులు లాంటి సమస్యలు రావటం జరుగుతుంది. కాబట్టి పరిమితం హితం.

# గీతాపంచామృతమ్

రచన - ఎం.సూర్యప్రసాదరావు,
ఆకృతి- 1/8 డెమ్మి, పుటలు- 240, వెల- రూ.100/-,
ప్రతులకు - ఎం.సూర్యప్రసాదరావు, రిటైర్డు లెక్చరర్,
ఇ.నెం.5-6-18/బి, పాకబందబజారు, పెట్రోలు బంకు
వెనుక, ఖమ్మం-507 001, చరవాణి-98851 56844
(పోస్టుద్వారా కోరువారికి పోస్టేజి అదనం)

ఏదైనా క్లిష్టమైన సమస్య ఎదురైనపుడు వెంటనే దానికి ఒక పరిష్కారాన్ని, మార్గాన్ని 'భగవద్గీత' చూపిస్తుంది. రచయిత ఆచార్య సూర్యప్రసాదరావుగారు తమ జంతుశాస్త్ర అధ్యాపకత్వం నుంచి సీమోల్లంఘునం చేసి తేనెలొలుకు తెలుగుసీమలో ప్రవేశించి పాండిత్యం గడించటం ఒక సాహసకృత్యమైతే, సంస్కృతాంధ్రాల్లో గల ధార్మిక వాఙ్మయాన్ని సర్వేక్షణం చేసి వాటి సారాంశాన్ని ముగ్ధమనోజ్ఞమైన వ్యావహారిక శైలిలో అక్షరబద్ధంచేసి, ప్రచురించి తన అధ్యయన విశేషాల్ని పాఠక లోకానికి అందించడంతో మహాసాహసకృత్యం చేశారు. లోకప్రసిద్ధమైంది భగవద్గీతకాగా, మిగిలిన గీతలు అందరికీ అవగాహనలో లేవు. (1)'బ్రహ్మగీత' బ్రహ్మపురాణాంతర్గతం (2)'తులాధారగీత' మహాభారతం-శాంతిపర్వంలోనిది (3)'వశిష్ఠగీత' శ్రీరామునికి, వశిష్ఠమహర్షికి మధ్య జరిగిన ఆధ్యాత్మిక సంవాదరూప సంహితం శ్రీరామాయణంలో ఉంది. (4)'గోపీ గీత'- శ్రీకృష్ణుడు తన వియోగవిరహంతో ఉన్న గోపికలకు తన స్నేహితుడైన ఉద్ధవుని ద్వారా పంపిన సందేశమే శ్రీమత్ భాగవతం-దశమస్కంధంలోనిది. (5)'అష్టావక్రగీత'. మిథిలాధిపతి జనకునికి అష్టావక్రమహర్షికి మధ్య జరిగిన అద్భుతమైన ఆధ్యాత్మిక చర్చ. భారత భాగవత రామాయణాలు మన భారతజాతికి ప్రాణస్పందనలు. భగవద్గీత మన సచ్ఛీల సంహిత.

ఈ గ్రంథం పఠితలమనస్సులకు ఆహ్లాదం కల్గించి ఆత్మజ్ఞానబోధ, ఆత్మజ్ఞానానుభూతుల్ని చేస్తుందనుట నిర్వివాదాంశం. మానవాళి జీవితాలకు ధర్మబద్ధమైన నడవడికను కల్గించి, ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందీ గ్రంథం.

*- కోగంటి వేంకట అప్పలాచార్యులు.*




# శ్రీమద్భాగవతము (ప్రశ్నోత్తరమాలిక)

రచన - డా॥ నండూరు గోవిందరావు,
ఆకృతి- 1/8 డెమ్మి, పుటలు- 410, వెల-రూ.200/-,
దొరుకుచోటు - డా॥ నండూరు గోవిందరావు,
ఫ్లాట్ నెం.303, పార్క్ వ్యూ రెసిడెన్సీ, బతుకమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట్, హైదరాబాదు - 500 013.
చరవాణి-98498 01490.

భగవాన్ వేదవ్యాసమహర్షికృత అష్టాదశ పురాణాలలో తలమానికంవంటిది శ్రీమద్భాగవత మహాపురాణం. ఇది మోక్ష గ్రంథం. వేదాలు, ఉపనిషత్తుల సారమే భాగవతం. ఈ గ్రంథంలోని అంశాలన్నిటిని ప్రశ్న-జవాబుల రూపంలో డా॥ నండూరు గోవిందరావు గారు 'ప్రశ్నోత్తరమాలిక' పేరుతో రాసి పాఠకులకు మహోపకారం చేశారు.

వీరు ఇదివరకే మహాభారతంలోని 2513 ప్రశ్నలకు, రామాయణంలోని 2212 ప్రశ్నలకు సమాధానాలు రాసి ఆ గ్రంథాలను వెలువరించారు. ఆ స్ఫూర్తితో రచయిత మహాభాగవతానికి కూడా ప్రశ్నోత్తరాలు రాశారు. ఇందులో 2980 ప్రశ్నోత్తరాలున్నాయి. నేటి తరంలో భారత, భాగవత రామాయణాలలోని కథాంశాలు తెలిసిన యువకులు, పిల్లలు కరువైనారు. రామాయణ భారత భాగవత విశేషాలు, కథాంశాలు అందులోని పాత్రలు, వారి ఉపదేశాలు, వ్యపదేశాలు తెలిసిన పెద్దలు తక్కువ. ఈ లోటును తీర్చారు నండూరు గోవిందరావు.

ఈ గ్రంథం పోటీ పరీక్షార్థులకు ఆధ్యాత్మిక విధులకు చక్కగా దోహదపడుతుంది. ఈ గ్రంథం ప్రతి ఇంటి గ్రంథాలయంలో ఉండదగింది.

*- డా॥ ఎన్.శ్రీమన్నారాయణ.*

# నవంబరు, 2019 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-**కుజుడు షష్ఠస్థానమున ఉండుటచే ధనలాభం, వస్త్రలాభం, మనోల్లాసం కల్గుతుంది. తీర్థయాత్రలు చేస్తారు. ఆచారాన్ని, నీతినియమాలను పాటిస్తారు. గృహలాభము కలుగును.



**వృషభం-**ప్రయత్నించిన కార్యాలు నెరవేరును. కొత్తగా భూమి కొనుగోలు చేస్తారు. వ్యవసాయదారులకు ఆశాజనకంగా వాతావరణం ఉండును. విద్యార్థులు శ్రద్ధవహించి పరీక్షలలో నెగ్గుకు రాగలరు.



**మిథునం-** భార్యా సంతతికి మేలు కల్గుట, ధనసంప్రాప్తం, వ్యవహారప్రతిబంధకాలు తొలగును. వ్యవసాయదారులకు అధికదిగుబడులు వచ్చి ధనధాన్యలాభాలు కల్గును. తీర్థయాత్రలు పుణ్యక్షేత్ర సందర్శనం చేస్తారు.



**కర్కాటకం-** మిత్రుల కష్టసుఖాల్లో పాలు పంచుకొని, వారిని ఆర్థికంగా ఆదుకుంటారు. ధనధాన్యలాభం, భూగృహలాభాలు కలుగుతాయి. ఇంటాబయటా మంచివాతావరణం, తలచిన పనులు నెరవేరుతాయి. తల్లికి, సుఖసంతోషాలకు కారకులౌతారు.



**సింహం-** కుమారులవల్ల సౌఖ్యం, శరీరమున వ్యాధులు తొలగిపోతాయి. వస్తు వస్త్రలాభాలు కల్గుతుంది. గృహమున కల్యాణాది శుభకార్యాలు జరుగుతాయి. ధనప్రాప్తి, పైరుపంటలు కలసి వచ్చుటచే అధికఆదాయాలు కల్గుతాయి.



**కన్య-** నూతన నిర్మాణములు కలసి వస్తాయి. విద్యార్థులు శ్రమించి పోటీ పరీక్షలలో రాణిస్తారు. విద్యార్థులు ఉన్నత చదువులకై చేయు ప్రయత్నములు అనుకూలిస్తాయి.



**తుల-** భూములను కొనుగోలు వేస్తారు. షేర్లపై పెట్టిన పెట్టుబడులు కలసి వస్తాయి. దూరపు బంధువులనుండి శుభవార్త వింటారు. తీర్థయాత్రలు, పుణ్యశ్రవణ కీర్తనము చేస్తారు.



**వృశ్చికం-** గృహమున శుభకార్య నిర్వహణ చేస్తారు. దైవబ్రాహ్మణ భక్తి, ఉపాసన బలం కల్గి హోమ క్రతువాదివిషయాలపట్ల ఆసక్తితో తగినంత ధనం వెచ్చిస్తారు. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు.



**ధనుస్సు-** గృహమున కల్యాణాది శుభపరంపరలు, నూతన వ్యక్తులతో పరిచయం, మాసాంతంలో ఇతరుల పనుల కోసం త్రిప్పట, అలసట, శుభకార్యాచరణచే ధనవ్యయం జరుగును.



**మకరం-** మనస్సున సంతోషం, కల్యాణాది శుభయోగములు కలసి వస్తాయి. గృహమున ఆనంద శోభ, మధురాన్నమును భుజించుట, వృత్తివ్యాపారాలలో వ్యక్తిగతంగా లాభపడుట, అధికఆదాయం, యత్నకార్య సిద్ధి కలుగును. విదేశీయానం కలసి వస్తుంది.



**కుంభం-** స్వతంత్ర చేతి వృత్తులవారికి ధనలాభం ప్రోత్సాహకరమగు వాతావరణము. ప్రభుత్వసంక్షేమపథకాల వల్ల ప్రయోజనం పొందుట, దైవకార్యాలలో పాల్గొనుట. అన్నదానం మొదలగునవి చేయుట, నియమపూర్వకజీవనమునకు గుర్తింపు.



**మీనం-** నిద్రలేమి వల్ల అనారోగ్యం అలసట, వేళతప్పి భుజించవలసి వచ్చుట, న్యాయపరమగు అంశాలను కోర్టుల ముందు సరిగా వివరించకబోవుటవల్ల కార్యహాని, ధననష్టం.

ఇతరుల మనస్సు నొప్పింపరాదు

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2. కావలసిన భాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3. సంవత్సర/జీవిత చందా :**

రూ.60/- ☐ రూ.500/- ☐

**4. చందా పునరుద్ధరణ :**

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.


3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

47

# వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)మహర్షి(2); 3)ధనము(2); 7)దేవోత్సవం(2); 8)విక్రమార్క చరిత్రమను కావ్యాన్ని వ్రాసిన కవి(3); 9)'నేనా అల్లరి చేసింది'– ఈ వాక్యంలో ఒక పదం(2); 12)పంచరత్నాలను రచించి గానం చేసిన వాగ్గేయకారుడు(3); 13)ఉంగరపువేలు(4); 16)జాస్మిన్ అంటే(2); 17)ప్రతి తల్లి తన కొడుకును ముద్దుగా ఇలా పిల్చుకుంటుంది(3); 18)సోదరుడు(2); 21)తీగ(2); 22)అబద్ధం(2)

### నిలువు

1)శ్రీవేంకటేశ్వరునిపై 32,000 కీర్తనల్ని రచించి గానం చేసిన వాగ్గేయకారుడు(4); 2)కొప్పు(2); 4)పువ్వు(2); 5)కాసుల పురుషోత్తమ కవి రచించిన శతకము(9); 6)భారతంలో విరాటపర్వం నుండి చివరివరకు తెనిగించిన కవి(3); 10)తొందర(3); 11)తల్లిదండ్రులు, బంధువులు లేనివానిని ఇలా అంటారు(3); 14)కంచెర్లగోపన్నకు మరోపేరు(4); 15)తెలుగులో ఆదికవి(3); 19)ధర(2); 20)తెలుగులో రామాయణాన్ని వ్రాసినకవయిత్రి(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# భక్తుల సేవలో....



శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 30-09-2019న 'శ్రీనివాస వేద విద్వత్‌సభ' ను తి.తి.దే., పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీవై.వి. సుబ్బారెడ్డిగారు ప్రారంభించి ప్రసంగించారు. వీరితో పాటు శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ మాజీ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఇ.దేవనాథన్, తి.తి.దే. అదనపు ఇ.ఓ. శ్రీఎ.వి.ధర్మారెడ్డిగారు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ పాల్గొన్నారు.




తి.తి.దేవస్థానం మహాప్రదర్శనశాలను 30-09-2019న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥శ్రీవై.వి.సుబ్బారెడ్డిగారు సందర్శించారు. వీరి వెంట పాలకమండలి సభ్యులు శ్రీ డి.పి.అనంత, ఉద్యానవనశాఖాధికారి డా॥శ్రీనివాసులు గారలు కూడా పాల్గొన్నారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా.... గ్యాలరీలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥శ్రీవై.వి.సుబ్బారెడ్డిగారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులతో దేవస్థానంవారి ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥ వై.వి.సుబ్బారెడ్డిగారు, ప్రక్కన తి.తి.దే. పాలక మండలి సభ్యులు శ్రీ యం.వెంకటమల్లికార్జున రెడ్డిగారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 01-10-2019 తేదిన తి.తి.దే. ప్రచురణలను ఆవిష్కరిస్తున్న తి.తి.దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు గౌ॥శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు, తి.తి.దే కార్యనిర్వహణాధికారి శ్రీఅనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఎ.యస్., తి.తి.దే. గ్రంథప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ టి.ఆంజనేయులు మరియు సిబ్బంది.

02-10-2019 నాడు తిరుమలలో నిర్మించిన 'మాతృశ్రీవకుళాదేవి విశ్రాంతి గృహాన్ని' తి.తి.దే. పాలక మండలి అధ్యక్షులు గౌ॥శ్రీ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభింపగా, వీరితోపాటు తిరుమల అడిషనల్ ఇ.ఓ. శ్రీఎ.వి.ధర్మారెడ్డి, తిరుపతి జె.ఇ.ఓ. శ్రీబసంత్‌కుమార్, ఐ.ఎ.ఎస్., చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రారెడ్డి, పి.ఆర్.ఓ. శ్రీటి.రవిగారలు కూడా పాల్గొన్నారు.





శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా... 07-10-2019న శ్రీవారి అశ్వవాహనసేవలో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥శ్రీ వై.వి. సుబ్బారెడ్డిగారు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఎ.యస్., తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీ డి.పి.అనంత, తి.తి.దే., ప్రధానార్చకులు శ్రీవేణుగోపాలదీక్షితులు తదితరులు.

తి.తి.దే. శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్ సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు గౌ॥శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు. ఈ సమావేశంలో తిరుపతి జె.ఇ.ఓ. శ్రీ బసంతకుమార్, ఐ.ఎ.యస్., గారు, ఎస్వీబిసి అధ్యక్షులు & డైరక్టర్ శ్రీబాలిరెడ్డి పృథ్వీరాజ్, ఎస్వీబిసి సి.ఇ.ఓ శ్రీవేంకట నగేష్ గారలు కూడా పాల్గొన్నారు.





Edited and published on behalf of T.T.Devasthanams by **Dr. K.Radha Ramana,** M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.


# తిరుమల తిరుపతి దేవస్థానముల
# ధర్మకర్తల మండలి




తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన ధర్మకర్తల మండలిని
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం అధ్యక్షుడు, సభ్యులు, ఎక్స్-అఫిషియో సభ్యులు,
ప్రత్యేక ఆహ్వానితులను నియమించింది.
వీరిచే తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి,
అదనపు కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారి, ఉన్నతాధికారులు
ప్రమాణ స్వీకారం చేయించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.
వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.



**శ్రీ చిప్పగిరి వెంకట ప్రసాద్ కుమార్**
సభ్యులు



**శ్రీ యం.ఎస్. శివశంకరన్**
సభ్యులు




**శ్రీ సంపత్ రవినారాయణన్**
సభ్యులు




**శ్రీమతి సుధానారాయణ మూర్తి**
సభ్యులు



**శ్రీ ఆర్. కుమరగురు**
సభ్యులు



**శ్రీ పుట్టా ప్రతాప్ రెడ్డి**
సభ్యులు




**శ్రీ కె. శివకుమార్**
సభ్యులు




**డా॥ మన్మోహన్ సింగ్, ఐ.ఏ.ఎస్.,**
ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ఎండోమెంట్స్
ఎక్స్-అఫిషియో సభ్యులు



**డా॥ యం. పద్మ, ఐ.ఏ.ఎస్.,**
కమీషనర్ ఎండోమెంట్స్ విభాగం, ఎక్స్-అఫిషియో సభ్యులు




**డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి**
తుడా అధ్యక్షులు, ఎక్స్-అఫిషియో సభ్యులు




**శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,**
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి, ఎక్స్-అఫిషియో సభ్యులు




**శ్రీ భూమన కరుణాకర రెడ్డి**
ప్రత్యేక ఆహ్వానితులు




**శ్రీ రాకేష్ సిన్హా**
ప్రత్యేక ఆహ్వానితులు



**శ్రీ ఎ. జె. శేఖర్**
ప్రత్యేక ఆహ్వానితులు



**శ్రీ కుపేంద్ర రెడ్డి**
ప్రత్యేక ఆహ్వానితులు



**శ్రీ గోవిందహరి**
ప్రత్యేక ఆహ్వానితులు



**శ్రీ దుష్మంత్ కుమార్ దాస్**
ప్రత్యేక ఆహ్వానితులు



**శ్రీ అమొల్ కాలే**
ప్రత్యేక ఆహ్వానితులు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printed on 25-10-2019. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

